www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 9-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 234

శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: పంచమి మ.2:29 తదుపరి షష్ఠి, నక్షత్రం: ఆశ్లేష రా.2:23 తదుపరి మఖ, వర్జ్యం: మ.3.25-4.59, దుర్ముహూర్తం: ఉ.8.49-9.33, రా.9.53-10.44, అమృతఘడియలు: రా.12.49-2.23, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.37, సూర్యాస్తమయం: 5.37 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

దూసుకొస్తున్న బుల్లెట్ ట్రైన్!

2026 నాటికి ట్రాక్ పనులు పూర్తి.. 2027లో ట్రయల్ రన్
అహ్మదాబాద్-ముంబై వాణిజ్య కారిడార్‌లో చకచకా ఏర్పాట్లు
508 కిలోమీటర్ల దూర ప్రయాణం 2.07 గంటల్లోనే పూర్తి
ఎక్కువ శాతం మెట్రో రైలు తరహాలో పిల్లర్ల మీదే ట్రాక్
గంటకు 320 కి.మీ. వేగం.. దీని కోసం ప్రత్యేక స్టేషన్లు
బుల్లెట్ ట్రైన్ వివరాలు వెల్లడించిన ఎన్‌హెచ్ఆర్‌సీఎల్

12


అహ్మదాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ ట్రాక్ నిర్మాణ పనులు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సత్యవేడులో 200 ఎకరాల అటవీ, ప్రభుత్వ భూమిని కొందరు రెవెన్యూ అధికారులు ప్రైవేటు ఖాతాలో వేసేశారు. అది బయటకు కనిపించకుండా 'మీ భూమి'లో గ్రామ అడంగల్ బ్లాక్ చేశారు. అక్రమార్కులు ఆ భూమిని తమిళనాడుకు చెందిన ఓ బడా ఆసామికి అమ్ముదామనుకున్నారు. 'సార్.. ఫలానా గ్రామంలో 200 ఎకరాల ప్రైవేటు భూమి ఉంది. నేను కొనచ్చా?' అని సదరు ఆసామి తనకు తెలిసిన ఒక అధికారి వద్ద ఆరా తీశారు. ఆ వివరాలను ఉన్నత స్థాయిలో పరిశీలించగా.. అది అటవీ, ప్రభుత్వ భూమి అని తేలింది.
వెలుగులోకి రాని ఇలాంటి చీకటి పనులు ఎన్ని ఉంటాయో?

రెవెన్యూ రాంగ్ రూటు!

పాత తప్పులు.. కొత్త తంటాలు

సీఎం ఆదేశించినా అదే అలసత్వం

ఏడాదిన్నరయినా పరిష్కారంకాని సమస్యలు
ప్రజా ఫిర్యాదుల్లో టాప్.. పరిష్కారంలో లాస్ట్
అక్రమార్కుల పని పట్టేందుకు 'టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని ఆదేశించిన సీఎం
పట్టించుకోకుండా వదిలేసిన రెవెన్యూ శాఖ
తప్పులు సరిదిద్దాలంటూ లక్షల్లో ఫిర్యాదులు
పరిష్కారంపై అధికారుల ఉత్తుత్తి లెక్కలు

ఐఏఎస్ కేడర్‌లో ఉన్న ఓ రెవెన్యూ అధికారి ఇటీవల ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఓ గ్రామానికి వెళ్లారు. అక్కడి రైతులు ఆయనను చుట్టుముట్టారు. "జగన్ పాలనలో జరిగిన తప్పులు ఇప్పుడూ జరుగుతున్నాయి. రీ సర్వే చేయమని మేం అడిగామా? సర్వే నంబర్లకు బదులు ఎల్‌పీఎమ్ నంబర్లు ఎందుకు ఇచ్చారు? మాకు అర్థంకానివి ఎందుకు అంటగడుతున్నారు? జాయింట్ ఎల్‌పీఎమ్‌లను సెటిల్ చేస్తామన్నారు. ఇప్పటి వరకు ఒక్కటీ పరిష్కారం కాలేదు" అని రైతులు మూకుమ్మడిగా మండిపడ్డారు. ఆ అధికారి బదులివ్వలేకపోయారు. 'రెవెన్యూ'పై జనంలో అసంతృప్తికి ఇదో నిదర్శనం.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతోంది. జగన్ హయాంలో రైతులను, భూయజమానులను ముప్పుతిప్పలు పెట్టిన 'రెవెన్యూ'ను గాడిన పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక సార్లు అధికారులను ఆదేశించారు. పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజలే ఫస్ట్.. అని హితబోధ చేస్తూనే ఉన్నారు. కానీ... ఆ శాఖలో మాత్రం మార్పు రావడం లేదు. రీసర్వేలో తప్పుల నుంచి 'ఫ్రీ హోల్డ్' దాకా... ఎక్కడి సమస్యలు అక్కడే! ప్రజా ఫిర్యాదులు, విన్నపాల పరిష్కారంలో రెవెన్యూ పనితీరు ఎంత అధ్వానంగా ఉందో ఆర్టీజీఎస్ నివేదికలే చెబుతున్నాయి. ఫిర్యాదుల్లో ఈ శాఖే టాప్! వాటి పరిష్కారంలో, ప్రజల సంతృప్తిస్థాయిని పెంచడంలో మాత్రం లాస్ట్! ముఖ్యమంత్రి అంటే రాష్ట్ర ప్రభుత్వ అధిపతి. కానీ... రెవెన్యూ శాఖ సీఎం ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఇందుకు ఉదాహరణ...

మిగతా 12వ పేజీలో...

ఐదేళ్లలో

7 లక్షల కోట్ల జీఎస్డీపీ నష్టం

ఏపీని దెబ్బతీసిన వైసీపీ విధ్వంసక పాలన: సీఎం

విభజన కంటే ఆ పార్టీతోనే ఎక్కువ నష్టపోయాం
పీపీఏల రద్దుతో విద్యుత్ వాడుకోకుండానే రూ.9 వేల కోట్లు చెల్లింపు
బ్రాండ్ పోవడంతో అధిక వడ్డీలకు రుణాలు
వ్యవస్థలను తిరిగి మేం గాడిలో పెడుతున్నాం
కూటమి విధానాల ఫలితమే జీఎస్డీపీలో వృద్ధి
2025-26 రెండో త్రైమాసికంలో 11.28% వృద్ధి
ఆర్థిక సంవత్సరం చివరికి 17.11% వృద్ధే లక్ష్యం
ప్రతి త్రైమాసికాన్నీ పర్యవేక్షిస్తున్నాం
పరిశ్రమలు, సాగు, సేవా రంగాల్లో పురోగతి
గణాంకాలను విడుదల చేసిన సీఎం చంద్రబాబు


విలేకరుల సమావేశంలో జీడీపీ, జీఎస్డీపీ గణాంకాలను వివరిస్తున్న సీఎం చంద్రబాబు

తప్పులు చేస్తారు.. చేసిన వారిని సమర్థిస్తారు

ఇదే వైసీపీ నాయకుల నైజం.. వెంకన్న సొమ్ము చోరీ చిన్న నేరమా?
తలాతోక లేని పార్టీ.. సర్కారుపై బురద చల్లడమే పని.. సీఎం ఫైర్

13

కక్ష పూరిత రాజకీయాలతో గత పాలకులు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. పీపీఏలను వైసీపీ రద్దు చేయడంతో ఒక్క యూనిట్ విద్యుత్‌ను కూడా వాడుకోకుండానే రాష్ట్రం రూ.తొమ్మిది వేల కోట్లు చెల్లించాల్సి వచ్చింది. జగన్ ఐదేళ్ల పాలనలో ధ్వంసమైన వ్యవస్థలన్నింటినీ గాడిలో పెట్టుకుంటూ ముందుకు వెళుతున్నాం. ప్రజలపై భారం వేయకూడదన్న లక్ష్యంతో విద్యుత్తు చార్జీలను పెంచడం లేదు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని బయటపడేయగలిగాం. మరికొన్ని ఇబ్బందులు ఉన్నాయి. వాటినీ త్వరలోనే అధిగమిస్తాం.
- సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజనకంటే ఐదేళ్ల వైసీపీ పాలన వల్లే ఎక్కువ నష్టం జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గత పాలకుల విధ్వంసం వల్ల వృద్ధి రేటు తగ్గిపోవడంతో ఐదేళ్లలో రూ.ఏడు లక్షల కోట్ల విలువైన రాష్ట్ర స్థూల ఉత్పత్తిని (జీఎస్డీపీ) కోల్పోయామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచీ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామన్నారు. ప్రతి త్రైమాసికం, ఆర్థిక సంవత్సరంలో సాధిస్తున్న జీఎస్డీపీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజలకూ అవగాహన ఉండాలన్న ఉద్దేశంతో

మిగతా 13వ పేజీలో...



13

'ఖాకీ' కొడుకే కారకుడు!

కారు ప్రమాదానికి కారణం అతడి ముఠాయే
రవాణా అధికారుల వేషంలో హైవేపై దందాలు
'పేట' బైపాస్‌లో లారీని ఆపిన గ్యాంగ్
లారీ హఠాత్తుగా ఆగడంతో వెనుక నుంచి ఢీకొన్న కారు
ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల దుర్మరణం



11

నేటి అర్ధరాత్రి నుంచి లారీల సమ్మె

గూడ్స్ వాహనాల ఫిట్‌నెస్ చార్జీలు తగ్గించాలని డిమాండ్




14

ఏజెన్సీ గజగజ

అరకు లోయలో 3.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత
ఈ ఏడాదిలో ఇదే అత్యల్పం

వందేమాతరానికి నెహ్రూ ద్రోహం

జిన్నాకు తలొగ్గి గేయాన్ని ఛిన్నాభిన్నం చేశారు: మోదీ
సామాజిక సామరస్యం ముసుగులో రెండు చరణాలకు కుదించారు
ఇప్పటికీ అదే బుజ్జగింపు రాజకీయం.. కాంగ్రెస్‌పై ప్రధాని ధ్వజం





తిప్పికొట్టిన ప్రియాంక

బెంగాల్ ఎన్నికల కోసమే దీనిపై చర్చ
స్వాతంత్య్రం కోసం నెహ్రూ 12 ఏళ్లు జైల్లో ఉన్నారు
మోదీ ఆత్మవిశ్వాసం తగ్గుతోందన్న కాంగ్రెస్ నేత
కాంగ్రెస్‌లో పశ్చాత్తాపమే లేదని బీజేపీ ఆగ్రహం
లోక్‌సభలో 11 గంటలకు పైగా సుదీర్ఘ చర్చ

న్యూఢిల్లీ, డిసెంబరు 8: ముస్లింలీగ్ నేత మహ్మదాలీ జిన్నాకు తలొగ్గి.. ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వందేమాతర గేయానికి ద్రోహం చేశారని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. దానిని ఛిన్నాభిన్నం చేసి.. భారత్‌ను బుజ్జగింపు రాజకీయాల వైపు తీసుకెళ్లారని ఆక్షేపించారు. బంకించంద్ర ఛటర్జీ 1875లో 'వందేమాతరం' గేయాన్ని రాశారు. ఇది జరిగి 150 ఏళ్లయిన సందర్భంగా సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు లోక్‌సభలో ప్రధాని ప్రత్యేక చర్చను ప్రారంభించారు. అర్ధరాత్రి 11.42 గంటల వరకు సుదీర్ఘంగా ఇది

మిగతా 2వ పేజీలో...


ఏడో రోజూ అంతే!

కొనసాగిన ఇండి'గోల'.. సోమవారం 562 విమానాల రద్దు
6 మెట్రో ఎయిర్‌పోర్టులపై ఇండిగో తీవ్ర ప్రభావం.. సమస్య తీవ్రం: సీజేఐ
రేపటికి దారిలోకి: ఇండిగో.. కేంద్రం జవాబు చెప్పాలి.. లోక్‌సభలో విపక్షాలు
కఠిన చర్యలు తప్పవు.. 2 రోజుల్లో పరిస్థితి మార్చాం.. రాజ్యసభలో రామ్మోహన్
విమర్శలు పట్టించుకోవద్దు: మోదీ.. కేంద్ర మంత్రికి ప్రధాని దన్ను

2

మార్కెట్ ధమాల్.. 7.12 లక్షల కోట్లు ఆవిరి

10


ఇండిగో విమానాలు నిలిచిపోవడంతో ఢిల్లీ ఎయిర్‌పోర్టులో పోగుపడిన ప్రయాణికుల లగేజీ

హవాలా దోపిడీ!

సత్యసాయి జిల్లాలో సినీఫక్కీలో ఘటన

సూరత్ నుంచి బెంగళూరుకు రూ.4.30 కోట్ల నగదు
ఇన్నోవా వాహనంలో రహస్యంగా తరలింపు
అడ్డుకుని, కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లిన మరో ముఠా
అదే దారిలో కారులో వెళ్తూ దోపిడీని గుర్తించిన ఓ టెకీ
రంగంలోకి పోలీసులు.. 2 కార్లూ వదిలేసి వెళ్లిన గ్యాంగ్
జీపీఎస్‌తో దానిని వెతుక్కుంటూ వచ్చిన 'బాధితులు'
ఒక కారులో రూ.1.20 కోట్ల నగదు స్వాధీనం

12



శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం హరిపురం వైజంక్షన్ సమీపంలో దోపిడీ దృశ్యం (సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కారు డ్యాష్ కెమెరాలో రికార్డు అయినది)

1,566 స్క్రబ్ టైఫస్ కేసులు



12

ఆ లక్షణాలతో ఇప్పటివరకు తొమ్మిది మంది మృతి
మరణాలకు కారణాలపై పరిశోధన చేయాలి
బోధనాస్పత్రులు, పీహెచ్‌సీల్లో నిర్ధారణ పరీక్షలు
ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో కేసులు తక్కువే
ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడి



లాఠీతో కాదు.. డేటాతో!

ఆధునిక నేరాల కట్టడికి అధునాతన పోలీసింగ్
ఫ్యూడల్ పోలీసింగ్ స్థానంలో హ్యూమన్ టచ్
సైబర్ కమెండోలుగా ట్రైనీ కానిస్టేబుళ్లు
సైబర్, ఆర్థిక మోసాలపై నిపుణులతో క్లాసులు
'ఐ గాట్ కర్మయోగి' యాప్‌తో వీలైనప్పుడల్లా వినొచ్చు
16న దేశంలోనే నంబర్ వన్ శిక్షణకు సీఎం శ్రీకారం

13

సంక్రాంతి నుంచి సేవలన్నీ ఆన్‌లైన్: సీఎం


పల్లె రోడ్లకు మహర్దశ

2,123 కోట్లతో 4,007 కి.మీ. మేర నిర్మాణం

కేంద్ర పథకం సాస్కి నిధులతో పనులు
పునర్నిర్మాణానికి డిప్యూటీ సీఎం శ్రీకారం
మొత్తం 12,999 పల్లె రహదారులు
157 నియోజకవర్గాలు.. 484 మండలాల్లో
నేడో, రేపో పరిపాలనా ఉత్తర్వులు

అమరావతి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో ఉన్న గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనుంది. గత ప్రభుత్వ హయాంలో మరమ్మతులకు నోచుకోని పంచాయతీరాజ్ రోడ్లను పునర్నిర్మించేందుకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

మిగతా 14వ పేజీలో...



తిరుమల తరహాలో 5 వేల ఆలయాలు

సీఎం సూచనలతో నమూనాల్లో మార్పులు
700 ఆలయాలకు దరఖాస్తులు, 206కు ఓకే
ధ్వజస్తంభాల కోసం సొంతంగా చెట్ల పెంపకం
అన్ని శ్రీవారి ఆలయాల్లోనూ అన్న ప్రసాదం

'ఆంధ్రజ్యోతి'తో టీటీడీ ఈవో సింఘాల్

14

మెకాలే మనస్తత్వంతో మన చరిత్రకు తీరని నష్టం

» జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య, స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ చరిత్రనూ చెరిపేశారు

» లోక్‌సభలో టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి

న్యూఢిల్లీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మెకాలే మనస్తత్వం దేశంలోని గొప్ప వీరుల, త్యాగధనుల, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య వంటి మహనీయుల చరిత్రను పద్ధతి ప్రకారం చెరిపివేసిందని టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి విమర్శించారు. సోమవారం, లోక్‌సభలో వందేమాతరంపై జరిగిన చర్చ సందర్భంగా ఆమె మాట్లాడారు. వలసవాద కాలం నాటి 'మెకాలే మనస్తత్వం' భారత చరిత్ర, విద్యా వ్యవస్థపై చూపిన దీర్ఘకాలిక ప్రభావాన్ని ఆమె ఎత్తిచూపారు. 'మహనీయుడు పింగళి వెంకయ్య మన జాతీయ జెండా రూపశిల్పి, ఆంధ్ర రాష్ట్ర ముద్దుబిడ్డ. నా పూర్వీకులు పుట్టిన ఊరు కోయలకుంట్ల. ఆ గ్రామం ఇప్పుడు నేను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఉంది. ఆ ఊరికి చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి. ఇలాంటి వారి చరిత్రను పాఠ్య పుస్తకాల నుంచి తొలగించారు. మరుగున పడిన స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను ప్రధాని మోదీ పునరుద్ధరించారు. పీఎం చర్యలతో భారత చరిత్రకు వలసవాదం నుంచి విముక్తి లభిస్తోంది. వందేమాతరం దేశ చరిత్రను మాత్రమే కాదు... పూర్వీకుల ధైర్యం, త్యాగం, స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. కొంతమంది నాయకులు ఈ పాటను గౌరవించడానికి ఎందుకు వెనుకాడతారో తెలియడం లేదు' అని ఎంపీ శబరి విమర్శించారు.

సీమలో వందేమాతరం స్ఫూర్తి: ఎంపీ లక్ష్మీనారాయణ

'వందేమాతరం గీతం శక్తి దేశంలో అత్యంత సుదూర ప్రాంతాలకు... ముఖ్యంగా రాయలసీమకు, మా అనంతపురం జిల్లాకు సైతం చేరింది. మహాత్మా గాంధీ తాడిపత్రి, హిందూపురం, పెద్దవడుగురు వంటి ప్రాంతాలను సందర్శించి ప్రజలను స్వాతంత్ర్య ఉద్యమంలో చేరమని పిలుపునిచ్చారు' అని అనంతపురం టీడీపీ ఎంపీ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం వందేమాతరంపై పార్లమెంటులో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. కొత్తపల్లి గ్రామస్తులు 1946లో బ్రిటిష్ వారు అనంతపురం నుంచి బళ్లారికి అటవీ సంపద తరలించకుండా అడ్డుకోవడానికి ఒక వంతెనను ధ్వంసం చేసిన అసాధారణ ధైర్యాన్ని ఈ సందర్భంగా ఆయన ఉదహరించారు. అందుకు గ్రామస్తులు రూ.5,000 భారీ జరిమానా చెల్లించారని వివరించారు. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం ఆ సొమ్మును వాపసు చేయగా దానిని ఊరిలో ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి వినియోగించడం వందేమాతరం స్ఫూర్తికి నిదర్శనమని ఎంపీ వివరించారు.

చంద్రారావు ధైర్యసాహసాలు చిరస్మరణీయం: ఎంపీ తంగెళ్ల

'అహింసా ఉద్యమం రాకముందే బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు చేసిన ద్వారబంధాల చంద్రారావు ధైర్యసాహసాలు చిరస్మరణీయం' అని జనసేన పార్టీ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన పార్లమెంటులో మాట్లాడారు. జాతీయోద్యమంలో మహిళలను సమీకరించి, జైలు జీవితాన్ని అనుభవించిన ధీర వనిత దువ్వూరి సుబ్బమ్మ సేవలను ఎంపీ స్మరించుకున్నారు. గాంధీజీ దండి మార్చ్ స్ఫూర్తితో తూర్పు గోదావరిలోని ఉప్పాడ, కోటిపల్లి గ్రామాల్లో ఉప్పు సత్యాగ్రహం జరిగిందని, జాతీయోద్యమంలో ఆంధ్ర తీరం గుజరాత్‌తో భుజం భుజం కలిపి నిలిచిందని ఎంపీ తంగెళ్ల వివరించారు.

ఐదున్నరేళ్లలో 6.15 లక్షల కోట్ల లోన్లు రైటాఫ్

న్యూఢిల్లీ, డిసెంబరు 8: గత ఐదున్నరేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లు రూ.6.15 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ చేశాయని లోక్‌సభలో కేంద్రం తెలిపింది. 'ఆర్బీఐ డేటా ప్రకారం.. గత ఐదు ఆర్థిక సంవత్సరాలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరు 30 వరకు ప్రభుత్వ రంగ బ్యాంకులు మొత్తం రూ.6,15,647 కోట్ల రుణాలను రైటాఫ్ చేశాయి' అని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వక సమాధానంలో పేర్కొన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరం నుంచి పీఎస్‌బీలకు ఎటువంటి మూలధన సాయం చేయలేదని.. ఆయా బ్యాంకులు తమ ఆర్థిక పనితీరు, మూలధన స్థితిని గణనీయంగా మెరుగుపర్చుకుని లాభదాయకంగా మారాయన్నారు.

హమాస్‌ను ఉగ్రవాదసంస్థగా ప్రకటించండి!

» భారత్‌కు ఇజ్రాయెల్ విజ్ఞప్తి

జెరూసలేం, డిసెంబరు 8: పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని భారత్‌ను ఇజ్రాయెల్ కోరింది. భారత్‌లో పలు ఉగ్ర దాడులకు కారణమైన పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తాయిబాను తాము 2023లోనే టెర్రరిస్టు సంస్థగా గుర్తిస్తూ నిషేధించామని, ఇప్పుడు భారత్ నుంచి అదే రకమైన స్పందనను కోరుకుంటున్నామని పేర్కొంది. ఈ మేరకు ఇజ్రాయెల్ విదేశాంగశాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి సోమవారం విలేకర్లతో మాట్లాడారు. 'హమాస్‌కు లష్కరే తాయిబాతోపాటు పలు ఇరాన్ ప్రాయోజిత మిలిటెంట్ గ్రూపులతో సాన్నిహితం పెరుగుతోంది. దీనివల్ల భారత్, ఇజ్రాయెల్‌లకు భద్రతాపరంగా ముప్పు రోజురోజుకూ అధికమవుతోంది' అని తెలిపారు.

ఉమీద్ పోర్టల్‌లో 5.17లక్షల ఆస్తుల నమోదు

న్యూఢిల్లీ, డిసెంబరు 8: వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు సంబంధించి కేంద్రం తీసుకువచ్చిన ఉమీద్ పోర్టల్‌లో గడువు ముగిసే నాటికి (డిసెంబరు 6) 5,17,040 ఆస్తుల వివరాలను అప్‌లోడ్ చేశారు. అయితే, ఇందులో ఇప్పటివరకు 2,16,905 ఆస్తులను మాత్రమే వక్ఫ్ ప్రాపర్టీలుగా సంబంధిత అధికారులు ఆమోదించారు. 10,869 ఆస్తులను తిరస్కరించారు. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మేరకు కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సమాచారాన్ని విడుదల చేసింది. ఉమీద్ పోర్టల్‌లో అత్యధికంగా యూపీ నుంచి 92,830 ఆస్తులను నమోదు చేయగా, 62,939ఆస్తులతో మహారాష్ట్ర తర్వాతి స్థానంలో ఉంది. వక్ఫ్ ఆస్తులను డిజిటలైజ్ చేయాలన్న ఉద్దేశ్యంతో కేంద్రం జూన్ 6న ఉమీద్ పోర్టల్‌ను తీసుకువచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తులను అందులో రిజిస్టర్ చేసుకోవాలని సూచించింది. ఇందుకు ఆరు నెలల గడువు ఇస్తూ డిసెంబరు 6ను డెడ్‌లైన్‌గా విధించింది.

సిద్దరామయ్యకు సుప్రీంకోర్టు నోటీసు

బెంగళూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సీఎం సిద్దరామయ్య అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని దాఖలైన పిటిషన్‌కు స్పందించిన సుప్రీంకోర్టు ఆయనకు సోమవారం నోటీసులు జారీ చేసింది. మైసూరు జిల్లా వరుణ నియోజకవర్గం నుంచి 2023లో సిద్దరామయ్య ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయన అక్రమాలకు పాల్పడ్డారని శంకర్ అనే వ్యక్తి గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు కొట్టివేయడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ విక్రమనాథ, జస్టిస్ సందీప్ మెహతా నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌ను సోమవారం విచారించింది. దీనికి బదులివ్వాలని సీఎం సిద్దరామయ్యతో పాటు ఎన్నికల కమిషన్‌కు నోటీసులిచ్చింది.

రేప్ కేసుల విచారణలో జడ్జిల అనుచిత వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు అసంతృప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 8: అత్యాచార కేసుల విచారణ సందర్భంగా జడ్జీలే బాధితుల పట్ల సున్నితత్వం లేని వ్యాఖ్యలు చేస్తుండడాన్ని సోమవారం సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఇలాంటి మాటలు బాధితులతో పాటు వారి కుటుంబసభ్యులు, మొత్తం సమాజాన్నే వణికిస్తాయని తెలిపింది. ఇటువంటి సంఘటనలన్నింటినీ పరిశీలించి హైకోర్టులు, ట్రయల్ కోర్టులకు మార్గదర్శకాలు జారీచేస్తామని ధర్మాసనం తెలిపింది. మార్చి 17న అలహాబాద్ హైకోర్టు చేసిన వ్యాఖ్యలపై సుమోటోగా జరుపుతున్న విచారణ సందర్భంగా ఈ విషయాన్ని వెల్లడించింది. మైనర్ బాలిక స్థనాలను తాకడం, ఆమె పైజామా తాడు లాగడం, లోదుస్తులను లాగడానికి ప్రయత్నించడాన్ని అత్యాచార ప్రయత్నాలుగా పరిగణించలేమంటూ హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొనడంపై విచారణ జరిపింది. ఈ సందర్భంగా ధర్మాసనం దృష్టికి కొందరు న్యాయవాదులు మరికొన్ని ఉదంతాలను తీసుకెళ్లారు. సీనియర్ న్యాయవాది శోభా గుప్తా మాట్లాడుతూ 'రాత్రి వేళ సంఘటన జరిగిందంటే.. బాధితురాలు నిందితుడ్ని ఆహ్వానించినట్టే'నని మరో కేసులో ఇదే హైకోర్టు మౌఖికంగా వ్యాఖ్యానించిందని తెలిపారు. అన్నింటినీ పరిశీలించి సమగ్రంగా మార్గదర్శకాలు ఇస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది.

వందేమాతరానికి నెహ్రూ ద్రోహం

(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. పాలక, ప్రతిపక్షాల నడుమ మాటల తూటాలు పేలాయి. 1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంతో బ్రిటిష్ సామ్రాజ్యం గడగడలాడిందని.. ఆ తర్వాత వందేమాతర గేయం దానిని సవాల్ చేసిందని.. స్వాతంత్ర్య పోరాటాన్ని ఉగ్రూతలూగించి.. స్వాతంత్ర్య సాధన దిశగా జాతీయ సంకల్పానికి ప్రతీకగా నిలిచిందని.. దీని వల్లే దీనిని భారత జాతీయ గీతంగా చేయాలని మహాత్మాగాంధీ అభిలషించారని ఆయన చెప్పారు. గాంధీజీ మనోభావాలను తోసిరాజని.. ఈ గేయాన్ని వివాదంలోకి నెట్టి ఎందుకు ద్రోహం చేశారో తనకు అర్థం కాలేదన్నారు. 'ముస్లింలీగ్ నాయకుడు మహ్మదాలీ జిన్నా లఖ్‌నవూలో 1937 అక్టోబరు 15న వందేమాతరంపై తన వ్యతిరేకత వ్యక్తంచేశారు. ఆ తర్వాత ఐదు రోజులకే నెహ్రూ నేతాజీకి లేఖ రాశారు. బంకించంద్ర చటర్జీ 'ఆనందమఠ్' నవల కోసం ఈ గేయాన్ని రాశారని.. ఈ నేపథ్యం ముస్లింలను ఇబ్బందిపెట్టే అవకాశముందని అందులో పేర్కొన్నారు. బంకించంద్ర స్వరాష్ట్రమైన బెంగాల్లోనే.. కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం వందేమాతరంపై సమీక్ష జరిపింది. అక్టోబరు 26న సామాజిక సామరస్యం ముసుగులో.. గేయాన్ని రెండు చరణాలకు కుదించాలని నిర్ణయించింది. దీంతో యావద్దేశం దిగ్భ్రాంతికి గురైంది. కాంగ్రెస్ నిర్ణయానికి వ్యతిరేకంగా దేశభక్తులు నిరసనలు చేపట్టారు. ముస్లింలీగ్‌కు కాంగ్రెస్ మోకరిల్లి బుజ్జగింపు రాజకీయాలకు దిగిందనడానికి చరిత్ర తార్కాణంగా నిలిచింది. సదరు రాజకీయాల ఒత్తిడితోనే వందేమాతరంతోపాటు దేశవిభజనకూ తలొగ్గింది' అని మండిపడ్డారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాల వైఖరి ఇప్పటికీ మారలేదని.. బుజ్జగింపు రాజకీయాలు కొనసాగిస్తూ.. వందేమాతరంపై వివాదాలు సృష్టించే యత్నాలు చేస్తూనే ఉన్నాయన్నారు.

పూర్వవైభవం తేవాలి: రాజ్‌నాథ్

వందేమాతరం పూర్తి గేయం గానీ, ఆనందమఠ్ నవల ఇస్లాంకు వ్యతిరేకం కాదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నొక్కి చెప్పారు. నాటి బెంగాల్ నవాబుకు, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజల మనోభావాలను అవి ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వందేమాతరాన్ని నిర్లక్ష్యం చేశామని, దానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యం ఇవ్వలేదని చెప్పారు. దానికి పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపిచ్చారు. కాగా, గాంధీ కుటుంబాన్ని, కాంగ్రెస్‌ను మోదీ ఎండగడుతున్నందున.. అపరాధ భావనతోనే రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ సభలో వందేమాతరంపై మోదీ ప్రసంగించే సమయంలో గైర్హాజరయ్యారని బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా ఆరోపించారు. వందేమాతరం విషయంలో కాంగ్రెస్‌లో పశ్చాత్తాపమే లేదని మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ ధ్వజమెత్తారు. ఇంకా తేజస్వి సూర్య (బీజేపీ), బైరెడ్డి శబరి, జి.లక్ష్మీనారాయణ (టీడీపీ), సునీల్ తత్కరే (ఎన్‌సీపీ), రాజ్‌కుమార్ సాంఘ్వాన్ (ఆర్‌ఎల్‌డీ), దీపేందర్ హూడా, పరిణితి షిండే, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్), మహువా మొయిత్రా, కాకోలీ ఘోష్ దస్తీదార్ (టీఎంసీ), అవధేశ్ ప్రసాద్, ఇఖ్రా చౌధరి, ప్రియా సరోజ్ (సమాజ్‌వాదీ), అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం) తదితరులు చర్చలో పాలుపంచుకున్నారు. బీజేపీ ఎంపీ జగదంబికాపాల్ ప్రసంగం తర్వాత సభను స్పీకర్ ఓం బిర్లా మంగళవారానికి వాయిదావేశారు. వందేమాతరంపై నేడు రాజ్యసభలో చర్చ జరుగనుంది.



బంకిన్ దా కాదు.. బంకిన్ బాబు!

బంకించంద్ర ఛటర్జీని మోదీ తన ప్రసంగంలో 'బంకిన్ దా' అని పిలవడంపై టీఎంసీ ఎంపీ సౌగతారాయ్ అభ్యంతరం తెలిపారు. దీంతో ప్రధాని వెంటనే 'బంకిన్ బాబు' అని సరిదిద్దుకున్నారు. సౌగతారాయ్‌ను దాదా అనే అంటానని.. దీనిపైనా అభ్యంతరం చెబుతారా అని చురకంటించారు. కాగా, వందేమాతరంపై చర్చ కోసం ప్రధాని సోమవారం సభలో అడుగు పెట్టగానే..బీజేపీ ఎంపీలు 'బిహార్ కీ జీత్ హమారీ హై...అబ్ బెంగాల్ కీ బారీ హై(తర్వాతి వంతు బెంగాల్‌దే)' అని స్వాగతం పలికారు.

మహా అసెంబ్లీలో పూర్తిగా ఆలాపన

మహారాష్ట్ర అసెంబ్లీలో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించారు. సోమవారం శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. సంప్రదాయం ప్రకారం ఉభయ సభల్లోనూ వందేమాతరం తొలి రెండు చరణాలను ఆలపించాక రాష్ట్ర గీతం 'జై జై మహారాష్ట్ర' గేయాన్ని ఆలపించారు. అయితే, వందేమాతరం 150 సంవత్సరాల సందర్భంగా ఈ ఏడాది వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించాలని అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్, మండలి ఛైర్మన్ రామ్ షిండే సూచించారు. దీంతో ఉభయసభల్లోనూ వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించారు.

మోదీ ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతోంది: ప్రియాంక



మోదీ వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తిప్పికొట్టారు. ఆయన ఆత్మవిశ్వాసం రోజురోజుకూ సన్నగిల్లుతోందన్నారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం వందేమాతరంపై చర్చను చేపట్టిందని ఆరోపించారు. 'నెహ్రూను తరచూ విమర్శించే బదులు ఆయనకు వ్యతిరేకంగా ఉన్న అన్ని నిందలపై ఒకేసారి చర్చించి ఆ అధ్యాయాన్ని ఇక ముగిద్దాం. అవి 999 లేదా 9999 నిందలు కావచ్చు. ఇందిర, రాజీవ్ ఏమి చేశారో? వారసత్వ రాజకీయాలు ఏమి చేశాయో? మీ ఫిర్యాదులన్నీ దేశానికి ఒకేసారి చెప్పండి. తర్వాత వాటిపై చర్చిద్దాం. ఆ తర్వాత ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్యలపై చర్చిద్దాం' అన్నారు. మోదీ ప్రధాని పదవిలో 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారని, నెహ్రూ దేశ స్వాతంత్ర్యం కోసం 12 ఏళ్లు జైల్లో ఉన్నారని చెప్పారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ మోదీ ఏ అంశంపై మాట్లాడినా.. నెహ్రూ, కాంగ్రెస్‌లను ప్రస్తావించడం అలవాటైపోయిందన్నారు. బీజేపీ పూర్వీకులు వందేమాతరాన్ని ఆలపించలేదన్నారు. సమాజ్‌వాదీ నాయకుడు అఖిలేశ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొననివారు వందేమాతరం విలువల గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. 'విద్వేషాలు సృష్టించేందుకు విచ్ఛిన్న శక్తులు వందేమాతరాన్ని వాడుకుంటున్నాయి. బ్రిటిష్ పాలకుల విభజించు-పాలించు విధానాన్నే వీరు అవలంబిస్తున్నారు' అన్నారు. వందేమాతరం హిందువుల గీతం అన్నట్టు ప్రచారం చేసినవారే ఆ గీతంపై వివాద సృష్టికి, విభజనకు కారకులని డీఎంకే ఎంపీ ఎ.రాజా అన్నారు. దీనిపై వివాదం సమాజం సృష్టించింది కాదని, ముస్లింలు దానికి కారణం కాదని, ఈ గీతానికి మతం రంగు పులిమినవారి వల్లే సమస్య తలెత్తిందన్నారు.

లోకం తీరు



రాష్ట్ర బార్ కౌన్సిళ్ల పదవుల్లో మహిళలకు 30% కోటా

» ఎన్నికల ప్రక్రియ ప్రారంభం దృష్ట్యా ఏపీ, తెలంగాణలకు మినహాయింపు

న్యూఢిల్లీ, డిసెంబరు 8: రాష్ట్ర బార్ కౌన్సిళ్ల పదవుల్లో 30 శాతాన్ని మహిళా న్యాయవాదులకు కేటాయించాలని సోమవారం సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది ఇంకా బార్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీల ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాని రాష్ట్రాల్లో ఈ ఆదేశాలను అమలు చేయాలని తెలిపింది. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో మాత్రం నోటిఫికేషన్ ప్రకారం ముందుకు సాగవచ్చని స్పష్టం చేసింది. ఒకవేళ తగినంత మంది మహిళా న్యాయవాదులు లేకున్నా, పోటీ చేయడానికి ఇష్టపడకున్నా అలాంటప్పుడు 20 శాతం పదవులను ఎన్నిక ద్వారా, మిగిలిన 10 శాతం పదవులను కోఆప్షన్ ద్వారా నియమించుకోవచ్చంటూ వెసులుబాటు కల్పించింది. మహిళలు ముందుకు రానప్పుడు కోఆప్షన్ ద్వారా నియమించుకోవచ్చని పేర్కొంది. కోఆప్షన్ ద్వారా నియమించేందుకు ప్రతిపాదించే మహిళా న్యాయవాదుల పేర్లను తొలుత కోర్టు ముందు ఉంచాలని తెలిపింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీల ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. తొలుత సీనియర్ న్యాయవాది, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్ర మాట్లాడుతూ.. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా బార్ కౌన్సిళ్ల ఎన్నికలు కొన్ని రాష్ట్రాల్లో ప్రారంభమయినట్టు చెప్పారు. దీంతో, ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, బిహార్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఈ ఉత్తర్వులను వర్తింపజేయడం సరికాదని సుప్రీంకోర్టు తెలిపింది. ఇక్కడ నామినేషన్లు సమర్పించిన మహిళలు ఉత్సాహంగా పోటీ చేయాలని, మహిళా ప్రాతినిధ్యం ఉండేలా సభ్యులు కూడా ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేసింది.

ఇండిగో వ్యవహారాన్ని తేలికగా తీసుకోలేదు

» కఠిన చర్యలు తప్పవు: మంత్రి రామ్మోహన్



న్యూఢిల్లీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇండిగో సంక్షోభంపై పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ అడిగిన ప్రశ్నకు స్పందించారు. "ఇండిగో సిబ్బంది రోస్టరింగ్ సహా అంతర్గత ప్రణాళిక వైఫల్యం కారణంగానే ఈ సంక్షోభం తలెత్తింది. పౌర విమానయాన రంగంలో కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్నాం. విమాన సంస్థలు వీటిని పాటించాల్సిందే. సాఫ్ట్‌వేర్ అంశానికి సంబంధించి విచారణకు ఆదేశించాం. దేశంలోని విమానయాన రంగంలో ప్రపంచస్థాయి ప్రమాణాలు పాటించాలనేది ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకునే నిబంధనలను కఠినతరం చేశాం. గత నెల రోజులుగా ఇండిగో కార్యకలాపాలను పరిశీలిస్తున్నాం. ఈ నెల 1న సమావేశం కూడా నిర్వహించాం. ఎఫ్‌డీటీఎల్ నిబంధనల విషయంలో ఇండిగో స్పష్టత కోరింది. నాటి సమావేశంలో ఇండిగో నుంచి ఎలాంటి అంశాలు చర్చకు రాలేదు. ఈ నెల 3వ తేదీ వరకు అన్నీ సజావుగానే సాగాయి. విమానాల రద్దుకు దారితీసిన సాఫ్ట్‌వేర్ విషయంపై విచారణకు ఆదేశించాం. అన్ని విమాన సంస్థలతోనూ చర్చించాం. విమానాశ్రయాల్లో పరిస్థితులను నియంత్రించాం. దీంతో గత రెండు రోజుల్లో పరిస్థితుల్లో మార్పు స్పష్టంగా కనిపించింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని తేలికగా తీసుకోవడం లేదు. ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకుంటాం." అని రామ్మోహన్‌నాయుడు తెలిపారు. పౌర విమానయాన రంగంలో భవిష్యత్తులో ఉల్లంఘనలకు పాల్పడే వారికి గుణపాఠం చెప్పేలా తమ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు కొత్త ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్(ఎఫ్‌డీటీఎల్) మార్గదర్శకాలు గత ఏడాది నవంబరు 1 నుంచి అమల్లోకి వచ్చాయని, అన్ని సంస్థలతో విస్తృతంగా చర్చించిన తర్వాతే ఈ మార్గదర్శకాలను తీసుకొచ్చినట్లు తెలిపారు. మొత్తం 22 మార్గదర్శకాలలో 15 నిబంధనలను జూలై 1 నుంచి, మిగిలిన ఏడు ఈ ఏడాది నవంబరు నుంచి అమలులోకి వచ్చాయని చెప్పారు.

రామ్మోహన్ సమయస్ఫూర్తితో వ్యవహరించారు: మోదీ కితాబు

ఇండిగో అంశంలో సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తున్నారని మంత్రి రామ్మోహన్‌నాయుడికి ప్రధాని నరేంద్ర మోదీ కితాబు ఇచ్చారు. ఇండిగో సంక్షోభంపై సోమవారం రాజ్యసభలో రామ్మోహన్ ఇచ్చిన సమాధానంపై ప్రధాని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇండిగో వ్యవహారంలో ప్రయాణికులకు మేలు జరిగేలా... సమయస్ఫూర్తిగా చర్యలు తీసుకున్నారని మెచ్చుకున్నారు. సమస్యను పరిష్కరించేందుకు సమయానుగుణంగా నిర్ణయాలు తీసుకున్నారని ప్రధాని అన్నట్లు కేంద్ర మంత్రి సన్నిహితవర్గాలు తెలిపాయి. కొంత మంది తెలిసీ తెలియకుండా చేస్తున్న విమర్శలను పట్టించుకోకుండా ముందుకు వెళ్లాలని ప్రధాని సూచించారు. మరోవైపు ఇండిగో వ్యవహారంపై రామ్మోహన్‌నాయుడితో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఏడో రోజూ అంతే!

కొనసాగిన ఇండి'గోల'.. 562 విమానాల రద్దు

» అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ/చెన్నై, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇండిగో విమానాల సంక్షోభం వరుసగా ఏడురోజూ కొనసాగింది. సోమవారం కూడా బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ సహా పలు ఆరు మెట్రో విమానాశ్రయాల్లో 562 విమానాల సేవలు రద్దయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ఇండిగో వ్యవహారంపై అత్యవసరంగా జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రభుత్వం ఈ విషయంలో స్పందించిందని, చర్యలు కూడా తీసుకుందని కోర్టు వ్యాఖ్యానించింది. లక్షల మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, అయితే.. ఈ సమస్యపై ప్రభుత్వం స్పందించి, చర్యలకు ఆదేశించిందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇది తీవ్ర విషయమే అయినప్పటికీ.. ప్రభుత్వం చర్యలకు ఆదేశించిన నేపథ్యంలో వేచి చూద్దామని, అత్యవసర విచారణ అవసరం లేదని పేర్కొంది. ఇండిగో విమానాల రద్దు ప్రభావం వరుసగా ఏడో రోజు కూడా భారీగా కనిపించింది. బెంగళూరు విమానాశ్రయంలో 150, ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం(ఐజీఐ)లో 143, చెన్నైలో 71 విమానాలు రద్దయ్యాయి. అదేవిధంగా అహ్మదాబాద్, ముంబై, చెన్నై, జైపూర్, గువాహటి విమానాశ్రయాల్లోనూ వందలాది విమానాల రద్దుతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు, విమాన సర్వీసులను భారీ సంఖ్యలో రద్దు చేస్తుండడాన్ని ప్రశ్నిస్తూ డీజీసీఏ ఇచ్చిన షోకాజ్ నోటీసుకు ఇండిగో సంస్థ సోమవారం సమాధానం ఇచ్చింది. పలు కారణాల వల్ల సేవలకు అంతరాయం కలిగినట్టు పేర్కొంది. పలు సమస్యలు ఉన్నందున ఖచ్చితమైన కారణం ఏదన్నదాన్ని చెప్పలేమని పేర్కొంది.

శంషాబాద్‌లో 112 విమానాలు రద్దు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇండిగో విమాన సర్వీసుల రద్దు కొనసాగుతోంది. జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారులు సోమవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. మొత్తం 112 విమాన సర్వీసులు రద్దయ్యాయి. వీటిలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన 54 విమానాలు, అలాగే ఇతర ప్రాంతాల నుంచి శంషాబాద్‌కు చేరుకోవాల్సిన 58 విమాన సర్వీసులు ఉన్నాయి. ఆరు రోజులుగా ఈ విమానాశ్రయంలో దాదాపు 650 విమానాలు రద్దయ్యాయి. అయితే, గత రెండు రోజులతో పోలిస్తే సోమవారం విమాన రద్దు సంఖ్య కొంత తగ్గిందని అధికారులు తెలిపారు.



అహ్మదాబాద్‌లో విమానాల రద్దుతో రైలుకోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

రేపటికల్లా పరిష్కారం: ఇండిగో

ప్రస్తుత సంక్షోభంపై వివరణ ఇచ్చేందుకు ఇండిగో సీఈవో పీటర్ ఎల్బెర్స్‌కు నిర్దేశించిన గడువును డీజీసీఏ పొడిగించింది. మరో 24 గంటలపాటు(సోమవారం సాయంత్రం 6 వరకు)సమయం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఇండిగో వ్యవహారంపై విచారణకు నలుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. బుధవారం కమిటీ ముందు హాజరు కావాలని ఇండిగో సీఈవో పీటర్ ఎల్బెర్స్‌కు సమన్లు జారీ చేసింది. ఇదిలావుంటే, బుధవారం నాటికి అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఇండిగో తెలిపింది. విమానాల సేవలు సాధారణ స్థితికి వస్తాయని వివరించింది. కాగా, సోమవారం టికెట్లకు సంబంధించి రూ.827 కోట్లను ప్రయాణికులకు తిరిగి చెల్లించారు. మరోవైపు.. ప్రస్తుత కీలక సమయంలో సహకరించాలని పైలట్లకు డీజీసీఏ విన్నవించింది.

2028కన్నా ముందే కొత్త ఐటీ చట్టం కింద ఐటీఆర్ ఫారాలు

» కేంద్ర మంత్రి పంకజ్ చౌధరి

న్యూఢిల్లీ, డిసెంబరు 8: ఐటీ చట్టం 2025 ఆధారంగా కొత్త ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్) ఫారాలను 2027-28 ఆర్థిక సంవత్సరానికన్నా ముందుగానే నోటిఫై చేయనున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి సోమవారం పేర్కొన్నారు. ఐటీఆర్ ఫారాలను సరళీకరించే ప్రక్రియలో భాగంగా పన్ను నిపుణులు, సంస్థాగత సంస్థలు, ఐటీ శాఖ క్షేత్రస్థాయి విభాగాలతో కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) కమిటీ విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరుపుతోందని చెప్పారు. ఈమేరకు లోక్‌సభకు ఆయన లిఖితపూర్వకంగా తెలియజేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఆదాయ పన్ను చట్టం, 2025 అమల్లోకి రానుంది. ప్రస్తుత ఆదాయ పన్ను చట్టం, 1961 స్థానంలో ఈ కొత్త చట్టం అమల్లోకి వస్తుంది. ఇది పన్ను చట్టాలను సులభతరం చేయడంతోపాటు చట్టంలోని పదాలను తగ్గించడం ద్వారా సులభంగా అర్థం చేసుకునే అవకాశం కల్పించనుంది. ఆదాయ పన్ను చట్టం కింద అమలు చేసే టీడీఎస్ త్రైమాసిక రిటర్న్ ఫారమ్, ఐటీఆర్ ఫారాలు సహా విభిన్న ఫారాలలో మార్పులు చేర్పులు చేస్తున్నారు. ఈ ఫారాలు పన్నుల చెల్లింపుదారులకు అనుకూలంగా ఉండేలా పన్ను విధాన విభాగంతో డైరెక్టరేట్ ఆఫ్ సిస్టమ్స్ కలిసి పని చేస్తోంది.

శబరిమలలో వర్చువల్ క్యూ నిబంధనలు కఠినతరం

శబరిమల, డిసెంబరు 8: కేరళలోని శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలో భక్తుల రద్దీని నియంత్రించడానికి ప్రస్తుతం అమలులో ఉన్న వర్చువల్ క్యూ, స్పాట్ బుకింగ్ నిబంధనలను మరింత కఠినతరం చేయాలని అధికారులు నిర్ణయించారు. సోమవారం నాడు జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం అనంతరం సన్నిధానం అదనపు జిల్లా మేజిస్ట్రేట్ (ఏడీఎం) అరుణ్ ఎస్ నాయర్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. భక్తులు వర్చువల్ క్యూ సిస్టమ్‌లో తమకు కేటాయించిన తేదీల్లో, నిర్దిష్ట సమయానికి మాత్రమే ఆలయానికి చేరుకోవాలని ఏడీఎం స్పష్టం చేశారు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించి, ప్రతి భక్తుడికి సురక్షితమైన, సజావైన దర్శనం కల్పించేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఆలయానికి వచ్చే యాత్రికులు, ముఖ్యంగా వయసు పైబడిన వారు, ఆరోగ్య సమస్యలు ఉన్న వారు, చిన్నపిల్లల కుటుంబాలు అటవీ మార్గాన్ని ఉపయోగించవద్దని సూచించారు. అటవీ మార్గంలో రద్దీ ఎక్కువగా ఉండడం, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం అందించడం కష్టమవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. శబరిమల యాత్రను సురక్షితంగా, సులభంగా పూర్తి చేసుకునేందుకు నిలక్కల్-పంబ మార్గాన్ని ఎంచుకోవాలని కోరారు.

నవజ్యోత్‌సింగ్ సిద్ధూ భార్యను మెంటల్ ఆస్పత్రికి పంపాలి: డీకే

బెంగళూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నవజ్యోత్‌సింగ్ సిద్ధూ భార్య కౌర్ సిద్ధూను మెంటల్ ఆస్పత్రికి పంపాలని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. రూ.500 కోట్ల సూట్‌కేస్ ఇస్తే సీఎం కుర్చీ దొరకుతుందని పంజాబ్ కాంగ్రెస్ నేత, సిద్ధూ భార్య కౌర్ సిద్ధూ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. 2027 ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తే నవజ్యోత్‌సింగ్ క్రియాశీలకంగా ఉంటారని, తద్వారా పంజాబ్‌ను సువర్ణరాజ్యంగా మార్చవచ్చునని కౌర్ సిద్ధూ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు కౌర్ సిద్ధూ స్పందిస్తూ, సీఎం కుర్చీ కోసం తమ వద్ద రూ.500 కోట్లు లేవని అన్నారు. కౌర్ సిద్ధూ వ్యాఖ్యలపై బీజేపీ, ఆప్ నుంచి కూడా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో డీకే కూడా స్పందించారు. ఆమె తొలుత మంచి మెంటల్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని వ్యాఖ్యానించారు.

16 నుంచి 233 కేంద్రాల్లో తిరుప్పావై ప్రవచనాలు

తిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 16 నుంచి జనవరి 14వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 233 కేంద్రాల్లో ప్రముఖ పండితులు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు. దీని కోసం టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏపీలో 76, తెలంగాణ 57, తమిళనాడు 73, కర్ణాటక 21, పుదుచ్చేరి 4, న్యూఢిల్లీ, ఒడిశాల్లో ఒక్కో కేంద్రంలో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహిస్తారు. ఇక, తిరుమల శ్రీవారి ఆలయంలోనూ ధనుర్మాసంలో సుప్రభాతం బదులు తిరుప్పావై నివేదించడం విశేషం. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం, కేటీ రోడ్డులోని వరదరాజస్వామి ఆలయంలోనూ తిరుప్పావై ప్రవచనాలు పారాయణం చేస్తారు.



దీపికను సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

పట్టుదలతో సాధించా..

భారత మహిళల అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక
శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో ఘన సత్కారం

మడకశిరటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'పూట గడవడం కష్టంగా ఉండేది. అన్నం దొరకడం గగనంగా ఉండేది. చాలా సార్లు తిండికి ఇబ్బందులు పడ్డాం. అడుగడుగునా అవమానాలు ఎదుర్కొన్నా. అంధురాలికి చదువెందుకన్నారు. బడికి పంపొద్దని అమ్మానాన్నకు చెప్పారు. చులకనగా మాట్లాడారు. ఎన్ని అవమానాలు ఎదురైనా.. పట్టుదలతో కష్టపడ్డా. అనుకున్నది సాధించా. అందరూ చులకనగా మాట్లాడుతుంటే.. బాధపడ్డ నా తల్లిదండ్రులు తలెత్తుకునేలా చేశా' అని భారత అంధ మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక భావోద్వేగానికి గురయ్యారు. దీపిక సారథ్యంలోని భారత జట్టు ప్రపంచ చాంపియన్‌గా అవతరించింది. శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలంలోని మారుమూల గ్రామమైన తంబాళహట్టికి చెందిన దీపిక భారత జట్టును ప్రపంచ చాంపియన్‌గా నిలిపి, ఎన్నో అవమానాలకు సమాధానం చెప్పింది. ప్రపంచ కప్ విజయానంతరం తొలిసారిగా జిల్లాకు వచ్చిన ఆమెకు సోమవారం మడకశిరలో భారీ స్వాగత ర్యాలీ ఏర్పాటు చేశారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, సినీనటుడు సాయికుమార్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మడకశిర జూనియర్ కళాశాల మైదానంలో సన్మాన సభ నిర్వహించారు. అంధుల టీ-20 ప్రపంచకప్‌లో భారత జట్టుకు సారథ్యం వహించే అవకాశం దక్కడం తన అదృష్టమని దీపిక తెలిపారు. అనంతరం ఆమెను ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు.

రాయడం, చదవడం రావాలి...
చిన్నపాటి లెక్కలూ చేయాలి!

ప్రాథమిక దశలోనే విద్యార్థులకు బలమైన పునాది.. 1-5 తరగతుల పిల్లలకు 'గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్'

- 'బేసిక్స్' తప్పనిసరిగా వచ్చేలా చేయడమే ఉద్దేశం
- కార్యక్రమ అమలుకు 75 రోజుల కార్యాచరణ ప్రణాళిక
- విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్
- ఉదయం సిలబస్.. మధ్యాహ్నమంతా ఎఫ్ఎల్ఎన్ బోధన

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పునాది దశలోనే ప్రాథమిక అంశాలు నేర్చుకోవాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం గ్యారెంటీడ్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ(జీఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఇప్పటికే ఎఫ్ఎల్ఎన్ అనేది ఉండగా.. దాన్ని ఈ విధంగా మార్చింది. వంద శాతం మంది పిల్లలకు ప్రాథమిక దశలో తెలుగు, ఇంగ్లిష్ చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక లెక్కలు చేయడం వంటి బేసిక్స్ తప్పనిసరిగా వచ్చేలా చేయాలనేది 'జీఎఫ్ఎల్ఎన్' ఉద్దేశం. ఐదో తరగతి దాటినా కొంత మంది విద్యార్థులు పదాలు చదవలేకపోతున్నారని, చిన్నపాటి లెక్కలూ చేయలేని స్థితిలో మిగిలిపోతున్నారనేది ఏటా నిర్వహిస్తున్న బేస్‌లైన్ సర్వేలో తెలుస్తోంది. ఫలితంగా పైతరగతులకు వెళ్లినా చదవడం, రాయడంలో ఇబ్బంది పడుతూ చదువులో వెనకబడిపోతున్నారు. ప్రధానంగా ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం జీఎఫ్ఎల్ఎన్ తీసుకొచ్చింది. ఈ కార్యక్రమం అమలుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు సోమవారం 75 రోజుల కార్యాచరణ ప్రణాళిక విడుదల చేశారు. 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు ఇది అమలు చేస్తారు. ప్రతిరోజూ ఉదయం రెగ్యులర్ సిలబస్ బోధించి, మధ్యాహ్నం నుంచి బడి వేళ ముగిసే వరకూ జీఎఫ్ఎస్ఎన్ బోధిస్తారు. ఏ రోజు ఏంచేయాలనేది పాఠశాల విద్యాశాఖ యాక్షన్ ప్లాన్‌లో వివరించింది. 1, 2 తరగతులు, 3-5 తరగతుల విద్యార్థులకు వేర్వేరుగా యాక్షన్ ప్లాన్ పుస్తకాలు రూపొందించారు. డిసెంబరు 8 నుంచి మార్చి 24 వరకు ఈ కార్యక్రమం అమలు చేసేలా చర్యలు చేపట్టారు.



విద్యార్థులకు ఏం నేర్పుతారు?

యాక్షన్ ప్లాన్‌లో భాగంగా విద్యార్థులు అక్షరాలు గుర్తించడం, చదవడంతో ప్రారంభించి, క్రమంగా స్థాయి పెంచుతూ వెళ్తారు.

- 1, 2 తరగతులు - తెలుగులో అక్షరాలు గుర్తించడం, చిత్రాలు చూపించి పదాలు చదవడం, అక్షరాలు రాయడం, పదాలు గుర్తించడం, పదాలు రాయడం నేర్పిస్తారు. గణితంలో పెద్ద చిత్రాలను చూపించి.. వాటి ఆధారంగా అంకెలు లెక్కించడం, అంకెలు జతపరచడం, అంకెలు రాయడం నేర్పుతారు. ఇంగ్లిష్‌లో చిత్రాలను చూపించి ఏ అక్షరంతో పదాలు ప్రారంభమవుతాయో గుర్తించడం, పదాలు చదవడం, ఒక వాక్యంలో కొన్ని పదాలు గుర్తించడం, ఇసుకపై పదాలు రాయించడం, బోర్డుపై రాయించడం నేర్పుతారు. ప్రతి రోజూ మూడు సబ్జెక్టులపై ఈ ప్రణాళిక అమలు చేసిన అనంతరం పునశ్చరణ ఉంటుంది.
- 3- 5 తరగతులు - వివిధ అంశాలపై మాట్లాడించడం, కథలు తయారు చేయించడం, వర్ణమాల చార్ట్‌ను ఎడమ నుంచి కుడి వైపునకు, కుడి నుంచి ఎడమ వైపునకు చదివించడం, గుణింతాలు చదివించడం, చిత్రాల క్యాలెండర్ చూపించడం, పదాలతో వాక్యాలు తయారు చేయడం, బొమ్మల ఆధారంగా కథలు చెప్పడం నేర్పిస్తారు. గణితంలో అంకెల పరిచయం, కరెన్సీ నోట్ల ద్వారా యాక్టివిటీస్, పలు పద్ధతుల్లో సంఖ్యా వాచకం, మౌఖికంగా కూడికలు, కూడిక పద సమస్యలు, కప్పగెంతులు, ఇతర ఆటల ద్వారా లెక్కలు చేయడం నేర్పుతారు. ఇంగ్లిష్‌లో చిత్రాలను చూపించి మాట్లాడించడం, ఏదైనా ఒక చిత్రం చూసి దాని గురించి చెప్పడం, దానిపై వాక్యం తయారు చేయడం, అక్షరాలు-చిత్రాలను జత చేయడం, అక్షరాలను ఉపయోగించి వాటితో ప్రారంభమయ్యే పదాలు చెప్పడం, చిన్న వాక్యాలు చదవడం, పాఠ్యపుస్తకం నుంచి రెండు వ్యాక్యాలు చదవడం, చిన్నపాటి వాక్యాలు సొంతంగా రాయడం వంటివి నేర్పుతారు.

రాష్ట్ర కబడ్డీ సంఘ కార్యదర్శి శ్రీకాంత్ అరెస్టు

ఏజ్ ఫ్రాడ్ చేశారని కేసు నమోదు, స్టేషన్ బెయిల్‌పై విడుదల

విజయవాడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కబడ్డీ సంఘ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్‌ను విజయవాడ పటమట పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. క్రీడాకారులను టోర్నమెంట్‌లో ఆడించేందుకు వారి వయస్సుకు సంబంధించి నకిలీ ధ్రువపత్రాలు సృష్టించారని పటమట పోలీసులకు ఫిర్యాదు అందింది. కొద్దినెలల క్రితం పటమటలోని ఇండోర్ స్టేడియంలో యువ సీరిస్ పేరుతో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఇందులో బాపట్ల జిల్లాకు చెందిన ఓ క్రీడాకారుడి అసలు వయస్సు 25 సంవత్సరాలు ఉంటే, నకిలీ ధ్రువపత్రాలతో అండర్ 18 విభాగంలో ఆడించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నకిలీ ధ్రువపత్రాలతో రాష్ట్రం లో మొత్తం 18 మంది క్రీడాకారులను ఒక విభాగంలో ఆడాల్సిన వారిని మరో విభాగంలో ఆడించారని ఆరోపించారు. దీనిపై కేసు నమోదు చేసిన పటమట పోలీసులు గురునానక్ కాలనీలో శ్రీకాంత్‌ను అరెస్ట్ చేశారు. అతనిపై నమోదైన కేసులో సెక్షన్లు ఏడేళ్ల లోపు శిక్ష పడేవి కావడంతో స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు.

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఘాతుకం

- ఎక్స్‌కవేటర్ యజమాని గొంతుకోసి హత్య



ఇంతియాజ్ అలీ

చింతూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు ఘాతుకానికి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. బీజాపూర్ జిల్లా పామేడు పోలీసుస్టేషను పరిధిలో ఇటీవల రహదారుల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులోభాగంగా రహదారుల పనుల నిర్మాణ కాంట్రాక్టర్‌కు ఎక్స్‌కవేటర్‌ని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇంతియాజ్ అలీ అద్దెకు ఇచ్చారు. ఈ క్రమంలో రెండురోజుల క్రితం గుమస్తా బీరేంద్ర ఎక్స్‌వేటర్ పనిచేస్తున్న ప్రదేశానికి వెళ్లాడు. విషయం తెలుసుకున్న మావోయిస్టులు అతన్ని కిడ్నాప్ చేశారు. బీరేంద్రను మావోయిస్టుల చెరనుంచి విడిపించేందుకు ఇంతియాజ్ అలీ సోవవారం మావోయిస్టుల వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో మావోయిస్టులు ఇంతియాజ్‌ను బంధించి గొంతు కోసి హత్య చేశారు. ఇంతియాజ్ మృతదేహాన్ని రహదారిపై పడేసిన మావోయిస్టులు అక్కడి నుంచి రహస్య ప్రాంతానికి వెళ్లిపోయారు. బీరేంద్రను విడిచిపెట్టడంతో పామేడు చేరుకొని పోలీసులకు, ఇంతియాజ్ కుటుంబానికి సమాచారం అందించాడు. పోలీసు బలగాలు ఘటనా స్థలానికి చేరుకొని ఇంతియాజ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఆలిండియా కోటా మెడికల్ పీజీ సీటురద్దుకు రేపటి వరకు చాన్స్

- రాష్ట్రస్థాయిలో సీటు పొందిన కాలేజీలో చేరొచ్చు
- విద్యార్థులకు అవకాశం కల్పించిన ఎంసీసీ

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆలిండియా కోటా మొదటి రౌండ్ కౌన్సెలింగ్‌లో మెడికల్ పీజీ సీటు పొందిన అభ్యర్థులకు మెడికల్ కౌన్సిల్ కమిటీ(ఎంసీసీ) మరొక చాన్స్ ఇచ్చింది. రాష్ట్ర కోటాలో సీటు పొందిన అభ్యర్థులు ఆలిండియా కోటా సీటును వదులుకొనేందుకు ఈనెల 10 వరకూ అవకాశం కల్పించింది. 8 సాయంత్రం 4 గంటల నుంచి 10 సాయంత్రం 6 గంటల వరకూ అభ్యర్థులు ఆలిండియా కోటా సీటు పొందిన కాలేజీలకు వెళ్లి, అక్కడ సీటు వదులుకుంటున్నట్లు లేఖ ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎంసీసీ అత్యవసర నోటీస్ జారీచేసింది. రాష్ట్రాలు, సీటు పొందిన అభ్యర్థుల విన్నపం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో 120 మంది ఆలిండియా కోటా కౌన్సెలింగ్‌లో సీటు పొందారు. వారికి కేటాయించిన కాలేజీల్లో చేరిపోయారు. ఆలిండియా కోటా సీటు వదులుకొని, రాష్ట్ర స్థాయిలో సీటు పొందిన కాలేజీల్లో చేరేందుకు తొలుత ఎంసీసీ అనుమతి ఇవ్వలేదు. విద్యార్థులు, అన్ని రాష్ట్రాల వర్సిటీల నుంచి లేఖలు రావడంతో ఎంసీసీ విద్యార్థులకు మరొక అవకాశం ఇచ్చింది.

ఎంపీ సీఎం రమేశ్‌కు నేతల పరామర్శ

ఎర్రగుంట్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైల్వే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తల్లి రత్నమ్మ దశ దినకర్మ వైఎస్సార్ కడప జిల్లా పోట్లదుర్తిలో సోమవారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు భారీగా తరలివచ్చి సీఎం రమేశ్‌ను, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర హోం మంత్రి అనిత, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవి, అనగాని ప్రసాద్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు రత్నమ్మ చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. రత్నమ్మ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. సీఎం రమేశ్ తల్లిదండ్రుల పెళ్లి ఫొటోలు, మరణించినంత వరకు ఉన్న జ్ఞాపకాలతో కూడిన ఫొటో ప్రదర్శనను వచ్చిన వారు ఆసక్తిగా తిలకించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ప్రదర్శనను తిలకిస్తూ రమేశ్ తండ్రి సీఎం మునిస్వామినాయుడును పలకరిస్తూ పాత జ్ఞాపకాల గురించి అడిగి తెలుసుకున్నారు.

డేటా సెంటర్లు కాదు.. ఉపాధి కల్పించే పరిశ్రమలు కావాలి!

- స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుకు అప్పగించేందుకు కుట్ర: బీవీ రాఘవులు



విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డేటా సెంటర్లు ఎన్నివచ్చినా పెద్దగా ఉపాధి అవకాశాలు ఉండవు కాబట్టి, ఎక్కువ మందికి ఉద్యోగాలు కల్పించే టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫుట్‌వేర్, గార్మెంట్ వంటి పరిశ్రమలను విశాఖకు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు సూచించారు. ఈ నెల 31న నుంచి జరగబోయే సీఐటీయూ అఖిల భారత మహాసభల ఏర్పాట్లను పరిశీలించేందుకు విశాఖ వచ్చిన ఆయన సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలో వచ్చిన టీడీపీ, తర్వాత వైసీపీ, నేడు కూటమి ప్రభుత్వం కూడా సదస్సులు పెట్టి రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్నాయే తప్ప విదేశీ పెట్టుబడులు మాత్రం రావడం లేదన్నారు. కబుర్లు చెప్పడం పైకంటే పెట్టుబడులు రాబట్టడానికి నిర్దిష్ట ప్రణాళిక తయారుచేయడంపై దృష్టిపెట్టాలని రాఘవులు సూచించారు. స్టీల్‌ప్లాంటు ప్రతిష్ఠను దిగజార్చడం ద్వారా ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని రాఘవులు ఆరోపించారు. నాసిరకం ముడిపదార్థాలను సరఫరా చేసి నాణ్యత తగ్గిపోయిందంటూ ఉక్కు ఉత్పత్తిని కించపరుస్తున్నారన్నారు. రూ.400 కోట్ల మేర జీతాలను బకాయి పెట్టడం ద్వారా బయటకు వెళ్లిపోవడమే మంచిదనే భావన ఉద్యోగుల్లో కల్పిస్తున్నారని విమర్శించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇది సరికాదు...!

ప్రజాస్వామ్యంలో రాజకీయం పోటాపోటీగా ఉంటుంది. వాగ్యుద్ధాలకు అంతూపొంతూ ఉండదు. అధికార, విపక్షాల మధ్య ఘర్షణ చట్టసభల్లోనూ అరుబయటా నిత్యం సాగుతూంటుంది. ఆరోపణలూ ప్రత్యారోపణలు, నిందలూ నిష్ఠూరాలు, అవమానాలూ ఎత్తిపొడుపులూ అబ్బో చాలా ఉంటాయి. తనను ప్రభావితం చేయడానికి నాయకులు మా చెడ్డ ఇదైపోతున్నారని ఓటరుకు కూడా తెలుసు. అయితే, ఇదంతా రాజకీయ ప్రత్యర్థులు శత్రువులు కారు అన్న స్పృహతో, ప్రజాస్వామ్య స్ఫూర్తితో సరిహద్దుల్లోపల కొనసాగాల్సిన వ్యవహారం. దేశం ముందు తామూ, తమ పార్టీలు స్వల్పమైనవని, హద్దులు దాటిన ప్రవర్తనతో, చర్యలూ చేష్టలతో దేశం పరువు తీయకూడదని నాయకులు గుర్తుపెట్టుకోవాలి. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, స్పీకర్, విపక్షనేత ఇత్యాదులంతా రాజ్యాంగ వ్యవస్థలో భాగమేనని, దాని ఆశయానికీ, స్ఫూర్తికీ భిన్నంగా వ్యవహరించకూడదని పాలకులకు తెలియదనుకోలేం. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గౌరవార్థం భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇచ్చిన విందుకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీనీ, రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున్ ఖర్గేనూ ఆహ్వానించకుండా తగినశాస్తి చేశామని, అవమానించామని అధికారపక్షం కనుక భావించివుంటే, సరికాదు.


పైపెచ్చు, అస్మదీయ శశిథరూర్‌ను పిలిచి, కాంగ్రెస్‌ను మానసికంగా మరింత దెబ్బతీశామని కూడా బీజేపీ నాయకులు అనుకున్నారేమో. విపక్ష నేతను ఎందుకు పిలవలేదో, తనను ఎందుకు పిలిచారో తనకు తెలియదని అంటూనే ఈయన ఆ విందుకు హాజరవడం వేరే సంగతి. అందుకు ఆయనకు గల అర్హతల గురించి కూడా ఇక్కడ అప్రస్తుతం. విదేశీ అతిథులతో భేటీలకు విపక్షనేతలకు అవకాశం కల్పించే సంప్రదాయం నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చే ముందువరకూ అమలు జరిగిందని రాహుల్‌గాంధీ ఎంతో ముందుగానే ప్రభుత్వానికి గుర్తుచేశారు. ఆహ్వానం ఉండి కూడా ఇదే రాహుల్‌గాంధీ ఉపరాష్ట్రపతి, చీఫ్ జస్టిస్ ప్రమాణస్వీకారాలకు ఎందుకు రాలేదని అధికారపార్టీ నాయకులు ఏవో ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు కానీ, ఒక దేశాధ్యక్షుడి గౌరవార్థం మన దేశాధ్యక్షులు ఇచ్చిన విందుకు విపక్షనేతలను ఆహ్వానించకపోవడం దుష్టసంప్రదాయం, తీవ్రమైన తప్పిదం. ఇది రాహుల్‌గాంధీకి సంబంధించిన అంశమో, ఆయనకు జరిగిన అవమానమో కాదు. ఈ చర్య ద్వారా ఒక రాజ్యాంగబద్ధపదవిని పాలకులు తేలికపరచారు, అగౌరవించారు. విపక్షనేత వెనుక ఒక పార్టీ ఉంది, ఆయన సారథ్యం వహిస్తున్న అనేక పార్టీల కూటమి ఉంది, వాటన్నింటి వెనుకా కోట్లాది ఓటర్లూ ఉన్నారు.

2014 డిసెంబరులో పుతిన్ భారత పర్యటనకు వచ్చిన సందర్భంలో సోనియా గాంధీతో భేటీకావడం అటుంచితే, దీనికిముందు పదేళ్ళ యూపీఏ పాలనలో అమెరికా, చైనా సహా వివిధ దేశాధినేతలు, దౌత్యప్రతినిధులతో అప్పటి విపక్షనేత 162సార్లు భేటీలు జరిపారని రికార్డులు చెబుతున్నాయి. విందు ఆహ్వానాలు లేకపోవడం సరే, కనీసం విదేశీ అతిథులతో మర్యాదపూర్వక భేటీలకు కూడా 2014 తరువాత విదేశాంగశాఖ విపక్షనేతలను అనుమతించడం మానేసింది. దీనిని సమర్థించుకోవడానికి ప్రభుత్వం దగ్గర చాలా కారణాలు ఉంటాయి కూడా. భారతరాష్ట్రపతి ఇచ్చిన విందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం రాహుల్‌గాంధీని ఉద్దేశపూర్వకంగా ఆహ్వానించలేదన్న విషయం వ్లాదిమిర్ పుతిన్‌కు తెలియకుండా పోదు. భారతదేశంతో సోవియట్ యూనియన్ ప్రాణస్నేహానికి, సర్వరంగాల్లో సహకారానికీ, రక్షణబంధానికీ బలమైన పునాదులు వేసిన జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీల వారసుడిని తనకు కనిపించకుండా చేశారని పుతిన్ అనుకొని ఉండవచ్చు. గతంలో బీజేపీ మూలపురుషులు, పెద్దలు భారత్–సోవియట్ స్నేహాన్ని తప్పుబట్టి, అమెరికాకు సన్నిహితం కానందుకు కాంగ్రెస్‌ను విమర్శించినవారే. ఎంతటి విపత్కర పరిస్థితుల్లోనూ భారత్ చేయివదలకుండా రష్యా ఇప్పటికీ తోడుగా అండగా ఉన్నదంటే అది కాంగ్రెస్ వేసిన పునాది బలం. అమెరికా తన నగ్న స్వరూపాన్ని ప్రదర్శించినప్పుడల్లా పరుగునపోయి రష్యా అధినేతను ఆలింగనం చేసుకుంటున్న ప్రస్తుత పాలకులకు ఈ చరిత్ర తెలియదనుకోలేం. మూడోపర్యాయం అధికారంలోకి వచ్చిన భారతీయ జనతాపార్టీ విదేశీ నేతల పర్యటనల సందర్భంలో కురుచగా వ్యవహరించాల్సిన అవసరం ఏమీ లేదు. వచ్చినవారితో భేటీకి ఇక్కడి పార్టీల పెద్దలకు దారులు తెరిచి ఉన్నతంగా, ఉదాత్తంగా ఉండవచ్చు. ఆపరేషన్ సిందూర్ మీద ప్రపంచదేశాలకు తమవాదన వినిపించడానికి విపక్షాన్ని ఎంచక్కావాడుకున్నవారు, అవసరం తీరాక ఇలా అవమానించడం సరికాదు.

ప్రజల గుండెల్లో ఎగిరిన పోరు పతాక

జాతీయోద్యమంలోనూ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలోనూ, నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరి లోయ సాయుధ పోరాటంలోనూ పాల్గొన్న మూడు తరాల వారధి మాదాల నారాయణస్వామి (ఎం.ఎస్.ఎస్). నమ్మిన ఆశయం కోసం అంతిమ శ్వాస వరకు ఆయన అలుపెరగని పోరాటం చేశారు. పార్లమెంటరీ పంథాను తిరస్కరించడంలో, ప్రజాపంథాను ముందుకు తీసుకెళ్లడంలో పట్టుదలగా కృషి చేశారు. కమ్యూనిస్టు విలువల్ని, ఆదర్శాలని కాపాడడంలో, ఆచరించడంలో ముందు వరుసలో నిలబడ్డారు. విప్లవోద్యమంలో ఎగిరే ఎర్రని జెండా అయి, కడదాకా నిలిచారు. ఎంఎస్‌ఎస్ ఎత్తిన జెండా, నడిచిన పంథా, చూపిన చొరవ, ప్రదర్శించిన పట్టుదల నుంచి నేటి తరం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. వారందించిన పోరాట సంప్రదాయాలు, ఆచరించి నిర్మించిన ప్రజా ఉద్యమాలను మనం కొనసాగించాల్సి ఉంది. ఈ ఆదర్శ కమ్యూనిస్టు అమరుడై 12 సంవత్సరాలు పూర్తయ్యాయి.

మాదాల నారాయణస్వామి 1914 ఫిబ్రవరి 13న ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు మండలం, మైనంపాడు గ్రామంలో జన్మించారు. బెనారస్ యూనివర్సిటీలో ఎం.ఎ ఎకనామిక్స్ పూర్తి చేశారు. జాతీయ ఉద్యమం ప్రభావంతో విద్యార్థి ఉద్యమంలో



చురుగ్గా పాల్గొన్నారు. 1936లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం పొందారు. 1937లో జరిగిన కొత్తపట్నం రాజకీయ పాఠశాలలో విద్యార్థిగా పాల్గొన్నారు. అక్షరాలు నేర్చుకోవడమే చదువు కాదని, చదువంటే ఉద్యమమని, ఉద్యమమే ఊపిరని, అది పీడిత ప్రజల విముక్తికి ఉపయోగపడాలని భావించారు. అందుకే చదువు ముగిసిన వెంటనే ప్రజా ఉద్యమాలకు అంకితమై, ప్రజలతో మమేకమయ్యారు.

వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటకాలంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని నిషేధించినప్పుడు ఎం.ఎస్.ఎస్ రహస్య జీవితంలోకి వెళ్ళారు. నిత్య నిర్బంధాల మధ్య రైతుల్ని, కూలీల్ని, మత్స్యకారుల్ని సంఘటితం చేస్తూ భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా, అంటరానితనానికి, అణిచివేతకు వ్యతిరేకంగా పోరాడారు. రహస్య జీవిత కాలంలో ఆయన ఆచూకీ కోసం తమ్ముళ్ల కోటయ్య, నర్సయ్యలను పోలీసులు పట్టుకుని కాల్చి చంపినా, చలించకుండా పోరాటపథంలో నడిచారు. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఎత్తివేశాక, 1952లో ఒంగోలు ఎమ్మెల్యేగా, 1962లో ఒంగోలు పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికయ్యారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లలో ప్రజా సమస్యలపై తన వాణిని వినిపించారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు కొల్లా వెంకయ్యతో కలిసి విశాఖ ఉక్కు ఆందోళన సందర్భంగా పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

1964లో కమ్యూనిస్టు ఉద్యమంలో తలెత్తిన విభేదాల కారణంగా ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుంచి సీపీఎం వైపు వచ్చారు. ఆ తర్వాత వచ్చిన చీలికల్లో విప్లవ కమ్యూనిస్టు పార్టీ వైపు నిలబడ్డారు. 1968లో డీవీ, టీఎన్, సీపీ, కొల్లా వెంకయ్యలతో ఏర్పడిన ఆంధ్ర విప్లవ కమ్యూనిస్టు కమిటీ వైపు నిలబడ్డారు. అదే ఏడాది పాలకొల్లు ప్లీనంలో రాష్ట్ర నాయకులు అయ్యారు. 1973లో ఆంధ్రప్రదేశ్ విప్లవ కమ్యూనిస్టు పార్టీ మహాసభలో రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా, రాష్ట్ర కమిటీ సభ్యులుగా, కేంద్ర కమిటీ సభ్యులుగా, పొలిట్ బ్యూరో సభ్యులుగా పనిచేశారు. చివరి క్షణం వరకు కేంద్ర కమిటీ శాశ్వత ఆహ్వానితులుగా ఉన్నారు.

30 సంవత్సరాలు ప్రజాపంథా పత్రిక ఎడిటర్‌గా పనిచేశారు. భారత్–చైనా మిత్రమండలి జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 1977 నుంచి 20 సంవత్సరాలు రైతు కూలీ సంఘం అధ్యక్షులుగా, అఖిల భారత రైతు కూలీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులుగా పనిచేశారు. జీవితాంతం దున్నేవాడికి భూమి కావాలని, ప్రజల విముక్తికి వ్యవసాయక విప్లవమే మార్గమని ఉద్యమించారు. గుంటూరు జిల్లా ఉద్యమంలోనూ కీలక భూమిక నిర్వహించారు. విప్లవ శక్తులు ఐక్యం కావాలని చివరి వరకు తపనపడ్డారు. భూస్వామ్య పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద కూటమికి వ్యతిరేకంగా బలమైన ప్రజా పోరాటాల్ని నిర్మించడమే ఎం.ఎస్.ఎస్.కి మనమిచ్చే నిజమైన నివాళి.

• **చిట్టిపాటి వెంకటేశ్వర్లు**
సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ

(నేడు గుంటూరు రెవెన్యూ కళ్యాణ మండపంలో మాదాల నారాయణస్వామి వర్ధంతి సభ)

పెళ్లినాటి ప్రమాణాలూ... ప్రమాదాలూ!

గతంలో ప్రేయసి వలలో పడి భార్యను చంపే భర్తల గురించే వినేవాళ్లం, పేపర్లలో చదివేవాళ్లం. ఇప్పుడు భార్యలు ఈ పోటీలో భర్తలను అందుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు కనబడుతోంది. ప్రియుడితో కలిసి గూడుపుఠాణీ చేసి, ప్రీమెడిటేటెడ్, కోల్డ్ బ్లడెడ్ మర్డర్లు కూడా చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. జీవితాంతం కలిసి నడుస్తామంటూ పెళ్లి సమయంలో చేసిన ప్రమాణాలు ఏమైపోతున్నాయో తెలియటం లేదు. ప్రమాణాలు కేవలం నోటిమాటలుగా మిగిలిపోకుండా, ఆచరణలో కూడా చూపాలంటే సరైన ఆటిట్యూడ్ వుండాలి. 'ఈ నా వివాహాన్ని వర్కబుల్ చేస్తాను' అని దృఢంగా సంకల్పించుకోవాలి కూడా. దానికి అనుగుణంగా మరో ప్రమాణాన్ని కూడా చేరిస్తే మంచిదనిపిస్తోంది.

భర్తలను భార్యలు చంపిస్తున్న కొన్ని సందర్భాల్లో పెళ్లికి ముందే ఈ ప్రీమెడిటేషన్ ప్రారంభమవుతోందని తెలుస్తోంది. ప్రియుడికి ఉద్యోగం, వేరేవాణ్ణి పెళ్లి చేసుకుని, వాణ్ణి ప్రియుడి ద్వారా చంపించి, ఆస్తికి వారసురాలై, తర్వాత ప్రియుణ్ణి పెళ్లాడి హాయిగా సెటిలైపోదామనే ప్లాన్లు కూడా వేస్తున్నారు. ఇలాంటి కేసుల్లో హనీమూన్‌లో హనీ కంటే పాయిజన్ పాలు ఎక్కువవుతోంది. ఇవి విన్నప్పుడు 'వీరికి తమ పెళ్లినాటి ప్రమాణాలు గుర్తుకురావా? లేక చిత్తశుద్ధి లేని ప్రమాణాలు చేస్తున్నారా?' అనే అనుమానం వస్తుంది. ఈ ప్రమాణాలన్నీ ఒకరికొకరు జీవితాంతం బద్ధులమై ఉంటామని, అచంచలమైన పరస్పర విశ్వాసాన్ని కలిగి ఉంటామనీ చెప్తాయి. క్రైస్తవ వివాహాల సమయంలో 'ఈ రోజు నుంచి, సుఖంలోనూ, దుఃఖంలోనూ, ఐశ్వర్యంలోనూ పేదరికంలోనూ, ఆరోగ్యంలోనూ అనారోగ్యంలోనూ – మృత్యువు మమ్మల్ని విడదీసేదాకా– కలిసే ఉంటాము' అని క్రైస్తవ దంపతులు ప్రమాణం చేస్తారు.

హిందూ వివాహాల్లో తాళి కడుతూ 'నేను నీ మెడలో కడుతున్న ఈ మంగళసూత్రం నా జీవితానికి ఆధారం. నీవు నూరేళ్లు బతికి నన్ను కూడా బతికించు' అనే అర్థంలో 'మాంగల్యం తంతునానేనా, మమ జీవన హేతునా' మంత్రాన్ని పఠిస్తాడు. దీనికి గాను తన వంతుగా ఏం చేస్తాడో మరో మంత్రంతో చెప్తాడు– 'ధర్మేచ, అర్థేచ, కామేచ, మోక్షేచ.. నాతి చరామి' అని. ధర్మంలో, ధనార్జనలో, కోరికలో, మోక్షంలో.. నిన్ను దాటి వెళ్లను. నీతోనే ఉంటాను' అని దాని అర్థం. జీవితానికి అతి ముఖ్యమైన ఈ నాలుగు పురుషార్థాలలోనూ కలిసి ఉంటానని చెప్పడం ఆజన్మాంత జీవన సహచర్యానికి నిర్వచనమే!

ఆ తర్వాత ఇద్దరూ 'సప్తపది' పేర ఏడడుగులు కలిసి నడుస్తారు. ఒక్కొక్క అడుగుకూ ఒక్కొక్కటి చొప్పున వధువుకు వరుడు సూచనలు చేస్తాడు. 'నువ్వు నాకు పోషణ కలిగించాలి', 'నాకు శక్తి, ఉత్సాహాలను కలిగించాలి', 'కుటుంబానికి ఐశ్వర్యాన్ని తేవాలి', 'ఆనందాన్ని కలిగించాలి', 'సంతానాన్ని సమకూర్చాలి', 'అన్ని ఋతువులలోనూ మనం కలిసి జీవించాలి' (ఇక్కడ అన్ని ఋతువులు అనడంలో వసంతం నుంచి శిశిరం దాకా అనే కాదు, కలిమిలో లేమిలో, కష్టాల్లో సుఖాల్లో.. అనే భావం యిమిడి ఉంది), చివరగా ఏడో అడుగులో చెప్తాడు– 'మన మధ్య శాశ్వతమైన స్నేహం ఉండాలి' అని. నిజానికి ఈ స్నేహమే వైవాహిక బంధాన్ని నిలిపి ఉంచుతుంది. స్నేహితులు మధ్యమధ్యలో వాదించుకుంటారు, కొట్లాడుకుంటారు. కానీ ఒకరంటే మరొకరికి గాఢమైన ఇష్టం ఉంటుంది. స్నేహానికి తైలం అనే అర్థం కూడా ఉంది. దాంపత్యజ్యోతి నిరంతరం వెలగాలంటే భార్యాభర్తల మధ్య ఈ స్నేహం చాలా ముఖ్యం.

సంప్రదాయబద్ధంగా జరిగే పెళ్లిళ్లలో ఏదో రకంగా ప్రమాణాలు చేయిస్తూనే ఉన్నారు. కొంతకాలానికి పెళ్లిళ్లలో కలతలు రావడం, విడాకులు తీసుకోవడం... చివరకు పైన చెప్పిన హత్యాకాండల గురించి విన్నప్పుడు ఈ ప్రమాణాల ప్రామాణికత ఏమిటన్న సందేహం వస్తుంది. ఆనాటి బాసలు నీరసించడం, సడలిపోవడం క్రమేపీ జరుగుతోందనే సంగతిని మనం ఆకళింపు చేసుకోవాలి. చాలా సందర్భాల్లో భార్యాభర్తలకు ఒకరిపై మరొకరికి మోజు విరిగిపోవడం, విభేదాలు పొడచూపడం జరుగుతోంది. వీటిని కాలంతో పాటు వచ్చే మార్పులుగా అర్థం చేసుకోవాలి.

తమాషా ఏమిటంటే పరిస్థితులు మారవు, కానీ వాటిని చూసే దృక్కోణంలో మాత్రం మార్పు వస్తుంది. ఒకప్పుడు ప్రేమతో, ఆరాధనతో నిండి తనను మంత్రముగ్ధుణ్ణి చేసిన భార్య అందమైన కళ్లే, కోపంతో పెద్దవై, నిప్పురవ్వలు కురిపించడం భర్తకు కలిగే అనుభవం. స్వీట్ నథింగ్స్‌తో తనను పులకింపచేసిన భర్త కంఠస్వరమే తన మాట చెల్లనప్పుడు చికాకుతో గర్జించడం భార్య నివ్వెరపోయే సందర్భం. భర్త వినే సంగీతం పెళ్లయిన కొత్తల్లో ఆహ్లాదకరంగా భావించిన భార్య, పోనుపోను దాన్ని వట్టి రొదగా కొట్టిపారేయడం కద్దు. భార్య తీసే కూనిరాగాలను ఒకప్పుడు శ్రావ్యంగా భావించిన భర్త తర్వాతి రోజుల్లో వాటినే ఖూనీరాగాలుగా భావించడం కాలమహిమ కాక మరేమిటి?

> టాల్‌స్టాయ్ నుంచి గాంధీ దాకా గృహ కలహాలను ఎవరూ తప్పించుకోలేకపోయారు. కానీ పోట్లాడుకున్న వాళ్లందరూ విడిపోరు. గీతాకారుడు ఏం చెప్పాడు? మానవ ప్రయత్నం తప్పదు అన్నాడు. స్వర్గంలో పెళ్లి చేయడం వరకు దేవుడి పనే కానీ, భూమి మీద దాన్ని నిలబెట్టుకోవడం మన పని. పెద్దలిచ్చిన ఆస్తి కానీయండి, స్వయంకృషితో తెచ్చుకున్న ఉద్యోగం కానీయండి, నిలబెట్టుకోవడంలోనే ఉంది ప్రజ్ఞ.

ఈ కారణంగా భార్యాభర్తలిద్దరి ప్రవర్తనల్లోనూ మార్పులు వస్తాయి. చెవిలో గుసగుసలు, ముసిముసి నవ్వుల స్థానంలో పక్కింటి వాళ్లకు కూడా వినబడే స్థాయిలో అరుపులు, రంకెలుగా రూపాంతరం చెందుతాయి. ఇద్దరూ కలిసి ప్రేమగా ఏరికోరి కొన్న గాజు, పింగాణీ వస్తువులు నేల కూలి ముక్కలవుతాయి. గిన్నెలు సొట్టబడతాయి. ఒకప్పుడు అపురూపంగా దాచుకున్న ఉత్తరాలు, ఫొటోలు కోపావేశంలో చిరిగి ముక్కలవుతాయి. ఏదో ఒక స్థాయిలో ప్రతి జంటకూ ఇలాంటి అనుభవాలు ఉంటాయి. టాల్‌స్టాయ్ నుంచి గాంధీ దాకా గృహ కలహాలను ఎవరూ తప్పించుకోలేకపోయారు. కానీ పోట్లాడుకున్న వాళ్లందరూ




విడిపోరు. 'పిల్లల కోసం కలిసి ఉంటున్నారు పాపం' అని బయటివాళ్లు అనుకోవచ్చు కానీ వాస్తవమేమిటంటే– వయస్సు, అనుభవం పెరుగుతున్న కొద్దీ, చాలా మంది దంపతులకు 'కలిసి బతకలేం, అలా అని విడిపోయి బతకలేం' అనే అవగాహన కలుగుతుంది. విడిపోయి బతకగలం అనుకున్న వాళ్లు విడిపోతారు.

విడాకులు తీసుకోవడం గతంలో కంటే సులభమైన ఈ కాలంలో కూడా భాగస్వామిని చంపడం దేనికి? ఈ 'క్రైమ్స్ ఆఫ్ పేషన్'లో శరీరాని కంటే మనసు పాత్రే ఎక్కువ. భార్యాభర్తల మధ్య మానసికబంధం సడలిన సమయంలో మూడో వ్యక్తి ప్రవేశిస్తే– ఈ బంధాన్ని ఎలా వదుల్చుకోవాలా అనే ఆలోచన కలగవచ్చు. సామరస్యంగా విడిపోవాలా, హింసాత్మకంగా విడిపోవాలా అనేది వ్యక్తిగత నిర్ణయం. దాన్ని ఆ మూడో వ్యక్తి ప్రభావితం చేయవచ్చు. హింసాత్మక మార్గాన్ని ఎంచుకుని, హత్యలకు పాల్పడితే దాని వలన అనర్థం జరిగే అవకాశాలే ఎక్కువ. పరిస్థితి అక్కడిదాకా వెళ్లకుండా, మానసిక బంధం సడలకుండా చూసుకునే ఉపాయాల గురించి ఆలోచించాలి. గీతాకారుడు ఏం చెప్పాడు? మానవ ప్రయత్నం తప్పదు అన్నాడు. స్వర్గంలో పెళ్లి చేయడం వరకు దేవుడి పనే కానీ, భూమి మీద దాన్ని నిలబెట్టుకోవడం మన పని. పెద్దలిచ్చిన ఆస్తి కానీయండి, స్వయంకృషితో తెచ్చుకున్న ఉద్యోగం కానీయండి, నిలబెట్టుకోవడంలోనే ఉంది ప్రజ్ఞ. కాపురాన్ని నిలబెట్టుకోవడానికి కావలసినది సరైన ఆటిట్యూడ్. ప్రత్యామ్నాయం దీనికంటే మెరుగు కాదనే ఎఱుక! దానికి మించి చుట్టూ పరిస్థితులెలా ఉన్నా, సంతోషంగా ఉండి తీరాలనే పట్టుదల!

బతకడమంటే విసుగుతో, నిరాశానిస్పృహలతో, కోపతాపాలతో తనని తాను తిట్టుకుంటూ, ఇతరులను విసిగిస్తూ బతకడం కాదు. ఈసురోమని మనుషులుంటే దేశమే కాదు, కాపురాలూ బాగుపడవు, వర్ధిల్లవు. హ్యాపీగా ఉండడానికి నిశ్చయించుకోవడంలో ఉంది అసలైన కీలకం. నాకు వివాహమై, ఫస్ట్ పోస్టింగు వచ్చి, కాపురం పెట్టడానికి వెళ్లబోయే ముందు సలహా కోసం అడిగితే మా నాన్నగారు చెప్పిన మాట ఒక్కటే– 'వృత్తిలో కానీ, సంసారంలో కానీ సంతోషంగా ఉండు' అని! మనం సంతోషంగా ఉండడానికి పక్కవాళ్లందరూ కూడగట్టుకుని ప్రయత్నం చేయరు. ఆ తంటాలు మనమే పడాలి. ఫ్రెంచి వాళ్లు 'la joie de vivre' అంటారు. జీవితం పట్ల జోష్ ఉండాలి. సరదాగా బతకాలి అని మనకు మనమే సంకల్పం చెప్పుకుని, దాన్ని అమలుచేయాలి. జీవిత భాగస్వామి ఆటిట్యూడ్‌లో మార్పు వచ్చిందని ఫిర్యాదు చేసేముందు మనమూ మారామనే గ్రహింపు ఉండాలి. మార్పు సహజమని యాక్సెప్ట్ చేయడంలోనే విజ్ఞత ఉంది.

కొన్ని జంటలను చూస్తూ ఉంటాం. అహం, కోపతాపాలు, పంతాలు పట్టింపులు ఏ స్థాయిలో ఉంటాయంటే పక్కింట్లో ఉన్న మనకు 'ఇదెక్కడి మార్జాల కాపురంరా బాబూ!' అనిపిస్తుంది. కానీ మర్నాటికి వాళ్లు పాలూ నీళ్లల్లా, పప్పూ ఉప్పులా కలిసిపోవడం చూసి విస్తుపోతాం. దీనికి కారణం ఇలా సర్దుకుపోయి, సంతోషంగా ఉండాలనే వాళ్ల దృఢసంకల్పమే! నా దృష్టిలో రుచులు– అభిరుచులు, సంగీతం, భోజనం, స్నేహితుల విషయంలో వచ్చిన తేడాలు, కొన్నిసార్లు తీవ్రమైన విభేదాలు... ఇవన్నీ మన దాంపత్య జీవితానికి నిజమైన రుచిని ఇచ్చే మసాలాలు. ఇవి లేకపోతే జీవితం నిస్సారంగా, చప్పగా గడిచిపోతుంది.

మనం మళ్లీ మొదటి టాపిక్‌కు – అంటే పెళ్లినాటి ప్రమాణాలకు– వస్తే నావి రెండు సూచనలున్నాయి. హిందూ వివాహాల్లో భర్త ఒక్కడే 'నాతి చరామి' మంత్రం పఠిస్తున్నాడు. కట్టుబాట్లను దాటి చరించే ప్రవృత్తి ఇటీవల మహిళల్లో కూడా పెరుగుతోంది కాబట్టి 'నాతి చరామి' మంత్రం భర్త చేతే కాకుండా, భార్య చేత కూడా చేయించడం మంచిదని నా ఉద్దేశ్యం. దానితో పాటు 'నేను హ్యాపీగా ఉండదలచుకున్నాను, పక్కవాళ్లనూ హ్యాపీగా ఉంచడానికి సర్వదా ప్రయత్నిస్తాను' అనే ప్రమాణం కూడా ఇద్దరి చేతా చేయించాలని నా అభిప్రాయం. 'నేను రాజీ పడుతున్నాను, కానీ అది నా సంతోషం కోసమే' అనే దృక్పథం ఉంటే వివాహ సంబంధమైన కలహాలూ, మరణాలూ తగ్గుతాయి.



■ **డా. మోహన్ కందా**
విశ్రాంత చీఫ్ సెక్రటరీ, ఉమ్మడి ఆంప్ర. ప్రభుత్వం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

సవాళ్లను దాటి సాకారం దిశగా పోలవరం

జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక పోలవరం ప్రాజెక్టు పనులు నిలిపేసి, అయిదు కోట్ల ఆంధ్రులకు తీరని ద్రోహం చేశారు. ఆయన అనాలోచిత, అసంబద్ధ నిర్ణయాల వల్ల 2020లో వచ్చిన వరదలకు డయాఫ్రమ్ వాల్ డ్యామేజీ అయి రాష్ట్రంపై రూ.2,745 కోట్ల అదనపు భారం పడింది. కాఫర్ డ్యాంలను సకాలంలో పూర్తిచేయకపోవడతో అనేక సమస్యలు తలెత్తాయి. అప్పట్లో కేంద్ర జలశక్తిశాఖ హెచ్చరించినా ఆయన చర్యలు చేపట్టలేదు. ప్రాజెక్టు ఆలస్యంతో విద్యుత్ ఉత్పత్తి జరగక రూ.4,000 కోట్లు, సాగునీరు & పారిశ్రామిక లాభాలు కోల్పోయి రాష్ట్రానికి రూ.17,575 కోట్ల నష్టం జరిగింది.

ఏడాదిన్నర క్రితం చంద్రబాబు నాయకత్వంలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు పనులను పట్టాలెక్కించి, శరవేగంగా నిర్మాణ పనులు సాగిస్తోంది. ప్రాజెక్టును 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని కంకణం కట్టుకుంది. విదేశీ నిపుణుల బృందాన్ని ఎంపిక, విదేశీ ఆకృతుల సంస్థను ఏర్పాటు చేసుకుని, కేంద్ర జలసంఘం, కేంద్ర జలశక్తి శాఖతో కలిసి ప్రాజెక్టులోని అనేక సాంకేతిక సవాళ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించింది. గతంలో ధ్వంసమైన డయాఫ్రం వాల్‌కు సమాంతరంగా మరో డయాఫ్రం వాల్ నిర్మాణం వేగంగా సాగుతోంది. మొత్తం ఇప్పటికే 75 శాతం పూర్తిచేసినట్లు సమాచారం. 2026 మార్చి నాటికి డయాఫ్రం వాల్ నిర్మాణంతో పాటు, గ్యాప్–1 ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం పూర్తి చేసేలా పనులు జరుగుతున్నట్లు, గ్యాప్–2లో వైబ్రో కాంప్యాక్షన్ పనులు 97 శాతం పూర్తయినట్లు తెలుస్తోంది. గ్యాప్–2 ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం పనులు మొదలుపెట్టేలా నిర్ణయించారు. స్ట్రిప్పింగ్, ఫిల్టర్ పనులు పూర్తి కావొచ్చినట్లు సమాచారం. ఇప్పటి వరకు పోలవరం ప్రాజెక్ట్ పనులు 88శాతం పూర్తిచేసినట్లు తెలుస్తోంది. క్లిష్టమైన టన్నెల్స్ లైనింగ్‌తో ఉన్న రైట్ కనెక్టివిటీస్ 82శాతం, లెఫ్ట్ కనెక్టివిటీస్ 62శాతం పనులు ప్రభుత్వం పూర్తి చేసింది.

పోలవరం ప్రాజెక్ట్ భూసేకరణ, నిర్వాసితుల కుటుంబాలకు పునరావాసం కోసం కూటమి ప్రభుత్వం ఏర్పడిన గత 18 నెలల కాలంలో దాదాపు రూ.1900 కోట్లు ఖర్చు చేసి మానవతా దృక్పథంతో నిర్వాసితుల పక్షాన నిలిచినది. 2016లోనూ అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నిర్వాసితులకు రూ.700 కోట్లు విడుదల చేసింది. గత జగన్ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు అధికారంలో ఉన్నా నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు.

ప్రాజెక్టు నిర్వాసితులకు 2026 డిసెంబర్ నాటికి పూర్తి పరిహారం చెల్లించాలని, కాలనీలు నిర్మించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వం కూడా పోలవరం నిర్మాణానికి సహకరిస్తున్నది. అవసరమైన నిధులు ముందే ఇవ్వడం అభినందనీయం. సవరించిన అంచనాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం రూ.30,436 కోట్లు కాగా, ఇందులో రూ.12,157 కోట్లు అడ్వాన్స్ ప్యాకేజీగా మంజూరు చేయడంతో పాటు మొదటి ఏడాదిలోనే రూ.5,052 కోట్లు విడుదల చేసింది. ఇప్పటివరకు ప్రాజెక్టు బిల్లులకు గాను రూ.2,644.57 కోట్లు చెల్లించింది. ఎడమ ప్రధాన కాలువ మిగిలిన పనులకు రూ.960 కోట్ల పరిపాలనా అనుమతి జారీ చేసింది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలతో సమావేశాలు ఏర్పాటు చేసి ముంపు సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలు ప్రారంభించింది. పోలవరంను 2027 నాటి పుష్కరాలకు ముందే ఆంధ్రా జనావళికి అందుబాటులోకి తేవడానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుండడం సంతోషకరం.

– **నీరుకొండ ప్రసాద్**

కూటమి లక్ష్యం 'డ్రగ్స్-ఫ్రీ ఆంధ్ర'

ప్రపంచవ్యాప్తంగా జనాభాలో 5.6శాతం మంది మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు అంచనాలున్నాయి. మన దేశంలో 30 ఏళ్ల లోపు యువకుల్లో 190 మిలియన్ల మంది మాదకద్రవ్యాల వాడకానికి గురవుతున్నారు. నేరాలు, హింస, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు... ఇవన్నీ మత్తుపదార్థాల దుష్పరిణామాలే. విద్యార్థులు, యువత చదువులు వదిలి, సర్వస్వం కోల్పోయి నిర్భాగ్యులవుతున్నారు.

వైసీపీ పాలనలో దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా ఆంధ్రప్రదేశ్ పేరే వినిపించేది. మన్యం గంజాయి తోటలుగా మారింది. కేంద్ర ఏజెన్సీలు కూడా షాక్ అయ్యేలా గంజాయి, హెరాయిన్, కొకైన్ రవాణా పెరిగింది. పాఠశాలలు, కాలేజీలు, బడ్డీ కొట్లలో సైతం గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా అమ్మకాలు జరిగాయి. అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్‌ను గత వైసీపీ 'గంజాయి ఆంధ్రప్రదేశ్'గా మార్చింది. జగన్‌రెడ్డి పాలనలో ఆన్‌లైన్ షాపింగుల ద్వారా విదేశాలకు సైతం గంజాయి, మత్తు పదార్థాల రవాణా జరిగింది. వైసీపీ పాలనలో మన్యంలో సుమారు 10 వేల నుంచి 15 వేల ఎకరాల్లో గంజాయి సాగు జరుగుతుండేదని అంచనా. పార్టీలు, వేడుకల్లో డ్రగ్స్‌ను ఏరులై పారిస్తూ, యువత జీవితాలతో వైసీపీ ఆడుకుంది.

> వైసీపీ పాలనలో దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా ఆంధ్రప్రదేశ్ పేరే వినిపించేది. కేంద్ర ఏజెన్సీలు కూడా దిగ్భ్రాంతిచెందేలా గంజాయి, హెరాయిన్, కొకైన్ రవాణా పెరిగింది. మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. నార్కోటిక్ పోలీసు స్టేషన్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ విభాగాలు, 26 జిల్లాల్లో ఈగల్ సెల్స్, ప్రత్యేక కోర్టులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.



తాము అధికారంలోకి వస్తే డ్రగ్స్ దుస్థితి నుంచి రాష్ట్రాన్ని బయటకు తెస్తామని ఎన్నికల ముందు కూటమి హామీ ఇచ్చింది. అధికారం చేపట్టిన నాటి నుంచే రాష్ట్రంలో గంజాయి సాగు, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. పాలనలోకి రాగానే మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. అడుగడుగునా 'ఈగల్' సైన్యాన్ని వేటకు దించింది. రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో నార్కోటిక్ పోలీసు స్టేషన్, విశాఖ, పాడేరు, అమరావతిలో స్టేట్ టాస్క్‌ఫోర్స్ విభాగాలు, 26 జిల్లాల్లో ఈగల్ సెల్స్, రాష్ట్రంలోని ఐదు ప్రధాన నగరాల్లో ప్రత్యేక కోర్టులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

గిరిజన, మారుమూల ప్రాంతాల్లో గంజాయి తోటలను డ్రోన్‌ల ద్వారా గుర్తించి, ప్రత్యేక పోలీస్ బృందాలు వాటిని ధ్వంసం చేశాయి. అల్లూరి జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలను కఠినంగా నిర్వహించి, గంజాయి రవాణాను కూటమి ప్రభుత్వం అడ్డుకుంది. బాధ్యులపై కేసులు నమోదు చేయడంతో పాటు, గంజాయి సాగు, రవాణా వల్ల కలిగే నష్టాలపై గిరిజన రైతులు, స్థానికులు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. గంజాయి సాగు, రవాణా జోలికి వెళ్లకుండా భయాన్ని కలిగించే వాతావరణాన్ని పోలీసులు సృష్టించారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులతో 'పరివర్తన' పేరిట సమావేశాలు నిర్వహించారు. గంజాయి సాగు మాని, ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని సూచించారు.

గిరిజన రైతులకు సిల్వర్ ఓక్, సీతాఫలం, జీడిమామిడి, అవకాడో, మెరింగా, డ్రాగన్ ఫ్రూట్, మామిడి వంటి 3,86,772 మొక్కలను పాలకులు పంపిణీ చేశారు. వాటిని పెంచుకునేందుకు జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిదినాలు కల్పిస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో గంజాయి రవాణాను అరికట్టేందుకు తనిఖీలను మరింత కఠినంగా నిర్వహించారు. గంజాయి, మత్తు పదార్థాల కేసుల సత్వర పరిష్కారానికి విశాఖ, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, తిరుపతిలో ప్రభుత్వం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయనుంది. మత్తు పదార్థాల అక్రమ రవాణాను నివారించడానికి ఒడిశా నుంచి వచ్చే రైళ్లను లక్ష్యంగా చేసుకుని వారానికి మూడుసార్లు ఉమ్మడి ఆపరేషన్‌ను నిర్వహించింది. సాగుదారులు, స్మగ్లర్లు, అమ్మేవారు, చివరికి వినియోగదారుల్ని కూడా వదలకుండా కేసులు నమోదు చేసి జైల్లో పెట్టే ఈగల్ విభాగం– రాష్ట్రంలో గంజాయి మొక్కే కాదు, వాసన కూడా లేకుండా చేసేందుకు నడుం బిగించింది.

విద్యాసంస్థల్లోనూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించేందుకు కీలక చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన పెంపొందించేందుకు, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్స్‌ను 4,786 స్కూళ్లు, కళాశాలల్లో ఏర్పాటు చేసింది. 'మహాసంకల్పం' పేరుతో సమావేశాలు జరుపుతోంది.

కూటమి ప్రభుత్వం మత్తు మందుల అక్రమ అమ్మకాలపై కూడా కఠినంగా వ్యవహరిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాపులపై దాడులు నిర్వహించి, ప్రిస్క్రిప్షన్ లేకుండా NRX/RX మత్తు మందులు అమ్ముతున్నవారిని, గడువు ముగిసిన మందులపై తేదీలు మార్చి అమ్ముతున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటోంది. ఔషధ నిబంధనల ఉల్లంఘనపై కూడా ఎటువంటి సడలింపు లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

మత్తుకు బానిసైన వారిని కూడా కాపాడుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా 56 డీ–అడిక్షన్ సెంటర్లతో పాటు, ప్రపంచ నాణ్యతా ప్రమాణాలతో కూడిన వరల్డ్–క్లాస్ పునరావాస కేంద్రాలను మూడింటిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వ్యసనం బారిన పడినవారికి కొత్త జీవితాన్ని అందిస్తోంది. ఈ కేంద్రాల్లో పూర్తి ఉచితంగా అత్యాధునిక వైద్య చికిత్స, మనోవైద్య నిపుణుల కౌన్సెలింగ్, దీర్ఘకాలిక పునరావాస సహాయం, కుటుంబ సభ్యులకు ప్రత్యేక మార్గదర్శకత్వం అందుతోంది. పాఠశాలలు, పోలీసు వ్యవస్థ, ఎన్జీఓలతో జతకట్టి మత్తుపదార్థాల దుష్పరిణామాలపై పాలకులు భారీ స్థాయిలో జాగృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాబోయే రోజుల్లో సెలబ్రిటీలతో కలిసి మరింత శక్తిమంతమైన ప్రచారం, అంతర్రాష్ట్ర కార్మికులపై ప్రత్యేక నిఘా వంటి కార్యక్రమాలు కూడా అమలులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.


ప్రభుత్వం 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటుంటే, వైసీపీ మాత్రం 'డ్రగ్స్ తీసుకో బ్రో' అంటూ యువతను నాశనం చేస్తోంది. వైసీపీ విద్యార్థి విభాగం విశాఖ జిల్లా అధ్యక్షుడు, ఆ పార్టీ ముఖ్య నేతలకు దగ్గరివాడు పులగం కొండారెడ్డి. ఆయన ఇంజనీరింగ్ విద్యార్థులను టార్గెట్ చేసి డ్రగ్స్ దందా నడిపిస్తూ 'ఈగిల్' టీంకి అడ్డంగా దొరికిపోయాడు. అయినా పార్టీ నుంచి సస్పెండ్ చేయకుండా డ్రగ్స్ పట్ల, యువత భవిత పట్ల తన వైఖరి చాటుకున్నాడు జగన్మోహన్‌రెడ్డి. రాష్ట్రంలో 'గంజాయి మత్తు' అనే మాటే వినిపించకూడదు అని కంకణం కట్టుకుంది కూటమి ప్రభుత్వం. వైసీపీ పాలనలో పెరిగిన గంజాయి మహమ్మారిని సమర్థవంతంగా అరికడుతోంది. టోల్‌ఫ్రీ నంబర్ 1972, వాట్సాప్ 8977781972 ద్వారా సమాచారం అందించాలని ప్రజలకు కూటమి ప్రభుత్వం పిలుపునిస్తోంది. 'డ్రగ్స్–ఫ్రీ ఆంధ్ర' కోసం అందరూ కలిసి ముందుకు సాగితే, యువత భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది.

◆ **బీద రవిచంద్రయాదవ్**
శాసనమండలి సభ్యుడు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ఎన్.టి.ఆర్

జిల్లా వార్తలు

మంగళవారం 9 డిసెంబరు 2025



● సుమనోహరం

నగరంలోని పాలిక్లినిక్ రోడ్డులోని సిద్దార్థ మైదానంలో రోజ్ సొసైటీ ఏర్పాటు చేసిన పుష్ప, ఫల, గృహ అలంకరణ మొక్కల ప్రదర్శన సోమవారం ముగిసింది. చివరి రోజు కూడా సందర్శకుల తాకిడి కనిపించింది. చిన్నారులు అధికంగా తరలివచ్చారు.

విజయవాడ ఏ1 రైల్వేస్టేషన్‌ను ప్రధాన రూట్లకు దూరం చేయాలని రైల్వేబోర్డు ఆలోచన చేస్తుందా? ఈ ఆలోచన బెజవాడ ప్రజలకు ముఖ్యమైన రైల్వే రూట్లను దూరం చేస్తుందా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. రైల్వే అధికారులు తాజాగా వేస్తున్న అడుగులు ఈ అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి.

సెపరేట్ చేస్తున్నారా?

విజయవాడ రైల్వేస్టేషన్ 'ఐసోలేట్' దిశగా అడుగులు

కమర్షియల్‌గా ఉపయోగించుకునే పన్నాగమేనా?

- తాజా రైల్వే ఆలోచనలతో అనుమానాలకు బలం
- రైల్వేస్టేషన్ అభివృద్ధి అమృత్ భారత్‌కు కాకుండా ప్రైవేట్‌కు..
- విజయవాడ మీదుగా ప్రధాన రూట్ల క్రమబద్ధీకరణ
- సమాంతరంగా రాయనపాడు, గుణదల స్టేషన్ల అభివృద్ధి
- అమరావతి, మచిలీపట్నం-రేపల్లె లైన్లు అందులో భాగమేనా?
- ఇప్పటికే చాలా రైళ్లు రాయనపాడు వరకు మార్పు
- ప్రధాన రూట్లను కూడా మళ్లించే ప్రణాళికలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రైల్వేస్టేషన్‌ను క్రమేణా కమర్షియల్ హబ్‌గా మార్చేసి ఆదాయాన్ని ఆర్జించాలన్నది రైల్వేబోర్డు ఆలోచనగా ఉంది. రద్దీ స్టేషన్లలో ఒకటైన ఈ రైల్వేస్టేషన్‌ను ముఖ్య రూట్ల నుంచి ఐసోలేట్ చేస్తేనే తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని భావిస్తున్నారు. ఇదే జరిగితే విజయవాడ ప్రధాన రైల్వేస్టేషన్ అతిముఖ్యమైన రూట్లను కోల్పోయే ప్రమాదం ఉంది. ఫలితంగా బెజవాడ రైల్వేస్టేషన్, పరిసర స్థలాలను కమర్షియల్‌గా సద్వినియోగం చేసుకునే ఆలోచన ఉన్నట్టు తెలుస్తోంది.

శాటిలైట్ రైల్వేస్టేషన్లలో కొన్నింటికి హాల్టింగ్

విజయవాడ రైల్వేస్టేషన్‌పై రద్దీ తగ్గించడానికి వీలుగా ఇప్పటికే 30 రైళ్లు శాటిలైట్ రైల్వేస్టేషన్ రాయనపాడులో ఆపేస్తున్నారు. భవిష్యత్తులో మరో 30 రైళ్లు ఆపేందుకు గుణదలను కూడా శాటిలైట్ రైల్వేస్టేషన్‌గా అభివృద్ధి చేయాలని యోచిస్తున్నారు.

ప్లాట్‌ఫాంల కుదింపు ఎందుకో..

దేశవ్యాప్తంగా చాలా రైల్వేస్టేషన్లను అమృత్ భారత్ కింద రైల్వేశాఖ అభివృద్ధి చేస్తోంది. మన రాష్ట్రంలో కూడా ఒక్క విజయవాడ తప్ప అన్ని రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు. విజయవాడను మాత్రం ప్రైవేట్ డెవలపర్లతో అభివృద్ధి చేయించాలని నిర్ణయించారు. అయితే, ఈ అభివృద్ధి ప్రాజెక్టులో పలు మార్పులు చేశారు. ప్రస్తుతం రైల్వేస్టేషన్‌లో 10 ప్లాట్‌ఫాంలు మిగతా 6లో..

నిరుపయోగంగా మారిన కొత్త ఆనకట్ట



మళ్లీ మొదటికి.. పోలంపల్లి!

పాత ఆనకట్ట మరమ్మతులకు మరోసారి ప్రతిపాదనలు

- » కౌలు చెల్లిస్తేనే గండ్లు పూడ్చేందుకు అనుమతిస్తాం : తెలంగాణ రైతులు
- » తక్షణం నీరందకుంటే వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి
- » ఆందోళనలో ఆయకట్టు రైతులు
- » రేపు సమావేశం కానున్న ప్రాజెక్టు కమిటీ, రైతులు

6

లడ్డూ తయారీ వంటశాలను ప్రారంభిస్తున్న ఈవో



లడ్డూ ప్రసాదంపోటు ప్రారంభం

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ మహోత్సవాలను పురస్కరించుకుని నూతన లడ్డూ ప్రసాదం పోటు తయారీ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈవో శీనానాయక్ కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలతో వంటశాలను ప్రారంభించారు. ఆలయ స్థానాచార్యుడు వి.శివప్రసాద్‌శర్మ, అర్చక బృందం ఈ ప్రత్యేక పూజలు నిర్వహించింది. భవానీ భక్తులకు నాణ్యమైన, రుచికరమైన లడ్డూ ప్రసాదాన్ని అందించాలనే లక్ష్యంతో ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. భవానీ దీక్షల విరమణ సమయంలో లక్షలాదిగా వచ్చే భక్తులకు నిరంతరం ప్రసాదం పంపిణీ చేయడానికి వీలుగా లడ్డూ ప్రసాదం పోటు తయారీ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు.

టెట్ ఏర్పాట్లు

- » రేపటి నుంచి ఈనెల 21 వరకు నిర్వహణ
- » పకడ్బందీ ఏర్పాట్లు : డీఈవో సుబ్బారావు

విజయవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) నిర్వహించడానికి పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. ఆన్‌లైన్‌లో జరిగే పరీక్షల కోసం జిల్లావ్యాప్తంగా ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు ఆదేశాల మేరకు ఎంఈవోలు ఈ పరీక్షా కేంద్రాలను సోమవారం తనిఖీ చేశారు. అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు తప్పనిసరిగా లేటెస్ట్ ఫొటోతో ఉన్న గుర్తింపుకార్డు (ఒరిజినల్ ఆధార్, పాన్‌కార్డు, ఓటరు కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం)తో హాజరుకావాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులు అప్లికేషన్‌లో వెల్లడించిన వైకల్య ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని, అప్లికేషన్‌లో పొరపాటున పీహెచ్‌సీ నమోదు చేసుకోకపోతే జిల్లా విద్యాశాఖాధికారి అనుమతితో సహాయకుడిని తీసుకురావచ్చని తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవని పేర్కొన్నారు.

దుర్గమ్మ కానుకల లెక్కింపు

» 26 రోజులకు రూ.5.22కోట్ల ఆదాయం



6

మద్యం మత్తులో గొడవ

అరుపులు.. ఆపై హత్య

- » మందు పార్టీలో ఇద్దరి మధ్య రేగిన వివాదం
- » అరవొద్దు అన్నందుకు సాయిపై నవీన్ దాడి
- » ఆగ్రహంతో సీసా పగలగొట్టి గొంతులో పొడిచిన సాయి
- » సూర్యాపేటలో అరెస్టు చేసిన పోలీసులు

సస్పెక్ట్ షీటర్ నవీన్‌రెడ్డి హత్యకు కారణం అదే

విజయవాడ/జగ్గయ్యపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పార్టీ ఇచ్చింది ఒకరు. మద్యం తాగుతూ పెద్దగా కేకలు వేసింది మరొకరు. అరుపులు ఆపమన్నది ఇంకొకరు. ఈ రెండింటి మధ్య జరిగిన వివాదమే సస్పెక్ట్ షీటర్ నవీన్‌రెడ్డి హత్యకు కారణమైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు గద్దె సాయికృష్ణ అలియాస్ పిల్ల సాయిని చిల్లకల్లు పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను రూరల్ డీసీపీ బి.లక్ష్మీనారాయణ, నందిగామ ఏసీపీ ఏబీజీ తిలక్‌తో కలిసి జగ్గయ్యపేట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం వెల్లడించారు.



విలేకరుల సమావేశంలో వివరాలు తెలుపుతున్న రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ తిలక్

అరుపుల నుంచి హత్య వరకు..

రాణిగారితోటలో ఉండే పిల్ల సాయికి చిల్లకల్లుకు చెందిన వల్లెపు నరేష్ స్నేహితుడు. అతడు విజయవాడలో ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడితో కలిసి సాయి కొన్నాళ్ల క్రితం చిల్లకల్లుకు వెళ్లాడు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన అన్వేష్, దేవరాజు, నందకిషోర్, రాజు, గోపీ అనే స్నేహితులను నరేష్ పరిచయం చేశాడు. తాను తెలంగాణాలోని కోదాడలో ఉన్న ఫ్యాక్టరీలో పనిచేస్తున్నానని, నిత్యం అక్కడి నుంచి విజయవాడకు వెళ్లాలంటే కష్టంగా ఉందని నరేష్‌కు చెప్పాడు. దగ్గరగా ఉండేందుకు చిల్లకల్లులో అద్దె గదిని చూడమని కోరాడు. గోపీ సాయంతో సాయికి ఒక గదిని అద్దెకు ఇప్పించాడు. నాటి నుంచి అతడు అక్కడే ఉంటున్నాడు. కాగా, చోరీ కేసులో నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న అలవల నవీన్‌కృష్ణ (30) బయటకు వచ్చి నేరుగా సాయి వద్దకు వెళ్లాడు. 15 రోజులుగా సాయి గదిలోనే ఉంటున్నాడు. నరేష్ ద్వారా అతడి స్నేహితులంతా ఈ ఇద్దరికీ స్నేహితులయ్యారు. అన్వేష్‌కు కుమార్తె జన్మించడంతో ఈనెల మిగతా 6లో..

మధ్యలోనే ఆగిన ఊపిరి

బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ వద్ద రోడ్డు ప్రమాదం

- » ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ మేనేజర్ మృతి
- » కారు, ట్రాలీకి మధ్య ఇరుక్కుపోయి నరకయాతన

విజయవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ దిగువన సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన విజయ గోపాలకృష్ణ (52) విజయవాడ గురునానక్ కాలనీలో ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో మిగతా 6లో..



ప్రమాదంలో మరణించిన విజయ గోపాలకృష్ణ

భవానీల నిరసన



ఆందోళన చేస్తున్న భవానీలకు సర్దిచెబుతున్న పోలీసులు

జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

- » పరిమితికి మించి వెళ్తున్న ఆటోను ఆపిన కానిస్టేబుల్
- » స్క్యూబ్రిడ్జి వద్ద గొడవ.. చేయిచేసుకున్న కానిస్టేబుల్
- » క్షమాపణ చెప్పాలంటూ బైఠాయించిన భవానీలు
- » రంగంలోకి దిగి సర్దిచెప్పిన పోలీసు ఉన్నతాధికారులు
- » కానిస్టేబుల్‌పై చర్యలకు హామీ ఇవ్వడంతో విరమణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ) : 'డౌన్.. డౌన్.. పోలీస్' అంటూ భవానీ మాలధారులు నిరసన వ్యక్తం చేశారు. మాలలో ఉన్న తమపై విచక్షణ కోల్పోయి దాడి చేసిన కానిస్టేబుల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. వివరాల్లోకి వెళితే.. భజన నిమిత్తం 16 మంది భవానీలు కంకిపాడు నుంచి తాడేపల్లి బయల్దేరారు. పరిమితికి మించి ప్రయాణిస్తున్న ఆటోను మార్గంమధ్యలో తాడిగడప 100 అడుగుల రోడ్డు వద్ద కానిస్టేబుల్ ఆపారు. ఆ సమయంలోనే భవానీలకు, కానిస్టేబుల్‌కు మధ్య మాటామాటా పెరిగి గొడవ జరిగింది. అయితే, మరోసారి అదే కానిస్టేబుల్ ఆటోను సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ఆపి ఫొటో తీసి పంపించేశారు. ఇదే సమాచారాన్ని సదరు కానిస్టేబుల్.. పటమట పోలీస్ స్టేషన్‌లోని మరో కానిస్టేబుల్‌కు చేరవేశారు. పటమట పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఆటోను బెంజిసర్కిల్ వద్ద ఆపి విచారణ చేశారు. ఈ సందర్భంలోనూ భవానీలకు, కానిస్టేబుల్‌కు వివాదం జరిగింది. మిగతా 6లో..

పెదపట్నం-పార్వతీపురం మార్గంలో డొంకరోడ్డుకు గండి



అక్రమార్కుల బరితెగింపు

మడచెట్ల నరికివేత నుంచి తప్పించుకునే కుట్రలు

- » తనిఖీ బృందాలు రాకుండా డొంకరోడ్లకు గండ్లు
- » ఎన్‌జీటీకి ఫిర్యాదు చేయాలనుకుంటున్న పర్యావరణ ప్రేమికులు
- » అయినా చలనం లేకుండా ఇష్టానుసారంగా చెట్ల నరికివేత

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మడ అడవులను ఇష్టానుసారంగా నరికేస్తున్న అక్రమార్కులు మరిన్ని దారుణాలకు తెగబడుతున్నారు. చెట్ల నరికివేత, రొయ్యల చెరువుల తవ్వకాల పరిశీలనకు వచ్చే తనిఖీ బృందాలను అడ్డుకోవటానికి రోడ్లకు గండ్లు కొడుతున్నారు. మిగతా 6లో..

పులిచింతల నీరు విడుదల సాధ్యం కాదు!

» కృష్ణా సెంట్రల్ డివిజన్ ఈఈ ఆర్.రవికిరణ్ 6

లారీలోని సిలిండర్ నుంచి గ్యాస్‌లీక్

» భయాందోళనలో ప్రజలు, వాహనచోదకులు 8

చారిత్రకం.. వెల్లుర్తిపాడు బౌద్ధారామం

» దేశంలోని 84వేల బౌద్ధ స్థూపాల్లో ఒకటి


దుర్గగుడిలో హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

దుర్గమ్మ కానుకల లెక్కింపు

» 26 రోజులకు రూ.5.22కోట్ల ఆదాయం

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం ఈవో వీకే శీనానాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ పర్యవేక్షణలో మహామండపం 6వ అంతస్తులో లెక్కించారు. 26 రోజులకు వచ్చిన కానుకలను లెక్కించగా రూ.5,22,18,647లు ఆదాయం సమకూరినట్టు ఈవో, ఛైర్మన్‌లు తెలిపారు. 415 గ్రాముల బంగారు ఆభరణాలు, 7కేజీల 465 గ్రాముల వెండి ఆభరణాలు, విదేశీ కరెన్సీ 489 యుఎస్‌ఏ డాలర్లు, 109 సింగపూర్ డాలర్లు, 125 కెనడా డాలర్లు, 860 యూఏఈ దీర్హమ్స్, 125 సౌదీ రియాల్స్, 4 మలేషియా రింగెట్స్, 105 ఆస్ట్రేలియా డాలర్లు, 10 ఇంగ్లండ్ ఫౌండ్లు, 10 స్టెర్లింగ్ ఫౌండ్లు, 20 మాల్దీవుల రుఫియా, 1 బెహరాన్ దీనార్స్, 20 యూరప్ యూరోలు భక్తులు అమ్మవారికి సమర్పించినట్టు వివరించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు ఏఈవోలు, ఉద్యోగులు, ఎస్.పి.ఎఫ్ వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, పలు సేవా బృందాలు, తదితరులు పాల్గొన్నారు.


ఈవో శీనానాయక్, ఇంజనీరింగ్ అధికారులతో కలసి భవానీ దీక్షల విరమణల ఏర్పాట్లపై తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్డీవో కావూరి చైతన్య

భవానీ దీక్ష విరమణలకు సర్వం సిద్ధం

» ఇంద్రకీలాద్రిపై ఏర్పాట్ల పరిశీలన

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లను రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) కావూరి చైతన్య సోమవారం ఈవో శీనానాయక్‌తో కలసి తనిఖీ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆటో క్యాడ్ ప్లాన్‌లను పరిశీలించి, భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఇరుముడులు సమర్పించేందుకు భక్తుల కోసం ఏర్పాటు చేయు హోమ గుండాల ప్రాంతాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదం అందించే ప్రదేశాన్ని, వసతులను తనిఖీ చేశారు. భవానీ దీక్షల విరమణకు వచ్చే లక్షలాది భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టారు.

కోగంటి బాబుకు మరో పదవి..

» వ్య.మా. ఛైర్మన్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక



కంచికచర్లరూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్ ఛైర్మన్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కంచికచర్లయార్డ్ ఛైర్మన్ కోగంటి వెంకట సత్యనారాయణ (బాబు) ఏకగ్రీవంగా ఎన్నుకయ్యారు. పార్టీకోసం అహర్నిశలు శ్రమిస్తూ, కష్టకాలంలో విజయం కోసం పనిచేసిన కోగంటి బాబుకు మరో పదవి వచ్చి చేరింది. ఇప్పటికే కంచికచర్ల మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా, పరిటాల ఎంపీటీసీగా, కంచికచర్ల జడ్పీటీసీగా, దశాబ్దకాలంగా మండల పార్టీ అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా కోగంటి మాట్లాడుతూ, మార్కెట్ యార్డ్ కమిటీల ఛైర్మన్‌లకు గ్రేడుల వారీగా తగిన సౌకర్యాలు, ఆర్థిక భరోసా, కల్పించే విధంగా తీర్మానాలు చేసినట్టు తెలిపారు. మార్కెట్ కమిటీల అభివృద్ధిపై త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించామన్నారు. కోగంటి బాబును కంచికచర్ల, వీరులపాడు మండల నాయకులు, కార్యకర్తలు అభినందనలతో ముంచెత్తారు.


గొల్లపూడి వన్‌సెంటర్ వద్ద ఆవుల కళేబరాలతో వెళుతున్న వాహనాన్ని అడ్డుకున్న విశ్వహిందూ పరిషత్ శ్రేణులు

ఆవుల కళేబరాల వాహనాన్ని అడ్డుకున్న విశ్వహిందూ పరిషత్ శ్రేణులు

విద్యాధరపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్రానికి తరలిస్తున్న ఆవుల కళేబరాల లోడు వాహనాన్ని విశ్వహిందూ పరిషత్‌శ్రేణులు అడ్డుకున్న సంఘటన సోమవారం గొల్లపూడి వన్‌సెంటర్ వద్ద జరిగింది. వాహనాన్ని భవానీపురం పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్రం కోదాడకు మినీ వాహనంలో ఆవుల కళేబరాలు తరలిస్తున్నారని సమాచారం విజయవాడలోని పలువురు విశ్వహిందూ శ్రేణులకు తెలిసింది. దీంతో వారు గొల్లపూడి వన్‌సెంటర్ వద్దకు వెళ్లి వాహనాన్ని ఆపి అందులో ఉన్న డ్రైవర్, ఇద్దరు సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం భవానీపురం పోలీసులకు సమాచారం తెలియపరిచారు. పోలీసులు వాహనం డ్రైవర్, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కళేబరాలు లోడు ఉన్న వాహనం దుర్వాసన వ్యాప్తిచెందటంతో ఆ వాహనాన్ని గొల్లపూడి ఆట్కిన్‌సన్‌రోడ్డులో నిలిపివేశారు. సిఐ ఉమామహేశ్వరరావు వాహనంలో ఉన్న రికార్డులు, బిల్లులను పరిశీలించి కళేబరాలు తరలించవచ్చా లేదా అనే దానిపై సంబంధిత విభాగం అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మావోయిస్టులను కలవడానికి అనుమతివ్వండి

» కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన మానవ హక్కుల సంఘు న్యాయవాదులు

విజయవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు మండలం కానూరులోని కొత్త ఆటోనగర్‌లో పోలీసులకు చిక్కి జైలులో ఉన్న మావోయిస్టులను కలవడానికి అనుమతి ఇవ్వాలని మానవ హక్కుల సంఘ న్యాయవాదులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత నెల 18న పెనమలూరు పోలీసులు 28 మంది మావోయిస్టులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారిలో 24 మంది రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారంలో ఉన్నారు. వారిని కలవడానికి అనుమతి ఇవ్వాలని మానవ హక్కుల సంఘ న్యాయవాదులు పిచ్చుక శ్రీనివాస్, వేముల రవీంద్రనాథ్, సతీష్, ఏఎస్ఎస్ రాంప్రసాద్, గంగాభవానీ, ఆంజనేయులు విజయవాడలోని ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

మళ్లీ మొదటికి.. పోలంపల్లి!


గండ్లు పూడ్చాల్సిన పాత ఆనకట్ట

» పాత ఆనకట్ట మరమ్మతులకు మరోసారి ప్రతిపాదనలు

» కౌలు చెల్లిస్తేనే గండ్లు పూడ్చేందుకు అనుమతిస్తాం : తెలంగాణ రైతులు

» తక్షణం నీరందకుంటే వేలఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి

» ఆందోళనలో ఆయకట్టు రైతులు

» రేపు సమావేశం కానున్న ప్రాజెక్టు కమిటీ, రైతులు

పోలంపల్లి ప్రాజెక్టు పరిధిలో అన్నదాతల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. రెండు దశాబ్దాలుగా ప్రభుత్వాలు మారినా తమ రాత మారడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో పోలంపల్లి డ్యాం సమస్యను ప్రస్తావిస్తూ ఓట్లు దండుకుంటున్న నేతలు.. ఆ తర్వాత పట్టించుకోవడం లేదనే విమర్శ అన్నదాతల నుంచి వ్యక్తమౌతోంది. ప్రాజెక్టు సమగ్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వానికి ఇప్పటికి రెండుసార్లు ప్రతిపాదనలు పంపినా ఎలాంటి నిధులు మంజూరుకాలేదు. దీంతో ఆయకట్టులోని సుమారు 25 వేల ఎకరాల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

పెనుగంచిప్రోలు రూరల్, డిసెంబరు 8, (ఆంధ్రజ్యోతి) : గండ్లు పూడ్చాలంటే తెలంగాణ రైతులకు కౌలు చెల్లించాలి. ప్రాజెక్టు దగ్గర గతంలో భారీ వరదల తాకిడికి తెలంగాణ వైపు రైతుల భూములు కోతకు గురయ్యాయి. 2004లో చేపట్టిన కొత్త డ్యామ్ నిర్మాణం వల్లే తమ భూములు కోతకు గురవుతున్నాయని స్థానిక రైతులు మూడేళ్ల క్రితం పాత ఆనకట్టకు గండ్లు పెట్టారు. దీంతో కాలువకు మళ్లాల్సిన సాగునీరు వృథాగా పోతుండటంతో అప్పటి ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ప్రభుత్వ అధికారులు అక్కడి రైతులతో చర్చించి సుమారు రూ.70 లక్షల వరకు కౌలు నిధులు మంజూరు చేశారు. ఆ తర్వాత ఆ భూములను ఏపీ ప్రభుత్వం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అందుకు సంబంధించిన దస్త్రాలు ఇరు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నడుస్తున్నాయి. ఈలోగా గతేడాది కౌలు చెల్లించాలని తెలంగాణ రైతులు డిమాండ్ చేస్తూ గండ్లు పూడ్చనీయటం లేదు.

రూ. 22 కోట్లకు ప్రతిపాదనలు

పాత ఆనకట్టను పటిష్ఠం చేయటంతో పాటు, తెలంగాణ రైతులకు చెందిన43 ఎకరాల కొనుగోలు కలిపి ఇటీవల రూ. 22 కోట్లతో అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఉన్నతాధికారులు ఆనకట్టను పరిశీలించి రూ.42 కోట్లతో ప్రభుత్వానికి నివేదిక పంపారు. రెండుసార్లు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు.

తక్షణావసరాలకు రూ. 10 లక్షలు అత్యవసరం

రైతులకు కౌలు రూపంలో రూ.5 లక్షలు, గండ్లు పూడ్చేందుకు సుమారుగా మరో రూ.5 లక్షలు మొత్తంగా రూ.10 లక్షలు అవసరం కానున్నాయి. కానీ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి మంజూరు కాకపోవటంతో ప్రాజెక్టు కమిటీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రస్తుతం ఆయకట్టులో సుమారు 10వేల ఎకరాల్లో మిర్చి, మొక్కజొన్న, ఇతర పంటలు సాగులో ఉన్నాయి. కొన్ని చోట్ల రబీ వరిసాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాలువలో సాగునీరు పారాల్సిన అవసరం ఏర్పడింది. ప్రస్తుతం నిధుల సమస్య ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను పైస్థాయికి తీసుకుపోయేందుకు బుధవారం జగ్గయ్యపేటలో ఆయకట్టు రైతులతో కలిసి ప్రాజెక్టు కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించనుంది.

తక్షణం గండ్లు పూడ్చకుంటే పంటలు ఎండిపోతాయి

- పొన్నం బాలాజీ, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్

రబీలో ఆయకట్టులో వాణిజ్య పంటలైన మిర్చి, పసుపు, మొక్కజొన్న, వరి, ఇతర పంటలు సాగులో ఉన్నాయి. తక్షణం గండ్లు పూడ్చి కాలువకు సాగునీరు మళ్లించాల్సి ఉంది. నిధుల లభ్యత లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి.


పులిచింతల డ్యామ్

పులిచింతల నీరు విడుదల సాధ్యం కాదు!

» ఇతర నీటి అవసరాలకు వినియోగించాల్సి ఉంది

» కృష్ణా సెంట్రల్ డివిజన్ ఈఈ ఆర్ రవికిరణ్

నందిగామ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నిబంధనల ప్రకారం ఎత్తిపోతల పథకాలకు పులిచింతల నుంచి నీటిని విడుదల చేయడం సాధ్యం కాదని కృష్ణా సెంట్రల్ డివిజన్ ఈఈ ఆర్ రవికిరణ్ చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఎత్తిపోతల పథకాలకు నీరు విడుదలపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలకు జలవనరులశాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు కృష్ణా సెంట్రల్ డివిజన్ ఈఈ ఆర్ రవికిరణ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పులిచింతలలో నీటి నిల్వ, విడుదల అంశం తమ పరిధిలోనిది కాదని స్పష్టం చేశారు. నదిలో నీటి కేటాయింపు కృష్ణా నది నిర్వహణ బోర్డు(కెఆర్ఎంబి) ఆదేశాల మేరకు కృష్ణా నీటి వివాదాల ట్రిబునల్(కెడబ్ల్యూడీటి) తీర్పుల ప్రకారం జరుగుతుందని చెప్పారు. నీటి నిర్వహణ పూర్తిగా శాస్త్రీయంగా, చట్టబద్ధ ఆదేశాలతో జరుగుతుందని తెలిపారు. డెల్టా సాగు, తాగునీటి అవసరాలు ఉన్నపుడు, వరద నీరు చేరినపుడు మాత్రమే పులిచింతల నుంచి నీటిని విడుదల చేస్తామని తెలిపారు. మిగులు నీరు, వరద ప్రవాహాలు వచ్చినప్పుడు మాత్రమే ఎత్తిపోతల పథకాలకు నీటిని వినియోగించుకొనే అవకాశం ఉందని చెప్పారు. రుతుపవనాలు ముగిసినందున ప్రస్తుతం పులిచింతలలో నిల్వ ఉంచిన నీరు ఎంతో విలువైనవన్నారు. డెల్టాలోని ఖరీఫ్ సాగుతో పాటు వేసవి నీటి అవసరాలకు ఈనీటిని వినియోగించాల్సి ఉందని చెప్పారు. వేసవిలో ఆరు జిల్లాలకు చెందిన వందలాది గ్రామాలకు తాగునీరు ఈ ప్రాజెక్ట్ నుంచి అందించాల్సి ఉందని తెలిపారు. విజయవాడ, అమరావతి, గుంటూరు వంటి నగరాల నీటి అవసరాలకు కూడా ఈ నీటిని వినియోగించాల్సి ఉందని చెప్పారు. గోదావరి నదిలో నీటి మట్టం కనీసం 14 మీటర్లు ఉంటేనే పట్టిసీమ నుంచి నీటిని తెచ్చుకొనే అవకాశం ఉందని చెప్పారు. కానీ ప్రస్తుతం ఆ మేర నీరు లేదని చెప్పారు. అందువల్లనే పులిచింతల నుంచి నీటిని విడుదల చేయడం లేదని ఆయన తెలిపారు. కృష్ణా సెంట్రల్ బోర్డు చట్ట పరిధిలో తమ విధులు నిర్వహిస్తుందని ఆయన చెప్పారు.

భవానీల నిరసన

(5వ పేజీ తరువాయి)

కొద్దిసేపటి తరువాత ఆటోలో బయల్దేరిన భవానీలను కానిస్టేబుల్ వెంబడించి స్క్యూబ్రిడ్జి వద్ద నిలుపుదల చేశారు.

రోడ్డుపై బైఠాయించిన భవానీలు

స్క్యూబ్రిడ్జి వద్ద ఆటోను ఆపిన కానిస్టేబుల్‌కు, భవానీ మాలాధారులకు మళ్లీ గొడవ అయ్యింది. భవానీ మాలధారణలో ఉన్న ఓ హిజ్రాపై కానిస్టేబుల్ చేయిచేసుకున్నాడు. చేతిపై బలంగా కొట్టడంతో తోటి భవానీ మాలధారులు కానిస్టేబుల్‌పై తిరగబడ్డారు. దీంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు. వెంటనే భవానీలంతా హైవేపై నినాదాలు చేశారు. కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని బైఠాయించారు. ఈ ఆందోళనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. అటు కనకదుర్గమ్మ వారధి వరకు, ఇటు రామవరప్పాడు రింగ్ వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రెండు గంటల వరకు ఆందోళన కొనసాగింది. కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకునే వరకు కదిలేదని భవానీలు పట్టుబడటంతో ఏసీపీ దామోదర్ ఘటనాస్థలానికి చేరుకుని భవానీలతో మాట్లాడారు. వివాదానికి కారణమైన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారంతా ఆందోళనను విరమించారు.

వివాదంపై విచారణ

భవానీ మాలాధారులకు, పోలీస్ కానిస్టేబుల్‌కు జరిగిన వివాదంపై విచారణ వేగవంతం చేసినట్లు పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. పరిమితికి మించిన ప్రయాణికులతో ప్రమాదకరంగా వెళ్తున్న భవానీ మాలాధారుల ఆటోను కానిస్టేబుల్ ఆపి, వారికి జాగ్రత్తలు చెప్పినట్లు పేర్కొన్నారు. భవానీలు సహనం కోల్పోయి కానిస్టేబుల్‌పై వాగ్వాదానికి దిగడమే కాకుండా అతని బైక్‌ను కింద పడేశారని, ఫోన్‌ను లాక్కుని నేలకేసి కొట్టారని, మరో కానిస్టేబుల్‌పై దాడి చేశారని ఆయన తెలిపారు. ఈ వివాదంపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని, సీసీ ఫుటేజీలను సేకరిస్తున్నామని తెలిపారు. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

బరితెగింపు

(5వ పేజీ తరువాయి)

కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం మండలం పెదపట్నంలో మడచెట్ల నరికివేతకు పాల్పడుతున్న మాఫియాపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎవరైనా తనిఖీలకు వస్తారేమోనని ఈ పని చేస్తున్నారు.


డొంకరోడ్లకు గండ్లు

పెదపట్నం నుంచి పార్వతీపురం వెళ్లే మార్గం వెంబడి లోపలి వైపు మడచెట్ల నరికివేత కొనసాగుతూనే ఉంది. ప్రధాన మార్గానికి అనుసంధానంగా డొంక రోడ్లు ఉంటాయి. ఈ డొంక రోడ్ల మీదుగా ముందుకువెళ్తే మడచెట్ల నరికివేత, రొయ్యల చెరువుల తవ్వకాలు కనిపిస్తాయి. డొంకరోడ్ల మీదుగా వెళ్తే బండారం బయటపడుతుందన్న ఉద్దేశంతో అక్రమార్కులు తెలివిగా ఒక్కొక్కటిగా గండ్లు కొట్టాలని నిర్ణయించారు. ముందుగా మొదటి డొంకరోడ్డుకు గండి కొట్టే పని ప్రారంభించారు. తనిఖీ బృందాల వాహనాలను అడ్డుకోవటానికి వీలుగా గండ్లు కొడుతున్నారని సమీప ప్రాంతాల ప్రజలు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. అయినా కూడా అధికారులు పట్టించుకోవట్లేదు. తూర్పు కృష్ణాలో మడచెట్ల నరికివేత పెడన, బంటుమిల్లి మండలాలతో పాటు పెదపట్నం వరకు పాకింది. దీంతో గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని కొంతమంది పర్యావరణ ప్రేమికులు సిద్ధమవుతున్నారు. గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్తే తనిఖీ బృందాలు వస్తాయన్న ఉద్దేశంతో అక్రమార్కులు డొంకరోడ్లకు గండ్లు కొట్టించే పనులు చేస్తున్నారు.

స్పందించరేం..!

పెదపట్నంలో మడచెట్ల నరికివేత, రొయ్యల చెరువుల తవ్వకాలకు సంబంధించి జిల్లా యంత్రాంగం స్పందించకపోవటం అనుమానాలకు తావిస్తోంది. అటవీ, రెవెన్యూ శాఖలు తమది కాదన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి. పీడబ్ల్యూడీ భూముల్లోని మడచెట్లను నరికివేస్తున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవట్లేదు. లజ్జబండ డ్రెయిన్ వెంబడి ఉన్న చెట్లను కూడా నరికి రొయ్యల చెరువులు సాగు చేస్తున్నా జలవనరుల శాఖ అధికారులు అటువైపు చూడట్లేదు. దీంతో మడచెట్ల సంరక్షణ కోసం కొంతమంది ప్రకృతి ప్రేమికులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)ను ఆశ్రయించాలని భావిస్తున్నారు.

జిల్లా ధరల నియంత్రణ కమిటీ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియా

కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ధరల నియంత్రణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలను సమీక్షించారు. సదరు సమావేశంలో గత సంవత్సరంతో పోల్చుకొంటే ఈ సంవత్సరం ధరలు నియంత్రణలో ఉన్నాయని, కూరగాయల దిగుమతులు ఎక్కువగా వున్నందువల్ల రానున్న కాలంలో కూడా కూరగాయలకు ఎటువంటి కొరత ఉండదని తెలియజేశారు. ఈ సమావేశంలో డీఎస్ఓ ఎ.పాపారావు, మార్కెటింగ్ ఏడీ, అగ్రికల్చర్ ఏడీ, రైస్ మిల్లర్స్ ప్రెసిడెంట్, జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్, దాల్స్, ఆయిల్స్ హోల్‌సేల్, రిటైలర్స్ ఇతర సభ్యులు హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ మహోత్సవం


వీధిలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మురళీధరన్ నంబూద్రి, తదితరులు

వన్‌టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ పూలబావి వీధిలో అయ్యప్ప మండలి పూజా మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అయ్యప్ప పడిపూజ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మురళీధరన్ నంబూద్రి ఆధ్వర్యంలో కేరళ సంప్రదాయ పద్ధతిలో జరిగిన పడిపూజా మహోత్సవంలో పెద్ద ఎత్తున అయ్యప్ప స్వాములు, భవానీలు పాల్గొని అయ్యప్పకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. పసుమర్తి శివరాజ్ కుమార్ బ్రదర్స్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి, కనకదుర్గమ్మ, షిరిడీ సాయి నాథుని భక్తి గీతాలను ఆలపించి స్వాములను భక్తి పారవశ్యంలోకి తీసుకువెళ్లారు. అయ్యప్ప నామస్మరణతో పూలబావి వీధి మారుమోగింది. అయ్యప్ప మండల పూజా మహోత్సవ కమిటీ ప్రతినిధి రుక్మన్ కుమార్ మాట్లాడుతూ, పూలబావి వీధిలో 31 సంవత్సరాలుగా అయ్యప్ప పడిపూజను నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థానికుల సహకారంతోనే అయ్యప్ప పడిపూజను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సెపరేట్ చేస్తున్నారా?

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. వీటిని 12 చేయాలని గతంలో ప్రతిపాదించారు. కానీ, 10నే కొనసాగిస్తున్నారు. ఈ నిర్ణయం వెనుక విజయవాడ రైల్వేస్టేషన్‌ను ఐసోలేట్ (ఒంటరిని) చేయాలన్న ఉద్దేశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే కమర్షియల్‌గా అభివృద్ధి చేయాల్సిన ప్రదేశాన్ని మూడొంతులు పెంచారు. దీనినిబట్టి విజయవాడలో రూ.వేలకోట్ల విలువైన రైల్వే ఆస్తుల ద్వారా ఆదాయాన్ని సాధించాలన్నది రైల్వేబోర్డు ఆలోచన.

అమరావతి రైల్వేలైన్ అలైన్‌మెంట్ ఇందులో భాగమేనా?

రాజధాని అమరావతికి రైల్వేలైన్ ఏర్పాటుకు సంబంధించి రైల్వేబోర్డు ఎంచుకున్న అలైన్‌మెంట్ మొదట్లో ఎవరికీ అర్థం కాలేదు. విజయవాడ నుంచి కృష్ణా కెనాల్ జంక్షన్ మీదుగా మంగళగిరి, ఉండవల్లి, అమరావతికి వెళ్లే అవకాశం ఉన్నా.. ఖమ్మంజిల్లా ఎర్రుపాలెం నుంచి పరిటాల మీదుగా అమరావతికి , తిరిగి అమరావతి నుంచి నంబూరుకు నూతన రైల్వేలైన్ ప్రతిపాదించారు. ఈ అలైన్‌మెంట్ వెనుక విజయవాడను ఐసోలేట్ చేయాలన్న ఆలోచన ఉన్నట్టు తెలుస్తోంది. ఢిల్లీ-విజయవాడ-చెన్నై మధ్య రాకపోకలు సాగించే రైళ్లు కొండపల్లి మీదుగా విజయవాడ వస్తున్నాయి. రానున్న రోజుల్లో ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు, అటు నుంచి చెన్నైకు రాకపోకలు సాగిస్తాయి. దీంతో ఢిల్లీ రైళ్లు విజయవాడను టచ్‌చేసే పరిస్థితి తగ్గుతుంది. అమరావతి నూతన రైల్వేలైన్ ఏర్పడితే కచ్చితంగా ఢిల్లీ-చెన్నై రైళ్లను అమరావతి మీదుగానే నడపాల్సి ఉంటుంది. ఇవేకాకుండా విజయవాడ మీదుగా వెళ్లే ఇతర జోన్లకు సంబంధించి పాసింగ్ త్రూ రైళ్లు కూడా విజయవాడకు రాకుండానే వెళ్లే అవకాశముంది.

కోల్‌కతా రైళ్లు సైతం రాయనపాడు మీదుగానే..

సికింద్రాబాద్ నుంచి కోల్‌కతా వెళ్లే రైళ్లు ప్రస్తుతం విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. భవిష్యత్తులో ఇవన్నీ రాయనపాడు శాటిలైట్ రైల్వేస్టేషన్ మీదుగా (అమరావతి రైల్వేలైన్ మీదుగా) వెళ్తాయని సమాచారం. దీంతో ఈ మార్గంలో నడిచే చాలా రైళ్లు విజయవాడను టచ్‌చేసే పరిస్థితి ఉండకపోవచ్చు. ఇదే జరిగితే అతి ముఖ్యమైన రెండో రూట్‌ను కూడా విజయవాడ రైల్వేస్టేషన్ కోల్పోయే ప్రమాదం ఉంది. విజయవాడకు వచ్చే రైళ్లలో సగభాగం కోల్‌కతా-చెన్నై మధ్య రాకపోకలు సాగించేవే. ఢిల్లీ, చెన్నై వయా విజయవాడ రూట్, సికింద్రాబాద్-చెన్నై వయా విజయవాడ రూట్‌ల తర్వాత మూడో స్థానంలో ఉన్న కోల్‌కతా-చెన్నై వయా విజయవాడ రైళ్లకు ఇప్పటికిప్పుడు విజయవాడ మీదుగా వెళ్లడం తప్ప మరో మార్గం లేదు. ఈ రూట్‌ను కూడా త్వరలో మళ్లించే అవకాశం ఉంది. నరసాపురం మీదుగా మచిలీపట్నం-రేపల్లె, రేపల్లె-బాపట్ల రైల్వేలైన్లకు సంబంధించి ప్రస్తుతం క్షేత్రస్థాయిలో సర్వే జరుగుతోంది. డీపీఆర్ రూపకల్పన చేస్తే భవిష్యత్తులో నూతన రైల్వేలైన్ ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అప్పుడు కోల్‌కతా-చెన్నై రైళ్లను మళ్లించే అవకాశం ఉంది. అలాగే, సికింద్రాబాద్-విశాఖపట్నం, సికింద్రాబాద్-భువనేశ్వర్ రైళ్లు కూడా రాయనపాడులోనే ఆగే అవకాశాలు ఉన్నాయి.

మద్యం మత్తులో గొడవ, అరుపులు.. ఆపై హత్య

(5వ పేజీ తరువాయి)

4న పార్టీ ఇచ్చాడు. దీనికి సాయి, నవీన్‌తో పాటు మిగిలిన వాళ్లందరినీ పిలిచాడు. వారంతా ధర్మవరప్పాడు తండా వద్ద చప్టాపై మందు పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. రాజు అనే యువకుడు ఇంటికి వెళ్లిపోతానని చెప్పడంతో నందకిషోర్, దేవరాజు అతడిని దింపడానికి వెళ్లారు. ఆ తర్వాత నవీన్‌రెడ్డి మద్యం తాగుతూ పెద్దగా అరిచాడు. దీనిపై సాయి అభ్యంతరం చెప్పాడు. తాగింది తక్కువ, హడావిడి ఎక్కువ చేస్తున్నావన్నాడు. ఇది నవీన్‌కు కోపాన్ని తెప్పించింది. ఇద్దరి మధ్య వివాదం రేగింది. నువ్వెంత అంటే నువ్వెంత అని.. దూషించుకున్నారు. దీంతో నవీన్ సీసా పగలగొట్టి సాయిపై దాడి చేశాడు. ఈ ఘటనలో సాయి చేతిపై గాయమైంది. దీనికి తగ్గట్టుగానే సాయి స్పందించాడు. తన వద్ద ఉన్న బీరు సీసాను పగలగొట్టి నేరుగా నవీన్ గొంతులో పొడిచాడు. సరిగ్గా అదే సమయానికి రాజును దింపడానికి వెళ్లిన నందకిషోర్, దేవరాజు ఘటనాస్థలం వద్దకు చేరుకున్నారు. వారు బైకుపై జగ్గయ్యపేటలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నవీన్‌రెడ్డి చనిపోయినట్టు వైద్యులు చెప్పడంతో భయంతో పారిపోయారు.

సూర్యాపేటలో మకాం

నవీన్‌రెడ్డిని హత్య తర్వాత సాయి తెలంగాణాలోని సూర్యాపేటకు పారిపోయాడు. అక్కడ బస్టాండ్ వద్ద ఉండే డార్మెటరీలో తలదాచుకున్నాడు. చేతిలో డబ్బు లేకపోవడంతో స్నేహితులకు వేర్వేరు నెంబర్ల నుంచి ఫోన్లు చేస్తున్నాడు. ఇలా సోమవారం తెల్లవారుజామున ఒక వ్యక్తి ఫోన్ నెంబర్ నుంచి స్నేహితులకు ఫోన్ చేశాడు. ఘటన జరిగినప్పటి నుంచి సాయి స్నేహితుల ఫోన్లపై పోలీసులు నిఘా పెట్టారు. సాయి ఫోన్ చేసిన నెంబరు సూర్యాపేట చూపించింది. పోలీసులు ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా, సాయి చిరునామా చెప్పాడు. వెంటనే ఒక బృందాన్ని అధికారులు అక్కడికి పంపి సాయిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని జగ్గయ్యపేట కోర్టులో హాజరుపరచగా, రిమాండ్ విధించారు.


కలెక్టర్ నుంచి ఐఎస్ఓ సర్టిఫికెట్ అందుకుంటున్న చల్లపల్లి కార్యదర్శి మాధవేంద్రరావు, నాగాయలంక కార్యదర్శి పవన్‌కుమార్

చల్లపల్లి, నాగాయలంక పంచాయతీలకు ఐఎస్ఓ సర్టిఫికెట్

చల్లపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి గ్రామ పంచాయతీకి ఐఎస్ఓ సర్టిఫికెట్ లభించింది. మచిలీపట్నంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావుకు సర్టిఫికెట్‌ను అందజేశారు. క్లీన్ అండ్ గ్రీన్, సచివాలయ, పంచాయతీ రికార్డుల నిర్వహణను పరిగణలోకి తీసుకుని ఐఎస్ఓ సర్టిఫికెట్‌కు చల్లపల్లి గ్రామ పంచాయతీని ఎంపికచేశారు. జిల్లాలో ఆరు పంచాయతీలకు ఐఎస్ఓ సర్టిఫికెట్లు రాగా, అందులో చల్లపల్లి గ్రామ పంచాయతీ ఒకటి కావటం విశేషం. ఇటీవలే స్వచ్ఛాంధ్ర రాష్ట్రస్థాయి అవార్డును సైతం చల్లపల్లి సాధించిన విషయం తెలిసిందే.

నాగాయలంక: నాగాయలంక గ్రామపంచాయతీ ఐఎస్ఓ సర్టిఫికెట్ లభించింది. కలెక్టరేట్‌లోని సోమవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డి.కె.బాలాజీ జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జె.అరుణ చేతుల మీదుగా ఐఎస్ఓ 9001-2015 సర్టిఫికెట్‌ను పంచాయతీ కార్యదర్శి జె.హెచ్.వి.పవన్ కుమార్, సర్పంచ్ కైతేపల్లి అంకాలుకు అందజేశారు. అధికారులు నాగాయలంక పాలకవర్గాన్ని అభినందించారు.

మధ్యలోనే ఆగిన ఊపిరి

(5వ పేజీ తరువాయి)

మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరారు. బెంజిసర్కిల్ మొదటి ఫ్లై ఓవర్ నుంచి స్క్యూబ్రిడ్జి వైపునకు దిగుతుండగా, ఆయనకు ముందు ఫార్చునర్ కారు, వెనుక ట్రాలీ ఉన్నాయి. ఈ రెండింటికీ మధ్యలో గోపాలకృష్ణ ఉన్నారు. ఏలూరు నుంచి గుంటూరుకు వెళ్తున్న ట్రాలీ బ్రేకులు ఫెయిలవ్వడంతో ఒక్కసారిగా గోపాలకృష్ణను, ఫార్చునర్ కారును ఢీకొట్టింది. కారు, ట్రాలీకి మధ్యలో గోపాలకృష్ణ ఉండిపోయారు. ట్రాలీ చక్రాల మధ్య ఇరుక్కుపోయారు. ఘటనాస్థలానికి చేరుకున్న బెంజిసర్కిల్ ట్రాఫిక్ పోలీసులు అంబులెన్స్‌లో గ్రీన్‌చానల్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొన ఊపిరితో ఉన్న ఆయన కాసేపటికి మరణించారు. కేసును పటమట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	149,158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 670

ఆటోనగర్ నుంచి శబరిమలకు ఆర్టీసీ బస్సు

ఆటోనగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ బస్‌స్టేషన్ నుంచి ఆదివారం రాత్రి అయ్యప్ప స్వాములతో ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరింది. ఈ బస్సులో 36 మంది అయ్యప్ప స్వాములు, ఒక గురుస్వామి, ఒక కన్యస్వామి, ఇద్దరు వంట చేసేవారు బయలు దేరారు. వారం రోజులపాటు అయ్యప్పల టూర్ సాగుతుంది. గత నెల 22 నుంచి ఇప్పటి వరకు ఆరు బస్సులు అయ్యప్పలను శబరిమలకు తీసుకువెళ్లాయని ఆటోనగర్ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ జి. రాంబాబు సోమవారం తెలిపారు. ప్రతి బస్సుకు విధిగా ఇద్దరు డ్రైవర్‌లు ఉంటారని ఆయన వివరించారు. జనవరి అయ్యప్ప జ్యోతి కార్యక్రమానికి కూడా శబరిమలకు టూర్ ఏర్పాటు చేస్తామని వివరించారు.



వృద్ధులకు దుప్పట్లు, మిఠాయిలు అందిస్తున్న సీనియర్ సిటిజన్స్

వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ

పటమట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పటమట సీనియర్ సిటిజన్లు దాతృత్వాన్ని చాటుకున్నారు. పటమట సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆలూరి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో గోసాల వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నందమూరి సరోజని వృద్ధాశ్రమంలో 40 మందికి రూ.30 వేల విలువైన దుప్పట్లు, మిఠాయిలు, బిస్కెట్లు పంచారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పొన్నగంటి సాంబశివరావు, గౌరవాధ్యక్షుడు సూర్యదేవర పాపారావు, కార్యదర్శి కొల్లిపర రామ్మోహన్‌రావు, వి.శివశంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

బస్సు బయలుదేరే ముందు సరిచూసుకోండి

డ్రైవర్లకు ఆటోనగర్ డిపో ఏఎం రాంబాబు సూచన



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆటోనగర్ డిపో అసిస్టెంట్ మేనేజర్ రాంబాబు

ఆటోనగర్, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా డ్రైవర్‌లు బస్సులను నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆటోనగర్ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్) జి. రాంబాబు కోరారు. ఆటోనగర్ డిపో గ్యారేజ్‌లో సోమవారం తెల్లవారుజామున ఆయన డిపో పరిధిలోని ఆర్టీసీ డ్రైవర్‌లతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రన్నింగ్‌లో ఏ బస్సులో కూడా సమస్య తలెత్తకూడదని, దానికి అనుగుణంగా బయలుదేరే ముందు అన్నీ సరిచూసుకోవాలని కోరారు. దీనికి మెకానిక్ సిబ్బంది అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రయాణికుల పట్ల గౌరవభావంతో మెలగాలన్నారు. సమావేశంలో పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి

కమిషనర్ ధ్యానచంద్ర



ప్రజల నుంచి అర్జీలు తీసుకుని పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మొత్తం 25 ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ డాక్టర్ డి.చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ రామారావు

పటమట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించి ప్రమాదాల నుంచి రక్షణ పొందండి క్షేమంగా ఇళ్లు చేరండి అంటూ నాల్గో పట్టణ సీఐ రామారావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ డీసీపీ షరీనా బేగం ఆదేశాల మేరకు ఎస్సై రాజేష్, సిబ్బందితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్మెట్ ధరించాలని లేని వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వాహనాలను వేగంగా నడిపే ముందు కుటుంబ సభ్యులను గుర్తు తెచ్చుకోవాలన్నారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వవద్దని సూచించారు.



రహదారి అధ్వానం..వాహనదారుల ఇబ్బందులు

బెంజిసర్కిల్, ఆంధ్రజ్యోతి: పటమటలంక నుంచి బెంజి సర్కిల్ వైపు రావడానికి వినియోగించే స్క్యూబ్రిడ్జి కింద రహదారి అధ్వానంగా ఉంది. సుమారు 300 మీటర్ల పరిధిలో గుంతలు పడి ప్రయాణం నరకప్రాయంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి, రాళ్లులేచి అటువైపుగా ప్రయాణించడానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో అటుగా ప్రయాణించడానికి భయపడుతున్నారు. వర్షాకాలంలో మరింత దుర్భరంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మించాలని కోరుతున్నారు.

వ్యర్థాల గుట్టలను తొలగించాలి



పటమట, ఆంధ్రజ్యోతి: 12వ డివిజన్ పప్పులమిల్లు సెంటర్ నుంచి ఎడమ వైపు తిరిగి పండరీపురం వెళ్లే రహదారి పక్కన ఆంజనేయ గుడి సమీపంలో థర్మాకోల్ షీట్స్ గుట్టలు గుట్టలు పెట్టారు. అవి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆ పక్కనే విద్యుత్‌శాఖ వారు స్తంభాలను నిరుపయోగంగా పడేసి ఉంచారు. వాటి కింద పాములు, విష కీటకాలు చేరే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటిని తొలగించాలని పలువురు కోరుతున్నారు.



మధ్యలో కట్ చేసి ఉన్న ఇనుపకంచె, నేలపై పడున్న జారుడు బల్లలు, ఉయ్యాల లేకుండా ఉన్న స్టాండ్

విరిగిన బెంచీలు...జారుడు బల్లలు

- చెన్నుపాటి రామకోటయ్య స్టేడియంలో అరకొరగా వెలుగుతున్న లైట్లు
- పనిచేయని వ్యాయామ పరికరాలు
- గ్రౌండ్‌కు వచ్చే అమ్మాయిలను వేధిస్తున్న ఆకతాయిలు

విజయవాడ, ఆంధ్రజ్యోతి: పటమట చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో అరకొరగా వెలుగుతున్న లైట్లతో ఇబ్బందిపడుతున్నారు. విరిగిన జారుడు బల్లలు, పనిచేయని వ్యాయామ పరికరాలు, బ్యాడ్మింటన్, టెన్నిస్ ఆడుకునేందుకు వచ్చే అమ్మాయిల పట్ల ఆకతాయిల వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో స్టేడియంకు రావడానికి పెద్దగా ఆసక్తి కనపరచడం లేదు. ఉదయం, సాయంత్రం సమయంలో వాకింగ్, వ్యాయామం చేసేవారు, వృద్ధులు కూర్చోవడానికి వేసిన బెంచీలు కొన్ని విరిగిపోయి ఉన్నాయి. గ్రౌండ్‌లో ఉన్న లైట్లలో కొన్ని మాత్రమే వెలుగుతున్నాయి.

కట్ చేసిన టెన్నిస్ కోర్టు ఫెన్సింగ్

కొంతకాలం కిందట గ్రౌండ్‌లో బాడ్మింటన్, టెన్నిస్ కోర్టు చుట్టూ ఇనుపకంచె వేశారు. ఈ కంచె కొన్ని రోజుల పాటు బాగున్నప్పటికీ తర్వాత ఆకతాయిలు వీటిని కట్ చేసి గ్రౌండ్ లోపలికి వచ్చి కాలక్షేపం చేస్తున్నారు. అవుట్‌డోర్ మైదానంలో ఉన్న లైట్లు సాయంత్రం వేళల్లో వెలగవు. దీంతో ఆకతాయిల తాకిడి మరీ ఎక్కువైంది. లైట్లు వెలగని కారణంగా ఇక్కడికి రావడానికి స్థానికులు పెద్దగా ఆసక్తి చూపడంలేదు. దీంతో రాత్రి సమయంలో ఆకతాయిలు మైదానంలోకి వచ్చి పాడు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. సాయంత్రం బ్యాడ్మింటన్, టెన్నిస్ ఆడడానికి వచ్చే అమ్మాయిలను చూపులు, మాటలతో వేధిస్తున్నారని ఇక్కడికి వచ్చేవారు ఆరోపిస్తున్నారు. కొన్ని రోజుల కిందట ఆకతాయిలకు కోచ్ వార్నింగ్ ఇచ్చినా వారి తీరు మారలేదని గ్రౌండ్‌కు వచ్చినవారు చెబుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

చిన్నచిన్న మరమ్మతులను అధికారులు పట్టించుకోవడం లేదు. లైట్లు పాడైపోవడంతో సాయంత్రం ఆటకు, వ్యాయామానికి వచ్చేవారి సంఖ్య తగ్గిపోయింది. దీంతో ఆకతాయిల తాకిడి ఎక్కువైంది. లైట్లు మరమ్మతులు చేయించమని పలుమార్లు అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదు. ఆకతాయిల వల్ల ఆడపిల్లలు రావడానికి భయపడుతున్నారు. బల్లలు విరిగిపోయి ఉన్నాయి. పరికరాలు కొన్ని పాడైపోయి ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రౌండ్‌లోని లైట్లు, వ్యాయామ పరికరాలు, జారుడు బల్లలు బాగుచేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

\- సత్యనారాయణ, పటమట



బహుమతులు సాధించిన విద్యార్థులతో చైర్మన్ విజయబాబు

కృష్ణాతరంగ్‌లో నలంద డిగ్రీ విద్యార్థులకు పతకాలు

లబ్బీపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణాయూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్ కృష్ణాతరంగ్‌లో నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ మొదటి రన్నరప్‌గా నిలిచిందని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎ.విజయబాబు విద్యార్థులను అభినందించారు. చదువుతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించేలా శిక్షణ ఇస్తున్నామని, 16విభాగాల్లో తమ విద్యార్థులు బహుమతులు సాధించారని తెలిపారు.

డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు

లబ్బీపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో ప్రకృతి పట్ల వారి భావాలను, వారు ఊహించే కలల ప్రపంచాన్ని చిత్రాల ద్వారా వ్యక్తీకరించేందుకు నేచర్ అండ్ డ్రీమ్స్ డ్రాయింగ్ పోటీలను నిర్వహించడం జరిగిందని గ్లో బై కీర్తిలాల్స్ స్టోర్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. సోమవారం షోరూమ్ ఆవరణలో విజేతలకు బహుమతుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చిన్నారులకు నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా విజయవాడ గ్లో బై కీర్తిలాల్స్ షోరూమ్‌లో డ్రాయింగ్ పోటీలు నిర్వహించామని తెలిపారు. చిన్నారులు రూపొందించిన డ్రాయింగ్‌లలో సమగ్ర పరిశీలన అనంతరం ముగ్గురు చిన్నారులు విజేతలుగా నిలిచారని తెలిపారు.



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

లయోలా కళాశాలలో రక్తదాన శిబిరం

భారతీనగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాల అటానమస్ 72వ వ్యవస్థాపక దినోత్సవం, ఏఎల్‌యూ ఎన్ఎస్ఎస్ యూనిట్ల 16వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కళాశాలలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.ఆర్.జాన్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి చిట్టిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మెల్చియర్ మాట్లాడుతూ విద్యార్థులకు రక్తదాన ప్రాధాన్యతను వివరించారు. రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు.

ఈ శిబిరంలో 51యూనిట్ల రక్తాన్ని విద్యార్థి వలంటీర్లు దానం చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ, సీఎస్ఆర్ టీమ్ సహకారంతో దాతలకు స్నాక్స్ గిఫ్ట్ పౌచ్‌లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్‌మోహన్, హెచ్‌డీఎఫ్‌సీ, సీఎస్ఆర్ వింగ్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ చల్లా వేణుగోపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎ.శామ్యూల్ దయాకర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, చిత్రంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

చంద్రబాబు అంటేనే డీఎస్సీ

- శ్రీప్రతిభ కోచింగ్ సెంటర్ విజయోత్సవ సభలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

పెనమలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లక్షలాది ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామకాలకు కారణమైన డీఎస్సీ అంటే చంద్రబాబు అని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. ఒకే ఒక్క కోచింగ్ సెంటరు శ్రీప్రతిభ నుంచి రికార్డు స్థాయిలో 358మంది విద్యార్థులు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన సందర్భంగా ఆదివారం కానూరు శ్రీప్రతిభ కోచింగ్ సెంటరులో ఏర్పాటు చేసిన డీఎస్సీ విజయోత్సవ సభలో కొనకళ్ల మాట్లాడారు. వేలాది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి విద్యారంగం పట్ల తమకున్న ప్రత్యేక బాధ్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ చెప్పకనే చెప్పారని కొనియాడారు. కోచింగ్ సెంటర్ అధినేత జంపాన సుధాకర్ మాట్లాడుతూ, ప్రణాళికా బద్ధ విద్యాబోధన, పటిష్టమైన షెడ్యూల్, అనుభవం గల ఉపాధ్యాయుల బోధన వల్లే తమ కోచింగ్ సెంటరు అద్భుత ఫలితాలు సాధిస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ, మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చిన విధంగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు ఏటా డీఎస్సీని ప్రకటిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, శ్రీప్రతిభ కోచింగ్ సెంటరు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సభలో డీఎస్సీ విజేతలను అతిథులు, కోచింగ్ సెంటర్ యాజమాన్యం సత్కరించారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, గొట్టిముక్కల రఘురామరాజు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, డైరెక్టర్ శొంఠి శివరాంప్రసాద్, కుడిపూడి సత్తిబాబు, మల్లెల ఈశ్వరరావు. ఏఎస్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

భర్త కనపడటం లేదంటూ ఫిర్యాదు

వన్‌టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన పెయింటర్ (50) అదృశ్యమైనట్లు సోమవారం కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం రాణిగారితోట రవి పబ్లికేషన్స్ సమీపంలో కుటుంబంలో ఉంటున్న పచ్చిపాల నాగరాజు పెయింట్ పనులు చేస్తుంటాడు. ఇతని భార్య సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంది. నాగరాజు ఆరోగ్యం బాగోలేకపోవటంతో ప్రస్తుతం ఇంటివద్దే ఉంటున్నాడు. ఈనెల 3న బయటకు వెళ్లి వస్తానని నాగరాజు భార్యకు చెప్పి వెళ్లాడు. ఆ రోజు రాత్రి వరకు అతను రాకపోవటంతో ఆ మరుసటిరోజు కుటుంబ సభ్యులు అతనికి ఫోన్ చేయగా, ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. నాగరాజు భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



పొంగిపొర్లుతున్న డ్రెయినేజీ

బెంజిసర్కిల్, ఆంధ్రజ్యోతి: పటమటలంకలోని వల్లూరు సరోజిని దేవి పాఠశాల సమీపంలోని యూజీడీ గత 10 రోజులుగా పొంగిపొర్లుతోంది. పాఠశాల పక్కన ఉండడంతో విద్యార్థినీ విద్యార్థులు అటుగా వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. దుర్గంధం వెదజల్లుతోందని, త్వరితగతిన యూజీడీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ అండ

21వ డివిజన్‌లో చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



బాధితులకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

కృష్ణలంక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) గొప్ప కార్యక్రమమని, ఈ పథకం పేదలకు ఆర్థికంగా అండగా ఉండే మంచి కార్యక్రమమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. సోమవారం 21వ డివిజన్ కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్‌లో వైద్య సహాయం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా 30 మందికి మంజూరైన రూ.36,64,880ల విలువైన చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఇదే కార్యక్రమంలో తాడిశెట్టి సోముకి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు, 19వ డివిజన్‌కు చెందిన టీడీపీ కార్యకర్త పేరుపోగు రవి కుటుంబసభ్యులకు రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు, కొవ్వూరి కిరణ్‌బాబు, టీడీపీ నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, కొర్రా అప్పన్న, బీజేపీ నాయకులు కోలపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు గద్దె పరామర్శ

20వ డివిజన్ రణదీవెనగర్ కట్ట, ఓడియా హాస్పటల్ ఏరియాలో సోమవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైన మూడిళ్లను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పరిశీలించారు. ప్రమాద స్థలానికి వెళ్లి, అగ్నిమాపక సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. దగ్ధమైన ఇళ్లను పరిశీలించారు. మూడు ఇళ్లకు ఒక్కొక్క ఇంటికి రూ.5వేల చొప్పున రూ.15 వేలు బాధితులకు అందచేశారు. నిత్యావసరాలు, దుస్తులు, సామాన్లు కూడా అందచేస్తామని గద్దె తెలిపారు. టీడీపీ నాయకులు గల్లా శ్రీను, శివలక్ష్మి, ఆర్.రమాదేవి, వేముల భవానీ, తదితరులు పాల్గొన్నారు.

క్లినికల్ థర్మామీటర్‌పై సదస్సు

మొగల్రాజపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం సోమవారం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లినికల్ థర్మామీటర్ అనే అంశంపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్ డైరెక్టర్ (భువనేశ్వర్) ప్రొఫెసర్ కెకె నందా మాట్లాడారు. చిన్నారుల్లో పెద్ద వారి కన్నా శరీర వేడి ఎక్కువ అని రుజువైందన్నారు. ఈ కార్యక్రమంలో నందాను కళాశాల డీన్ రాజేష్ జంపాల, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మనోరంజని, భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి. శ్రీనివాసకృష్ణ సత్కరించారు. అధ్యాపకులు జె.పాండు రంగారావు, డాక్టర్ ఎం.తస్నీం, డాక్టర్ ఖాజా ముస్సరీన్, టి. పూజిత, డాక్టర్ ఎస్. విజయకృష్ణ, ఎన్. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి అన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి, ఆంధ్రజ్యోతి: ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అన్నప్రసాద పథకానికి సోమవారం విశాఖపట్నం సీతమ్మధారకు చెందిన కె.వరప్రసాద్ కుటుంబసభ్యులు రూ.1,00,023లు విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు వారిని అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లి దర్శనం, వేద ఆశీర్వచనం, లడ్డూప్రసాదం, శేషవస్త్రం అందచేశారు.

లంచం కేసులో రైల్వే ఉద్యోగికి జైలు, జరిమానా

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బిల్లులు చెల్లించేందుకు కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ సీబీఐకి పట్టుబడిన రైల్వే ఉద్యోగికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ సీబీఐ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ కార్యాలయంలో చల్లా శ్రీనివాస రావు అకౌంట్స్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. గుంతకల్ రైల్వే డివిజన్ పరిధిలో బెంగళూరుకు చెందిన గ్లోబల్ ఏజెన్సీ సంస్థ 2017లో కొన్ని పనులు చేపట్టింది. ఆ సంస్థ పనులు పూర్తిచేయడంతో బిల్లు కోసం దరఖాస్తు చేసుకుంది. 2017 జూలై, సెప్టెంబరు నెలలకు సంబంధించిన పనులకు రూ.30 లక్షలు బిల్లు చెల్లించాలంటే తనకు రూ.15 వేలు లంచం ఇవ్వాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అదే ఏడాది మార్చి నుంచి జూలై వరకూ చేసిన పనులకు బిల్లు ఇచ్చినప్పుడు శ్రీనివాసరావుకు లంచం ఇచ్చిన సంస్థ ప్రతినిధులు.. మరోసారి ఇవ్వడం ఇష్టం లేక సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాసరావు లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. ఈ కేసుల్లో ఇరువర్గాల వాదోపవాదాలు విన్న తర్వాత, ఆధారాలను పరిశీలించిన కోర్టు శ్రీనివాసరావుకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

యూజీ, పీజీ అడ్మిషన్లకు గడువు పెంపు

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూజీ, పీజీల స్పాట్, మేనేజ్‌మెంట్ కోటా అడ్మిషన్లకు గడువు పొడిగిస్తున్నట్లు ఉన్నత విద్యా మండలి సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ కోటాల్లో అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ గడువును ఈనెల 10 వరకు పొడిగించినట్లు తెలిపింది. ఆ తేదీ వరకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయవచ్చని పేర్కొంది.

రెండు లారీలు ఢీ.. ఒకరి సజీవ దహనం

▸▸ దగ్ధమైన ఆయిల్ ట్యాంకర్.. కేసు నమోదు


పెంచికలపాడు వద్ద జరిగిన ప్రమాదంలో తగలబడుతున్న ట్యాంకర్

బేస్తవారపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనంతపురం-అమరావతి జాతీయ రహదారిలో సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఆయిల్ ట్యాంకర్ దగ్ధమైంది. డ్రైవర్ క్యాబిన్‌లోనే సజీవ దహనమయ్యాడు. ఈ ఘటన ప్రకాశం జిల్లా బేస్తవారపేట మండలం పెంచికలపాడు వద్ద చోటుచేసుకుంది. విశాఖపట్నం సమీపంలోని పరవాడ నుంచి తాడిపత్రికి మడ్డి ఆయిల్‌తో వెళుతున్న ట్యాంకర్‌ను, అనంతపురం నుంచి రాజమండ్రికి టమాటాల లోడుతో వెళుతున్న లారీ ఢీకొట్టింది. టమాటాల లారీ వేగంగా వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా టైర్ పగలడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఆయిల్ ట్యాంకర్ దగ్ధమైంది. ఆ లారీ క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ విశాఖపట్నం జిల్లా దేవరపల్లి మండలానికి చెందిన పైడికొండలు దుర్గారావు(50) సజీవ దహనమయ్యాడు. టమాటాల లారీ పాక్షికంగా కాలిపోయింది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. దుర్గారావు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువ మేధతో నవ ఆవిష్కరణలు: జేసీ

● ఆర్‌టీఐహెచ్ తోడ్పాటుతో పరిశ్రమల ఏర్పాటు దిశగా అడుగులు

కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యువ మేధస్సు నవ ఆవిష్కరణలకు దోహదం చేస్తోందని, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) తోడ్పాటుతో పరిశ్రమల ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయని ఇన్‌చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్-విజయవాడ స్పోక్ ఆధ్వర్యంలో ఇగ్నైట్ సెల్‌లో యువత వివిధ సమస్యలకు చూపిన సాంకేతిక పరిష్కారాలను ప్రదర్శించారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న మోడళ్ల కంటే 60 శాతం తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే ప్రొస్థటిక్ చేతిని విష్ణు అసిస్టివ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రదర్శించింది. అలాగే ఎస్‌ఆర్‌ఎం వర్సిటీ-టీమ్ స్కైవర్క్స్ బృందం స్వయం నియంత్రిత డ్రోన్ లాస్ట్-మైల్ డెలివరీ వ్యవస్థను ప్రదర్శించింది. మారిస్‌స్టెల్లా కళాశాల విద్యార్థులు సామాజిక ప్రభావం కలిగించే పలు సాంకేతికతలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ ఇలక్కియా మాట్లాడుతూ యువ ఆవిష్కర్తలు, విద్యార్థి పరిశోధకులను ఆర్‌టీఐహెచ్‌తో పాటు కలెక్టరేట్‌లోని ఇగ్నైట్ విభాగం ప్రోత్సహిస్తోందని, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనను వేగవంతం చేసేందుకు ఈ చర్యలు దోహదం చేస్తాయన్నారు. ప్రోగ్రాం అసోసియేట్స్ జీ సుజాత, సౌమ్యా మనోజ్, ఆర్‌టీఐహెచ్ సీఈవో జీ కృష్ణన్ పాల్గొన్నారు.

కొత్త జిల్లాలకు అనుగుణంగా

అక్రిడిటేషన్లు మంజూరు చేయాలి

● సీఎంను కోరిన ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం

విజయవాడ, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాల ఏర్పాటుకు అనుగుణంగా 2026-27 సంవత్సరానికి అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడును ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం(ఏపీజేఎఫ్) కోరింది. ఈ మేరకు సీఎం క్యాంపు కార్యాలయంలో ఏపీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాజేష్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల రాష్ట్ర అధ్యక్షుడు మద్దినేని అనిల్, సీనియర్ జర్నలిస్ట్ కృష్ణమోహన్ సోమవారం సీఎం చంద్రబాబును కలిసి వినతి పత్రం ఇచ్చారు. ప్రస్తుతం మీడియా అక్రిడిటేషన్ వెబ్‌పోర్టల్‌లో అనేక సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నట్టు వారు తెలియజేశారు. దీనివల్ల అప్లికేషన్ ప్రక్రియలో జర్నలిస్టులకు సమస్యలు తలెత్తుతున్నాయని సీఎంకు విన్నవించారు. దీనిపై సీఎం చంద్రబాబు నాయుడు స్పందిస్తూ తక్షణమే వెబ్‌పోర్టల్‌లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

నిర్వహణ కారణాలతో పలు ప్రత్యేక రైళ్ల రద్దు

రైల్వేస్టేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ కారణాలతో పలు ప్రత్యేక రైళ్లను రద్దుచేసినట్టు విజయవాడ డివిజన్ పీఆర్వో సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న నడవాల్సిన 07144 చర్లపల్లి - నర్సాపూర్, 07155 కాకినాడ టౌన్ - చర్లపల్లి ఈనెల 26న నడవాల్సిన 07145 నర్సాపూర్ - చర్లపల్లి, 07156 చర్లపల్లి - కాకినాడ టౌన్, 07157 హైదరాబాద్ - కాకినాడ టౌన్ ఈనెల 27న నడవాల్సిన 07158 కాకినాడ టౌన్ - హైదరాబాద్ ప్రత్యేక రైళ్లను రద్దు చేశారు. ఇంతకుముందు ఈ ప్రత్యేక రైళ్లు ఒక్కో సర్వీసు చొప్పున నడుస్తాయని అధికారులు ప్రకటించారు. నిర్వహణ కారణాలతో రద్దు చేస్తున్నట్టు పత్రికటించారు.

ఆరు పంచాయతీలకు ఐఎస్‌వో అవార్డులు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్‌లో తమ సమర్థతను చూపించి సంపాదన చేకూర్చిన ఆరు పంచాయతీలకు ఐఎస్‌వో అవార్డులను కలెక్టర్ డీకే బాలాజీ అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో డీపీవో అరుణతో పాటు చల్లపల్లి పంచాయతీ ఈవో పీవీ మాధవేంద్రరావు, కేసరపల్లి పంచాయతీ ఈవో సీవీఎస్ఎల్ ఆర్‌వీ ప్రసాద్, బాపులపాడు పంచాయతీ ఈవో పరమేశ్వరి, ఆత్కూరు పంచాయతీ ఈవో పీ సురేష్‌కుమార్, పునాదిపాడు పంచాయతీ ఈవో బీ వెంకటేశ్వరరావు, నాగాయలంక పంచాయతీ ఈవో పవన్‌కుమార్‌కు అవార్డులు అందజేశారు. జేసీ నవీన్, డీఆర్వో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చారిత్రకం.. వెల్దుర్తిపాడు బౌద్ధారామం

● దేశంలోని 84వేల బౌద్ధ స్థూపాల్లో ఒకటి ● 177 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన బౌద్ధారామం
● కొండను అభివృద్ధి చేస్తే పెరగనున్న పర్యాటకం ● విలువైన సంపద ఉందని గతంలో తవ్వకాలు

ఆంధ్రజ్యోతి, పెనుగంచిప్రోలు రూరల్: జిల్లాలోని పెనుగంచిప్రోలు మండలం వెల్దుర్తిపాడు కొండపైనున్న బౌద్ధక్షేత్రం ఆధ్యాత్మికతకు ఆహ్లాదానికి ప్రతీకగా నిలుస్తోంది. కొండపైనున్న బౌద్ధారామం స్థూపాలు, పలు రకాల కట్టడాలు పర్యాటకులను ఎంతోగానో ఆకర్షిస్తున్నాయి. ఇటీవల యోగా, ధ్యానం చేసుకునేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్న నేపథ్యంలో ఈ కొండను అభివృద్ధి చేస్తే ప్రముఖ పర్యాటక ప్రాంతంగా మారనుంది.


కొండపై ఉన్న బౌద్ధస్థూపాలు, కొండపైకి వెళ్లే మార్గం

కొండపై బుద్ధుడి అవశేషాలతో స్థూపం

గుమ్మడిదుర్రు పంచాయతీ పరిధిలోని వెల్దుర్తిపాడు గ్రామ సమీపంలో 177 ఎకరాల విస్తీర్ణంలో ఈ కొండ విస్తరించి ఉంది. కొండపై సుమారు 8 ఎకరాల్లో పూర్తిగా బౌద్ధారామం నిర్మాణం చేశారు. దీన్ని క్రీస్తు పూర్వం 250లో కళింగ యుద్ధం ముగిసిన తర్వాత అశోకుడు బౌద్ధమతాన్ని స్వీకరించి ఆ ధర్మాన్ని ప్రచారం చేయటంలో భాగంగా దేశవ్యాప్తంగా 84వేల బౌద్ధస్థూపాలు నిర్మించగా అందులో ఇదొకటని చరిత్రకారులు చెబుతున్నారు. బుద్ధుడి శిష్యులు స్థూపంలో బుద్ధుడి అవశేషాలతో పాటు విలువైన సంపదను దాచినట్టు చరిత్ర చెబుతోంది. ఆ ప్రచారంతోనే దుండగులు పలుమార్లు ఈ కొండపై రహస్యంగా తవ్వకాలు చేశారు. విలువైన శిల్పాలను కాపాడుకునేందుకు వాటిని పురావస్తుశాఖ వారు గుంటూరు జిల్లా అమరావతికి తరలించారు. బౌద్ధమత సన్యాసులు వెల్దుర్తిపాడు కొండతో పాటు, జగ్గయ్యపేట సమీపంలోని ధనంబోడుపై నివాసం ఏర్పాటు చేసుకొని ఈ ప్రాంతంలో బుద్ధుడి బోధనలు ప్రచారం చేశారు. అనంతరం కాలంలో కాకతీయ సేనలు, మొఘల్ సేనలకు విడిదిగా కూడా కొండను వినియోగించుకున్నారు.


వెల్దుర్తిపాడు కొండ

అభివృద్ధి చేస్తే పర్యాటక శోభ

బౌద్ధారామం కొండను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతానికి మరింత శోభను తెచ్చిపెడుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పదేళ్లుగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ ఆధ్వర్యంలో కొండపై మొక్కలు నాటడం, విత్తన బంతులు వెదజల్లటం వంటి కార్యక్రమాలు చేపడ్డడంతో కొండపై పచ్చదనం పెరిగి వచ్చేవారికి ఆహ్లాదాన్ని పంచుతోంది. ఒకపుడు బోడిగుండులా ఉండే కొండపై మొక్కలు పెరిగి పచ్చదనంతో కళకళలాడుతోంది. ప్రభుత్వం ఈ కొండకు మరిన్ని వనరులు సమకూర్చి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రుద్రరాజు చెరువు కింద వాగును ఆక్రమించి వరిపంట సాగు

● పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

మైలవరం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లూరు శివారు దాసుళ్లపాలెం రుద్రరాజు చెరువు కింద వాగును కొంతమంది రైతులు యథేశ్ఛగా ఆక్రమించి వరిసాగును చేపట్టారు. వందేళ్ల క్రితం పంటపొలాలకు సాగునీరు వెళ్లేందుకు వంద లింకుల వెడల్పుతో అధికారులు వాగును ఏర్పాటు చేశారు. ఈ వాగు కింద సుమారు వందెకరాల ఆయకట్టు ఉంది. ఇటీవల కొంతమంది రైతులు చెరువు కళింగు నుంచి వాగును పొలాల్లో కలిపి వేసుకొని వరిపంటను సాగు చేస్తున్నారు. దీంతో చివరి పొలాలకు నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లోకి వెళ్లేందుకు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. వంద లింకుల విస్తీర్ణంలో ఉన్న వాగును అడుగుకు పరిమితం చేయడంతో చెరువు నీరు ప్రవహించే వీలు లేకుండా పోయింది. వాగును ఆక్రమించడంతో పొలంలోకి వెళ్లేందుకు దారి కూడా లేదని రైతు షేక్ హుస్సేన్ తెలిపారు. ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న వాగును కొందరు కావాలనే అడ్డగోలుగా ఆక్రమించి మిగతా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయాడు. ఇప్పటికైనా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన వాగును పునరుద్ధరించడంతోపాటు దారిని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.


వాగులో సాగుచేసిన వరిపంట


స్క్రబ్ టైఫస్ వ్యాధిపై సూచనలు ఇస్తున్న స్టేట్ మెడికల్ కౌన్సిల్ టీమ్

మెడికల్ టీమ్ పర్యటన

కంచికచర్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్క్రబ్‌టైఫస్ వెలుగు చూడటంతో స్టేట్ మెడికల్ కౌన్సిల్ టీమ్ సోమవారం కంచికచర్లలో పర్యటించారు. స్క్రబ్ టైఫస్ వ్యాధి సోకి కంచికచర్ల ఇందిరా కాలనీకి చెందిన ఒక మహిళ విజయవాడలో చికిత్స పొందుతున్న విషయం విదితమే. ఈ సందర్భంగా కంచికచర్ల గ్రామపంచాయతీ, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తమై ఈ కాలనీలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా స్క్రబ్ టైఫస్ వ్యాధిని నిర్ధారించి తగు సూచనలు సలహాలిచ్చేందుకు స్టేట్ మెడికల్ కౌన్సిల్ టీంకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ నిహారిక పట్టణానికి విచ్చేసి సూచనలు సలహాలు అందజేశారు. స్టేట్ మెడికల్ కౌన్సిల్ టీం తో పాటు సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వసుంధర, ఎంపీడీవో డీ వెంకటేశ్వరరావు, సర్పంచ్ వేల్పుల సునీత, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్ ఇండియా వాలీబాల్ పోటీలకు కేయూ విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత వాలీబాల్ పోటీలకు కృష్ణా విశ్వవిద్యాలయం విద్యార్థి జీ మహేష్ బాబు ఎంపికయ్యాడు. కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న మహేష్‌బాబును సోమవారం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ విజయకుమారి, వ్యాయామ ఉపాధ్యాయుడు పరుచూరి గోపీ అభినందించారు.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల సందడి

● ప్రిఫరెన్షియల్ విధానంలో ఓటింగ్ పద్ధతి

విజయవాడ లీగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లాలో రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల సందడి ప్రారంభమైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగబోయే ఎన్నికలకు ఇప్పుడే కోలాహలం మొదలైంది. ఈ ఎన్నికల్లో 25 మంది అభ్యర్థులను రాష్ట్రంలోని 152 బార్ అసోసియేషన్‌లకు చెందిన న్యాయవాదులు ఎన్నుకోవాలి. ప్రిఫరెన్షియల్ ఓటింగ్ విధానం ద్వారా అభ్యర్థిని ఎన్నుకుంటారు. రాష్ట్రం మొత్తం మీద దాదాపు 38 నుంచి 42వేల మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఓటు వేసే విధానం ఎలాగంటే పోలింగ్ అధికారి ఇచ్చిన పెన్నుతో ఇంగ్లీషు (అక్షరాలలో)లో తప్పులు లేకుండా ప్రాధాన్యతా క్రమంలో వారి పేరు ఎదురుగా ఉన్న బాక్సులో నెంబరును రాయాల్సి ఉంటుంది. టిక్, రౌండప్, సంతకం, వేలిముద్ర, ఎక్స్ మార్క్, పేర్లు, గీతలు, చుక్కలు రాయొద్దు. బ్యాలెట్ పేపరుపై ఏమైనా రాసినట్లు గుర్తిస్తే ఓటును తిరస్కరిస్తారు.

ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ చోరీ



వీరులపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దొడ్డదేవరపాడు గ్రామంలోని బీసీ ఏరియాలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం అర్ధరాత్రి ఒక వ్యక్తి ప్రవేశించి స్వామి వారి హుండీని తస్కరించినట్టు పోలీసులు తెలిపారు. హుండీని పొలాల్లోకి తీసుకు వెళ్లి పగుల కొట్టి నగదును తీసుకొని పారిపోయాడు. పోలీసులు ఆలయానికి చేరుకొని సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎన్‌ఎంల సమస్యలపై రెండు రోజుల రిలే దీక్షలు ప్రారంభం

ధర్నాచౌక్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ సెకండ్ ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ గవర్నమెంట్ కాంట్రాక్టు 2వ ఏఎన్‌ఎం యూనియన్ ఆధ్వర్యంలో రెండు రోజుల రిలే దీక్షలు స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సుమారు 20 ఏళ్లుగా వైద్య, ఆరోగ్యశాఖలో రాష్ట్రవ్యాప్తంగా ఏఎన్‌ఎంలు సేవలందిస్తున్నారన్నారు. అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న వీరిని సుదూర ప్రాంతాలకు బదిలీలు చేయడం వల్ల ఆర్థికం గా, మానసికంగా మూడేళ్ల నుంచి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మా నవతాదృక్పథంతో వారి ప్రాంతాలకు తిరిగి పంపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే యాప్‌ల భారం, ఒత్తిడి తగ్గించాలన్నారు. గతంలో మాదిరిగా యూనిఫాం, యూనిఫాం అలవెన్స్ చెల్లించాలని, జీవో 60 ప్ర కారం రూ.27వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ చైర్మన్ డీ దయామణి, సీఐటీయూ నేత ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం స్వాతి, కే రవీనాజ్యోతి, కోశాధికారి ఎం నారాయణమ్మ పాల్గొన్నారు.

లారీలోని సిలిండర్ నుంచి గ్యాస్ లీక్

● లారీ నిండా నిండు బండలు ● భయాందోళనలో ప్రజలు, వాహన చోదకులు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొండపల్లి ఎర్ర బిడ్జ్ కింద ఏపీహెచ్ఎమ్ఈఎల్ రోడ్డు సమీపంలో ఇబ్రహీంపట్నం - చత్తీస్‌గఢ్ 30వ జాతీయ రహదారి పక్కనే నిలిపి ఉన్న ఓ గ్యాస్ సిలిండర్ల లారీలో ఉన్న ఓ గ్యాస్ సిలిండర్ నుంచి సోమవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో గ్యాస్ లీకయింది. కొండపల్లి ఐడీఏలోని ఇండెన్ గ్యాస్ కంపెనీ నుంచి గ్యాస్ సిలిండర్లను లోడు చేసుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన లారీని డ్రైవర్ ఎన్‌హెచ్ పక్కన ఆపి భోజనం తెచ్చుకోవడానికి వెళ్లాడు. ఈ సమయంలో లారీలోని నిండు సిలిండర్లలోని ఒక సిలిండర్ భారీగా గ్యాస్ లీక్ కావడంతో సమీపంలోని గృహస్థులు, వాహన చోదకులు గుర్తించి విషయాన్ని పోలీసులకు తెలిపారు. దీంతో వారు అక్కడికి వచ్చి ఆ గ్యాస్


లారీలోని సిలెండర్ నుంచి లీకవుతున్న గ్యాస్

బండను కిందకు దింపి స్టేషన్‌కు తరలించారు.

హస్తకళలు, కళాకారులకు

ప్రభుత్వ ప్రోత్సాహం

● ఏపీహెచ్‌డీసీ చైర్మన్ హరిప్రసాద్
● 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా జాతీయ హస్తకళా వారోత్సవాలు



గాంధీనగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హస్తకళలు, కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఇందులో భాగంగా ఈ నెల 8 నుంచి 14 వరకు జాతీయ హస్తకళా వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్టు రాష్ట్ర హస్తకళ అభివృద్ధి సంస్థ (ఏపీహెచ్‌డీసీ) చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. గాంధీనగర్‌లోని లేపాక్షి ఎంపోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెల 10న కడప జిల్లా గురుశిష్య హస్త్‌శిల్ప్ ప్రశిక్షణ్ ప్రోగ్రామ్ ద్వారా 30మంది ఇత్తడి, కంచులోహపు హస్తకళాకారులకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 12న పల్నాడు జిల్లా దుర్గిలో 30 మంది కళాకారులకు డిజైన్ అభివృద్ధి వర్క్‌షాప్, 13న తిరుపతి జిల్లా మాదవమాల, శ్రీకాళహస్తిలో కలపచెక్క కళాకారులకు 14న అనకాపల్లి జిల్లా కేడీ పేటలో 50 మంది, 15 నుంచి 21 వరకు రాజమహేంద్రవరంలో 40 మంది కళాకారులకు ఏడు రోజుల గాంధీ శిల్ప్ బజార్, 17న నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 50 మంది శిల్పి కళాకారులకు టూల్‌కిట్ల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 2023-24కు సంబంధించి హస్తకళా అవార్డుల ప్రదానోత్సవం డిసెంబర్ 9న న్యూఢిల్లీలో జరుగుతుందన్నారు. రాష్ట్రం నుంచి ముగ్గురు కళాకారులు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకోవడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ప్రధానీ మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి ఎస్ సవిత, చేనేత హస్తకళల గౌరవ సలహాదారు సుచిత్రా ఎల్లా రాష్ట్రంలో హస్తకళాభివృద్ధికి, కళాకారుల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నారన్నారు. కళాకారులకు అవసరమైన చెక్కను అందుబాటులో ఉంచేందుకు ఉడ్ బ్యాంకును అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు చెప్పారు. సంస్థ వీసీ అండ్ ఎండీ ఎం విశ్వ, లేపాక్షి ఓఎస్‌డీ ఐవీ లక్ష్మీనాథ్, ఎంపోరియం మేనేజర్ ఎం సురేష్ పాల్గొన్నారు.

నేడు ఎస్‌ఎంవీటీ బెంగళూరు - విశాఖ ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల అదనపు రద్దీని పరిష్కరించేందుకు ఈనెల 8, 9న ఎస్‌ఎంవీటీ బెంగళూరు - విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైలును నడుపుతున్నారు. 08501 నెంబరు గల రైలు విశాఖపట్నంలో సోమవారం మధ్యాహ్నం 3.20కు బయలుదేరి మంగళవారం మధ్యాహ్నం 12.45కు బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైలు తిరుగు ప్రయాణంలో మంగళవారం 3.50కు బెంగళూరులో బయలుదేరి బుధవారం తెల్లవారుజామున 5.30కి విజయవాడ చేరుకుంటుంది. విశాఖపట్నానికి మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకుంటుంది. కృష్ణరాజపురం, బంగారాపేట, జోలార్‌పేట, కడప, రేణుగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లలో ఆగుతుంది.

యూజీడీ బ్లాక్స్... రోడ్లపైకి మురుగు

● మొగల్రాజపురంలో తరచూ మురుగునీటి సమస్యలు ● క్రాస్‌రోడ్డు, మధు గార్డెన్స్ ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ నుంచి రోడ్లపైకి
● తటాకాలుగా యూజీడీ ● దుర్గంధంతో విలవిల్లాడుతున్న స్థానికులు ● శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయాలి

విజయవాడ తూర్పు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూగర్భ మురుగునీటి (యూజీడీ) నిర్వహణలో లోపాలు మొగల్రాజపురం ప్రాంతానికి శాపంగా మారుతున్నాయి. యూజీడీ పైపులైన్లు ఎక్కడికక్కడ పూడుకుపోవడంతో మురుగునీరు ముందుకు పారడం లేదు. దీంతో మురుగునీరు మ్యాన్‌హోల్స్ నుంచి ఎగదన్నుతోంది. ఈ మురుగు కాస్త పెద్ద ఎత్తున రోడ్లపైకి చేరుతోంది. యూజీడీ కావడంతో మలమూత్రాదుల వంటి వ్యర్థాలన్నీ బయటకు రావడంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. తరచూ మొగల్రాజపురం ప్రాంత వాసులు యూజీడీ సమస్యలపై కార్పొరేషన్ డ్రైనేజీ విభాగ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టడం లేదు. యూజీడీ పైపులైన్లలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, శానిటరీ నాప్‌కిన్స్, సిల్ట్ వంటి వి అరకొరగా తొలగిస్తున్నారు. దీంతో పలుచోట్ల యూజీడీలో వ్యర్థాలు పేరుకుపోయి ప్రవాహానికి అడ్డుపడుతున్నాయి. ఫలితంగా మ్యాన్‌హోల్స్ నుంచి మురుగునీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది. రెండు రోజులుగా మొగల్రాజపురంలోని క్రాస్‌రోడ్ సమీపంలోని ప్రాంతాలు, మధుగార్డెన్స్ అభిముఖంగా ఉన్న ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ పెద్దఎత్తున లీకవుతున్నాయి. దీంతో రోడ్లు కాస్త మురుగునీటి తటాకాలుగా మారుతున్నాయి. ఈ ప్రాంతాల్లో కాలువలు పూడిక పోయి మురుగునీరంతా రోడ్డుపైకి చేరుతోంది. డ్రైనేజీలు పొంగి రోడ్లపైకి నీరు పారడంతో ఇటువైపుగా ప్రయాణించడానికి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరంతా రోడ్డుపైకి చేరి ఈ ప్రాంతమంతా అధ్వాన్నంగా తయారవుతోంది. డ్రైనేజీలు పొంగి మూతలపై నుంచి నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ఈ ప్రాంతమంతా అధ్వాన్నంగా తయారవడంతో పాటు తీవ్రమైన దుర్వాసన వస్తోంది. దీంతో పాటు 5వ నెంబరు రోడ్డు వెంబడి సైడ్ డ్రైయిన్స్ పరిస్థితి కూడా ఏమీ బాగాలేదు. సైడ్ డ్రైయిన్స్ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వర్షంపడితే ఈ మురుగంతా కూడా 5వ నెంబర్ రోడ్డుపైకి చేరుతుంది. సైడ్ కాలువల్లోని మురుగు దిగువకు తేలిగ్గా పారే అవకాశం లేదు. అడుగడునా ప్రతిబంధకాలు ఉన్నాయి.


రోడ్లపైకి చేరుకున్న మురుగునీరు

ఖో-ఖో అసోసియేషన్

రాష్ట్ర అధ్యక్షుడిగా మడకా



గుడివాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఖో-ఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గుడివాడకు చెందిన అంతర్జాతీయ ఖో- ఖో రిఫరీ మడకా ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 7న ఏలూరులో రాష్ట్ర ఖో-ఖో అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మడకాను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ పాఠశాల డైరెక్టర్ కే అవినాష్, ఖో-ఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్ అభినందించారు.

అర్జీల సత్వర పరిష్కారంపై దృష్టి సారించండి

● ఇన్‌చార్జి కలెక్టర్ ఇలక్కియా

కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి 162 అర్జీలు అందాయని ఇన్‌చార్జి కలెక్టర్ ఇలక్కియా చెప్పారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో జాప్యం వుండరాదన్నారు. అర్జీదారుకు సత్వర, సంతృప్తికర పరిష్కారం లభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎం.లక్ష్మీనరసింహం, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జ్యోతి, అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇదీ విషయం

కాపడం పెడుతున్నారా?

వేడి కాపడం, చల్లని కాపడం..
దేన్ని ఎప్పుడు అనుసరించాలో తెలుసుకుందామా...

చల్ల కాపడం..
- తీవ్రమైన నొప్పి
- క్రీడా గాయాలు
- వాపు
- ఇన్‌ఫ్లమేషన్

వేడి కాపడం
- దీర్ఘకాలిక నొప్పి
- నెలసరి నొప్పులు
- బిగుసుకుపోవడం
- కండరాల నొప్పులు



హార్ట్ హెల్త్

గుండెకు తక్షణ రక్షణ

గుండెపోటు తర్వాతి తొలి గంటను గోల్డెన్ అవర్‌గా పరిగణిస్తూ ఉంటారు. ఈ తొలి గంటలోనే అప్రమత్తంగా వ్యవహరించి అవసరమైన మందులతో గుండెకు జరిగే నష్టాన్ని నివారించాలంటున్నారు వైద్యులు. ఆ మందులు ఏవంటే...

గుండెపోటు వచ్చిన రోగిని ఆస్పత్రికి తరలించేలోపే సమయం మించి పోవచ్చు. వైద్య సహాయం అందించేలోపే గుండెకు జరగవలసిన నష్టం జరిగిపోవచ్చు. ఈ నష్టాన్ని నివారించడం కోసం డిస్ప్రిన్, క్లోపిడోగ్రెల్, అటోర్‌వాస్టాటిన్ అనే మూడు మందులను అత్యవసరంగా వాడుకోవాలంటూ, పంజాబ్ మెమోరియల్ హాస్పిటల్ వైద్యులు, డాక్టర్ అమన్‌దీప్ అగర్వాల్ సూచిస్తున్నారు. ఈ మూడు మందులూ గుండె నష్టాన్ని నివారించడంలో మూడు భిన్నమైన పాత్రలను పోషిస్తాయనీ, ప్రత్యేకించి ఆస్పత్రిలో చికిత్స అందేలోగా గుండెకు రక్షణగా తోడ్పడతాయనీ అంటున్నారాయన. రక్తాన్ని పలుచన చేసే డిస్ప్రిన్ 325 ఎమ్‌జి, యాంటీప్లేట్‌లెట్‌గా పని చేసే క్లోపిడోగ్రెల్ 75 ఎమ్‌జి, ప్లేక్‌ను స్థిరీకరించి, పరిస్థితి విషమంగా మారకుండా నివారించే అటోర్‌వాస్టాటిన్ 40 ఎమ్‌జి వాడుకోవాలని సూచిస్తున్నారు.



ఎప్పుడు, ఎలా?

తీవ్రమైన ఛాతీ నొప్పి, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, చమటలు పట్టడం, తల తిరగడం, వాంతులు, కళ్లు తిరగడం, స్పృహ కోల్పోవడం.. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే ఈ మూడు మందులూ వాడుకోవాలి. ఇలా గుండెపోటుకు గురైన వెంటనే డిస్ప్రిన్ వాడుకోవడం వల్ల, అక్యూట్ మయోకార్డియల్ ఇన్‌ఫార్‌క్షన్ ముప్పు తప్పుతుందని సంప్రదాయ అధ్యయనాల్లో కూడా వెల్లడైంది. ఇస్కేమిక్ వాస్క్యులర్ సమస్యను నివారించడానికి క్లోపిడోగ్రెల్ తోడ్పడుతుంది. అలాగే డిస్ప్రిన్‌ను మింగకుండా నమలడం వల్ల త్వరగా శోషణ జరిగి, యాంటీప్లేట్‌లెట్ ప్రభావం రెట్టింపు అవుతుందని కూడా అధ్యయనాల్లో వెల్లడైంది.

మీకు తెలుసా?

ఉపవాసం నీరసం కాదు

చాలామంది ఒక్క పూట ఆహారం తీసుకోకపోతే నీరసించిపోతారు. నిజానికి సమయానికి ఆహారం తీసుకోకపోయినా శక్తి సన్నగిల్లిపోదు. తిన్న ఏ ఆహారమైనా వెంటనే మనకు శక్తినివ్వదు. అది అరిగి గ్లూకోజ్‌గా మారటానికి నాలుగు గంటల సమయం పడుతుంది. ఈ గ్లూకోజ్ శక్తి రూపంలో కాలేయం, కండరాలు, శరీరంలోని ఇతర భాగాల్లో నిల్వ ఉంటుంది. ఉపవాస సమయంలో ఇలా నిల్వ ఉన్న శక్తినే శరీరం ఉపయోగించుకుంటుంది. కాబట్టి ఒక పూట ఆహారం మానేసినంత మాత్రాన శక్తి తగ్గిపోతుందేమోననే భయం అవసరం లేదు.

ఉపవాస సమయంలో ఛాతీలో మంట, మలబద్ధకం, తలనొప్పి లాంటి సమస్యలు తలెత్తవచ్చు. ఈ లక్షణాలు సహజం. వీటిని నివారించాలంటే..



- రోజు మొత్తంలో కనీసం రెండు నుంచి మూడు లీటర్ల నీరు తాగాలి.
- పెప్టిక్ అల్సర్లు, డయాబెటిస్ ఉన్నవాళ్లు పళ్లు, కూరగాయ ముక్కలు తినాలి.
- గర్భవతులు, పాలిస్తున్న తల్లులు, గుండె జబ్బులున్నవాళ్లు ఉపవాసం చేయకపోవటమే మంచిది.
- శారీరక బలహీనత కలిగినవారు, మందుల మీద ఆధారపడిన మధుమేహులు, ఆహారానికి సంబంధించిన సమస్యలున్నవారు (ఈటింగ్ డిజార్డర్) ఉపవాసానికి ముందు వైద్యుల సలహా తీసుకోవాలి.
- ఉపవాస సమయంలో ఎక్కువ నూనె, నెయ్యిలతో తయారుచేసిన పదార్థాలు, తీపి వంటకాలకు దూరంగా ఉండాలి.

డయాబెటిక్ ఫుట్ అల్సర్



పెరిగే చక్కెర మోతాదు, దాంతో ఒరిగే పర్యవసానాల గురించి అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. మరీ ముఖ్యంగా మధుమేహం మూలంగా తలెత్తే పాదాల్లో పుండ్ల సమస్య ప్రబలమవుతోంది. కాబట్టి దీనికి ప్రారంభంలోనే చెక్ పెట్టాలంటున్నారు వైద్యులు. మరిన్ని వివరాలు తెలుసుకుందాం!

పాదాల్లో నిశ్శబ్ద పుండ్లు

భారతదేశంలో మధుమేహుల సంఖ్య 21 కోట్లు మించిపోయింది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నలుగురిలో ఒకరు వాళ్ల జీవితకాలంలో డయాబెటిక్ ఫుట్ అల్సర్ బారిన పడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి 20 సెకన్లకు ఒకటి చొప్పున, 85 శాతం మధుమేహ సంబంధిత అవయవ విచ్ఛేదనలు జరుగుతున్నాయి. అయితే ఈ విచ్ఛేదనలన్నీ నివారించే వీలున్న, నొప్పి లేని ఒక చిన్న పుండు నుంచే మొదలవుతూ ఉండడం శోచనీయం. మధుమేహంతో కళ్లు, మూత్ర పిండాలు, గుండె, రక్తనాళాలు దెబ్బతినడం వల్ల, కంటిచూపు కోల్పోవడం, మూత్రపిండాలు విఫలమవడం, గుండెజబ్బుల ముప్పు పొంచి ఉంటుందని మనందరికీ తెలుసు. కానీ వీటన్నిటి కంటే ముందే మధుమేహంతో మన పాదాలు నిశ్శబ్దంగా దెబ్బతినడం మొదలుపెడతాయి. లక్షణాలు బయల్పడడానికి ఎంతో ముందు నుంచే మధుమేహం పాదాలను ప్రభావితం చేస్తూ ఉంటుంది. నాడులు దెబ్బతినడం, బలహీనమైన రక్తప్రసరణ, ఎముకలు, కీళ్లలో ప్రగతిశీల మార్పులే ఇందుకు ప్రధాన కారణాలు.

ప్రమాద కారకాలు ఇవే

నాడులు దెబ్బతినడం: అధిక చక్కెర మోతాదులు క్రమేపీ పాదాల్లోని నాడులను దెబ్బతీస్తాయి. దాంతో పాదాల్లో స్పర్శ క్షీణించి, నొప్పినీ, వేడినీ, దెబ్బలనూ గ్రహించలేని పరిస్థితి తలెత్తుతుంది. బూట్ల లోపలకు చేరుకున్న రాళ్లు, బిగుతైన చెప్పుల పట్టీలు లేదా చిన్నపాటి పుండ్లు లాంటి మన దృష్టికి రాని సమస్యలు, అంతిమంగా పాదాల్లో లోతైన గాయాలకు దారితీ



స్తాయి. తగ్గిపోయిన చమట వల్ల చర్మం పొడిబారి, పగిలిపోయి ఇన్‌ఫెక్షన్ల చొరబాటుకు అనువుగా మారుతుంది. స్పర్శ రక్షణ కొరవడడం కారణంగా అత్యంత ముప్పుతో కూడిన న్యూరోపతిక్ ఫుట్‌కు బీజాలు పడతాయి

రక్తప్రసరణ లోపం: పాదాలకూ, కాళ్లకూ రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలను కూడా మధుమేహం ప్రభావితం చేస్తుంది. రక్తనాళాలు ఇరుకుగా మారి, కణజాలాలకు తక్కువ ఆక్సిజన్, తక్కువ పోషకాలు అందుతూ ఉంటాయి. దాంతో చిన్నపాటి గాయాలు మానడానికి కూడా కొన్ని వారాల సమయం పడుతూ ఉంటుంది. ఈ పెరిఫెరల్ ఆర్టెరీ డిసీజ్ తీవ్రమైన సందర్భాల్లో పాదాలు లేదా వేళ్లు నలుపుగా మారి, కుళ్లిపోయి, అంతిమంగా అత్యవసర విచ్ఛేదనం అవసరమవుతుంది

ఎముకలు, కీళ్ల సమస్యలు: నాడులు, రక్తనాళాలతో పాటు ఎముకలు, కీళ్లు కూడా దెబ్బతింటాయి. అయితే సాధారణంగా ఈ సమస్యను ఎవరూ పెద్దగా పట్టించుకోరు. కానీ డయాబెటిక్ ఫుట్ అల్సర్లలో ఎముకల, కీళ్ల ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తుంది. దీర్ఘకాలిక మధుమేహం పాదాల్లోని ఎముకలను బలహీనపరిచి, కండరాలు, కీళ్ల సున్నితమైన సంతులనాన్ని దెబ్బతీస్తుంది. దాంతో కండరాలు క్షీణించి పాదాల్లోని కొన్ని ప్రాంతాలు అసాధారణ ఒత్తిడికి లోనై, హ్యామర్ టోస్, క్లా టోస్ అనే వైకల్యాలకు దారి తీస్తుంది. ఈ సమస్యలో కాలి వేళ్ల కీళ్లు వంపు తిరుగుతాయి లేదా అసాధారణంగా వంగిపోతాయి. దీనికి తోడు బొటన వేలి అడుగు భాగం మీద అధిక ఒత్తిడి పడుతుంది. పాదాలకు ఆసరా అందించే నిర్మాణాలు బలహీనపడడం వల్ల, పాదం వంపు కోల్పోయి, చదునుగా మారుతుంది. ఈ మార్పులన్నీ పాదాలకే పరిమితమైనప్పటికీ, వీటి ఫలితంగా నడక మారుతుంది. సున్నితమైన వేళ్లు అదే పనిగా ఒత్తిడికి లోనవుతూ ఉంటాయి. ఈ ప్రాంతమంతా మొద్దుబారి ఉండడం వల్ల చర్మం చిట్లి, క్రమేపీ అల్సర్లు ఏర్పడతాయి. ఎముకలు, కీళ్ల నష్టం తీవ్రమైనప్పుడు, చార్కోట్ న్యూరోఆర్థ్రోపతీ అనే సమస్య తలెత్తుతుంది. స్పర్శ కోల్పోవడం మూలంగా సూక్ష్మ ప్రాక్చర్లను గుర్తించలేక, అలాగే నడుస్తూ ఉండిపోవడంతో, అంతిమంగా ఎముకలు ఒరిపిడికి లోనై, కీళ్లు పట్టుతప్పుతాయి. పాదం కంది పోయి, వాచిపోయి, తిరగదిప్పిన కమానులా వంపు తిరుగుతుంది. ఈ అవయవలోపాలు కూడా అల్సర్లకు దారితీస్తాయి. ప్రారంభంలోనే కనిపెట్టి చికిత్స అందించకపోతే, విచ్ఛేదనానికి దారితీసే అవకాశాలు పెరుగుతాయి

నిశ్శబ్దంగా పాదాల్లో పుండ్లు

నాడులు దెబ్బతినడం, రక్తప్రసరణ క్షీణించడం, ఎముకల్లో సమస్యలు, దీర్ఘకాలిక ఒత్తిడి మూలంగా



చర్మం చిట్లడం మొదలైన సమస్యల మిశ్రమ ప్రభావం మూలంగా పాదాల్లో పుండ్లు (డయాబెటిక్ ఫుట్ అల్సర్) ఏర్పడతాయి. కొత్త బూట్లు లేదా చెప్పుల ఒరిపిడికి చర్మం గాయపడడం, చర్మం పొడిబారి చిట్లడం, బొటనవేలు లేదా అరికాళ్లలో చర్మం గట్టిపడడం.. ఇలాంటి స్వల్ప సమస్యలే అంతిమంగా అల్సర్‌కు దారి తీస్తాయి. అయితే నాడులు దెబ్బతినడం వల్ల స్పర్శ లోపించి, నొప్పి తెలియకపోవడం వల్ల, అదే పనిగా నడుస్తూ ఉండిపోతారు. దాంతో గాయం కణజాలం లోపలకు విస్తరిస్తుంది. చర్మం చిట్లి ఇన్‌ఫెక్షన్ సోకినా, రక్తప్రసరణ మందగిస్తుంది కాబట్టి శరీర రక్షణ వ్యవస్థ ఆ గాయాన్ని మాన్పలేదు. ఆ విధంగా చిన్నపాటి పుండు తీవ్రమై, కండరాలు, టెండాన్లు బహిర్గతమవుతాయి. చికిత్స ఆలస్యమైతే, ఈ పరిస్థితి మరింత తీవ్రమై, ఆస్టియోమైలైటిస్‌కు దారితీస్తుంది. ఈ దశలో పాదం వాచి, దుర్వాసనతో కూడిన స్రావాలు వెలువడతాయి. కణజాలం చనిపోవడం వల్ల ఆ ప్రదేశం నల్లగా మారిపోతుంది. ఎక్కువమంది మధుమేహుల్లో ఈ పురోగతి నొప్పి లేకుండా, నిశ్శబ్దంగా కొనసాగి, అంతిమంగా అవయవ విచ్ఛేదానికి దారితీస్తుంది.

నివారణ ముఖ్యం

అధిక శాతం మధుమేహ పాద పుండ్లు నివారించదగినవే! అందుకోసం కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే...

పాదాన్ని గమనిస్తూ ఉండాలి: కోతలు, పగుళ్లు, వాపులు, రంగు మార్పుల కోసం ప్రతి రోజూ పాదాలను పరీక్షించుకుంటూ ఉండాలి

చెప్పులు: ఎటువంటి పరిస్థితుల్లోనే చెప్పులు లేకుండా నడవకూడదు. ఇంట్లో కూడా చెప్పులు వేసుకోవాలి. మెత్తగా, కుషన్‌ను కలిగి ఉండే, పాదాలను చక్కగా పట్టి ఉంచే చెప్పులు వేసుకోవాలి. పాదాల్లో లోపాలుంటే కస్టమ్ డయాబెటిక్ షూస్ వేసుకోవాలి

పాదాలు భద్రం: పాదాలు శుభ్రంగా, పొడిగా ఉండేలా చూసుకోవాలి. ప్రత్యేకించి కాలి వేళ్ల మధ్య పగుళ్లు ఏర్పడకుండా మాయిశ్చరైజర్ పూసుకోవాలి

చక్కెర అదుపు: మధుమేహం, రక్తపోటు, కొలెస్ట్రాల్ అదుపులో ఉంచుకోవాలి

ధూమపానం: ఈ అలవాటుతో కాళ్లకు రక్తప్రసరణ తగ్గుతుంది. కాబట్టి ధూమపానం మానుకోవాలి

పాద పరీక్ష: ఏడాదికోసారి వైద్యులను కలుస్తూ పాదాలను పరీక్ష చేయించుకుంటూ ఉండాలి

అల్సర్లు అత్యంత ప్రమాదకరం

మధుమేహుల్లో అల్సర్లు తిరగబెట్టే ముప్పు కూడా ఉంటుంది. పూర్తిగా నయమైపోయిన 40 నుంచి 50 శాతం అల్సర్లు ఏడాదిలోపే తిరగబెడుతూ ఉంటాయి. న్యూరోపతీ, రక్తప్రసరణ లోపం, అవయవ లోపం లాంటి సరిదిద్దని మూల కారణాల వల్లే అల్సర్లు తిరగబెడుతూ ఉంటాయి. ఇలా అల్సరు తిరగబెట్టిన ప్రతి సారీ ఇన్‌ఫెక్షన్ మరింత లోతుకు వ్యాపించడం, పాదం కుళ్లిపోవడం, విచ్ఛేదనం కూడా పెరుగుతూ ఉంటాయి. కాబట్టి మధుమేహులు, పాదాల్లో అల్సర్లు తలెత్తే వరకూ ఆగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించడం అత్యవసరం.

చికిత్సలు, నియంత్రణ ఇలా...

ఆధునిక మధుమేహ పాదాల నిర్వహణ, మూల కారణాలకు చికిత్సను అందించడం, వేగంగా గాయాన్ని మాన్పడం మీదే దృష్టి పెడుతుంది. అందుకోసం...

న్యూరోపతీ: నాడీ నొప్పిని తగ్గించి, బలహీనపడిన కండరాలను బలపరిచి, సంతులనాన్ని పెంచి, పాద భంగిమను సరిదిద్ది, అసాధారణ ప్రెషర్ పాయింట్లను తగ్గించడం ప్రధానంగా ఈ చికిత్స సాగుతుంది. అందులో భాగంగా ప్రత్యేకమైన డయాబెటిక్ ఫుట్‌వేర్, కస్టమ్ ఇన్‌సోల్స్, ఒత్తిడిని సమంగా విస్తరించే బూట్లు వాడుకోవాలి. పాదాల్లో లోపాలున్న వాళ్లు ఆ వైకల్యాన్ని సరిదిద్దే ఆర్థోటిక్స్‌ను వేసుకోవాలి.

పెరిఫెరల్ ఆర్టెరీ డిసీజ్: కాళ్లకు రక్తప్రసరణ తగ్గినప్పుడు, గాయాలు మానే వేగం బాగా తగ్గిపోతుంది. కాబట్టి రక్తప్రసరణను పునరుద్ధరించడం కోసం వైద్యులు, యాంజియోప్లాస్టీ, స్టెంటింగ్, బైపాస్ సర్జరీలను ఎంచుకుంటారు. యాంజియోప్లాస్టీలో బెలూన్ సహాయంతో రక్తనాళాన్ని వెడల్పు చేస్తారు. రక్తనాళం దీర్ఘకాలం పాటు విప్పారి ఉండడం కోసం దాన్లో స్టెంట్‌ను అమరుస్తారు. పలు అవరోధాలున్నప్పుడు, బైపాస్ సర్జరీని ఆశ్రయిస్తారు.

ఆఫ్‌లోడింగ్ చెప్పులు: సమస్య తొలి దశల్లో టోటల్ కాంటాక్ట్ కాస్టింగ్ లేదా ప్రత్యేకమైన ఆఫ్‌లోడింగ్ బూట్లను వైద్యులు సూచిస్తారు. వీటిని వాడుకోవడం వల్ల ఎముకల ప్రాక్చర్లు నయమై, పాదం మరింత దెబ్బతినకుండా ఉంటుంది.

సర్జరీ: అవకారం తీవ్రంగా ఉన్నప్పుడు పదే పదే అల్సర్లు రాకుండా నివారించడం కోసం పాదాన్ని సర్జరీతో సరిదిద్దుతారు.

ఇన్‌ఫెక్షన్ నియంత్రణ: మృత కణజాలాన్ని తొలగించినప్పుడు, పాదానికి తాజా రక్తం రవాణా అవుతుంది. దాంతో పుండ్లు త్వరగా మానతాయి

డాక్టర్ నరేంద్రనాథ్ మేడ
హెచ్ఒడి అండ్ సీనియర్ కన్సల్టెంట్ వాస్క్యులర్ అండ్ ఎండోవాస్క్యులర్ సర్జన్, పోడియాట్రిక్ సర్జన్, కిమ్స్ హాస్పిటల్, హైదరాబాద్



కాలేయ ఆరోగ్యం

కాలేయ సమస్య సిర్రోసిస్ అనగానే తిరిగి సరిదిద్దలేని సమస్య కాబట్టి చావు దగ్గరపడినట్టు భావిస్తారు. బ్రతికే అవకాశాలు లేవని నిర్ధారించుకుని చికిత్సకు దూరంగా ఉండిపోతూ ఉంటారు. కానీ మూల కారణాలను సరిదిద్దుకోగలిగితే, కొన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో సిర్రోసిస్‌ను సైతం రివర్స్ చేయొచ్చని వైద్యులు భరోసా ఇస్తున్నారు. అదెలాగో తెలుసుకుందాం!



సిర్రోసిస్ రివర్స్ సాధ్యమే!

హెపటైటిస్ బి, సి, అత్యధిక మద్యపానం, ఫ్యాటీ లివర్ డిసీజ్, ఆటోఇమ్యూన్ డిజర్డర్ల వల్ల కాలేయం దెబ్బతింటూ, ఫైబ్రోసిస్‌కూ, అంతిమంగా సిర్రోసిస్ దశకు చేరుకుంటుంది. అయితే కొన్ని దశాబ్దాలుగా సిర్రోసిస్‌ను తిరిగి సరిదిద్దలేని కాలేయ సమస్యగా పరిగణిస్తూ వచ్చారు. చివరి దశ వ్యాధికి అంతిమంగా కాలేయ మార్పిడి ఒక్కటే పరిష్కారమని నిర్ధారిస్తూ వచ్చారు. అయితే కాలేయ మార్పిడి అంతర్లీన ముప్పులు, సవాళ్లతో కూడుకున్న చికిత్స. కాలేయ మార్పిడి చికిత్సలో.. అవయవ దాన కొరతతో పాటు జీవితకాలం వ్యాధినిరోధకశక్తిని అణచి ఉంచే చికిత్సల అవసరం లాంటి ఇబ్బందులు తప్పవు. అయితే సరైన సమయంలో అప్రమత్తమై, సిర్రోసిస్‌కు మూల కారణాలను కనిపెట్టి వాటిని తగిన చికిత్సలతో సరిదిద్దుకోగలిగితే, సిర్రోసిస్ దశకు చేరుకున్న కాలేయాన్ని పూర్తి ఆరోగ్యకరంగా మార్చే అవకాశాలున్నాయని తాజా అధ్యయనాల్లో తేలింది.

కారణాలకే చికిత్సలు

కాలేయం జబ్బుపడి సిర్రోసిస్‌కు చేరుకోడానికి ప్రధాన కారణాలైన హెపటైటిస్ బి, సిలకు చికిత్సలున్నాయి. ఫ్యాటీ లివర్‌కు కూడా చికిత్సలున్నాయి. వీటిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోగలిగితే కాలేయం సిర్రోసిస్ దశకు చేరుకోకుండా ఉంటుంది. అలాగే కాలేయం దెబ్బతింటున్న సూచనలు కొన్ని పరీక్షల్లో ముందుగానే బయల్పడతాయి. ప్లేట్‌లెట్స్ తక్కువైపోవడం, కాలేయం సాధారణంగానే ఉన్నప్పటికీ ప్లీహం పరిమాణం పెరగడం లాంటి లక్షణాలు కనిపించినప్పుడు, ఫైబ్రోస్కాన్ చేయించుకుంటే, కాలేయ సమస్యను ముందుగానే పసిగట్టే వీలుంటుంది. ఈ దశలోనే అప్రమత్తమై చికిత్స తీసుకోగలిగితే కాలేయం సిర్రోసిస్‌కు చేరుకోకుండా నియంత్రించుకోవచ్చు. సిర్రోసిస్‌కు చేరుకున్నప్పటికీ తొలి దశలోనే కనిపెట్టవచ్చు.

వీళ్లు అప్రమత్తం

కొందరికి హెపటైటిస్ బి, సి, కాలేయ కొవ్వు సమస్యల ముప్పును ఎదుర్కొనే అవకాశాలు ఎక్కువ. వాళ్లెవరంటే..

- క్రమం తప్పకుండా మద్యం సేవించేవారు
- ఐదేళ్లకు మించి మధుమేహంతో బాధపడుతున్న వాళ్లు
- కామెర్ల బారిన పడినవాళ్లు
- సర్జరీ లేదా ఇతరత్రా కారణాలతో రక్తమార్పిడి చేయించుకున్నవాళ్లు

తుది దశల్లో...

సిర్రోసిస్ తుది దశల్లో సైతం వ్యాధిని అక్కడితో ఆపి, మరింత తీవ్రమవకుండా నియంత్రించుకోవచ్చు. ఇందుకు సమర్థమైన చికిత్సలున్నాయి. సిర్రోసిస్‌తో కాలేయం పూర్తిగా విఫలమైనప్పుడు కాలేయ మార్పిడిని అంతిమ చికిత్సగా వైద్యులు ఎంచుకుంటారు. అయితే కాలేయ మార్పిడికి ముందు, సిర్రోసిస్ తొలిదశలో వ్యాధి నిర్ధారణ అయిన వ్యక్తుల జీవితకాలం 9 నుంచి 12 సంవత్సరాలు. చివరి దశలో నిర్ధారణ అయిన రోగుల జీవితకాలం 3 నుంచి 4 సంవత్సరాలు. అయితే చివరి దశ సిర్రోసిస్‌కు చేరుకున్న రోగుల జీవితకాలాన్ని కూడా 9 నుంచి 12 సంవత్సరాలకు పెంచే చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. చికిత్సతో వ్యాధి పురోగతిని నియంత్రించి, ఉన్న దశకే పరిమితం చేసి, జీవన నాణ్యతను పెంచుకోగలిగితే కాలేయ మార్పిడి అవసరతను వాయిదా వేయగలిగే వీలుంటుంది.

సిర్రోసిస్ చికిత్స ఇలా...

వైద్యులు, మూల కారణాన్ని కనిపెట్టడమే కీలకంగా సిర్రోసిస్ చికిత్స మొదలుపెడతారు. అవేంటంటే..

- **రక్తనాళంలో అవరోధం:** శరీరం నుంచి గుండె రక్తాన్ని సరఫరా చేసే అతి పెద్ద రక్తనాళం కాలేయంలో ఉంటుంది. ఈ రక్తనాళంలో అవరోధం ఏర్పడినా కాలేయం సిర్రోసిస్‌కు దారితీస్తుంది. ఈ కారణంగా సిర్రోసిస్ తలెత్తినప్పుడు, అవరోధాన్ని తొలగించి స్టెంట్ సహాయంతో రక్తప్రవాహాన్ని పునరుద్ధరించగలిగితే సిర్రోసిస్ తగ్గుముఖం పడుతుందని రుజువైంది
- **సెకండరీ బిలేరీ సిర్రోసిస్:** పిత్తాశయంలో నుంచి బైల్‌డక్ట్ పేగుల్లోకి ప్రయాణిస్తుంది. దీనికి అవరోధం ఏర్పడితే, కాలేయ సిర్రోసిస్ తలెత్తుతుంది. ఈ అవరోధాన్ని తొలగించడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చు
- **ఫ్యాటీ లివర్ డిసీజ్:** కాలేయ కొవ్వు మూలంగా, సిర్రోసిస్ దశలోకి ప్రవేశించినప్పటికీ, తొలి దశలోనే గుర్తించి, తాజా మందులు, జీవనశైలి మార్పులతో సిర్రోసిస్‌ను రివర్స్ చేసుకోవచ్చు
- **హెపటైటిస్:** హెపటైటిస్ బిని తొలి దశలోనే కనిపెట్టి చికిత్సను అందించగలిగితే కాలేయం పూర్తిగా కోలుకుంటుంది

50% మందికే...

సిర్రోసిస్ దశకు చేరుకున్న ప్రతి ఒక్కర్లో ఈ రుగ్మత రివర్స్ అయ్యే అవకాశాలు ఉండవు. కేవలం 50% మంది రోగులు మాత్రమే నూరు శాతం కోలుకోగలుగుతారు. ఇలా కోలుకున్న 50 శాతం మందికీ కాలేయ మార్పిడి అవసరం ఉండదు. సిర్రోసిస్ దశ ఈ విషయంలో కీలకంగా మారుతుంది. ఇది ప్రగతిశీల వ్యాధి కాబట్టి వీలైనంత త్వరగా సిర్రోసిస్‌ను గుర్తించి చికిత్స మొదలుపెట్టడం అవసరం. చివరి దశలో సిర్రోసిస్‌ను గుర్తించి, ఎంతటి సమర్థమైన చికిత్సను అందించినప్పటికీ జబ్బు నయం అవకపోవచ్చు. కాబట్టి ప్రారంభంలోనే వ్యాధిని నిర్ధారించుకుని, తగినచికిత్స తీసుకోవాలి.

ఈ లక్షణాలు గమనించాలి

కాలేయ సిర్రోసిస్ కొన్ని లక్షణాల రూపంలో బయల్పడుతుంది. అవేంటంటే..

తొలి దశలో...
- సులభంగా, త్వరగా అలసిపోవడం
- కాళ్ల వాపులు. కాళ్లు ఎత్తులో ఉంచినప్పుడు వాపు తగ్గడం
- కుడి వైపు పొత్తికడుపులో నొప్పి

రెండో దశలో...
- మలం నలుపు రంగు
- కడుపులో నీరు చేరి కడుపుబ్బరం
- కాళ్ల వాపులు తగ్గకపోవడం

డాక్టర్ కె.ఎస్. సోమశేఖర రావు
సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్, క్లినికల్ డైరెక్టర్, యశోద హాస్పిటల్, హైటెక్ సిటీ, హైదరాబాద్.



ఆహారం ఆరోగ్యం

ఎముకలు ఇలా దృఢం

- **క్యాల్షియం:** క్యాల్షియం కలిగిన ఆహారాన్ని సరిపడా తీసుకోనప్పుడు ఎముకల సాంద్రత తగ్గుతుంది. చిన్న వయసులోనే ఎముక నష్టం జరిగి ఎముకలు విరిగే అవకాశాలు పెరుగుతాయి
- **అస్తవ్యస్త ఆహార వేళలు:** సమయానికి తినకపోవటం, తగినంత తినకపోవటం వల్ల కూడా శరీరం క్యాల్షియమ్‌ను తగినంతగా శోషించుకోలేదు.
- **టీ, కాఫీలు:** పాలు తాగే అలవాటు అందరిలో కొరవడుతోంది. టీ, కాఫీలు తాగుతున్నాం కాబట్టి పాలు తాగినట్టే అనుకుంటే పొరపాటు. టీ, కాఫీల్లో ఉండే ఫైటేట్స్ క్యాల్షియమ్‌ను శరీరం శోషించుకోనివ్వకుండా అడ్డుకుంటాయి. కాబట్టి పాలు తాగుతూ ఉండాలి



- **వ్యాయామం:** వ్యాయామం వల్ల ఎముకల పటుత్వం పెరుగుతుంది. బాల్యంలో, యుక్త వయసులో వ్యాయామాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి
- **మద్యపానం, ధూమపానం:** ఈ వ్యసనాల వల్ల ఎముకల్లోని క్యాల్షియం అవసరానికి మించి రక్తంలోకి విడుదలవుతూ శరీరం నుంచి బయటికి వెళ్లిపోతూ ఉంటుంది. ఫలితంగా ఎముకలు గుల్లబారతాయి
- **వయసు:** వయసు పైబడేకొద్దీ ఎముకలు పలుచనై, బలహీనపడతాయి
- **వంశపారంపర్యం:** తల్లితండ్రుల్లో ఎముకలు గుల్లబారే సమస్య ఉంటే పిల్లలకు వంశపారంపర్యంగా సంక్రమించే అవకాశం ఉంటుంది. కాబట్టి అప్రమత్తంగా నడుచుకోవాలి.

మెస్సీ మేనియా..

4 రోజుల్లో.. హైదరాబాద్‌కు



సుదీర్ఘ కాలం తర్వాత సాకర్ స్టార్ మెస్సీ భారత్ రానుండడంతో.. దేశాన్ని ఫుట్‌బాల్ ఫీవర్ ఆవహించింది. మూడు రోజుల పర్యటనలో భాగంగా నాలుగు ప్రముఖ నగరాల్లో అర్జెంటీనా దిగ్గజం ఫ్యాన్స్‌కు కనువిందు చేయనున్నాడు. ముఖ్యంగా గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ ఆటగాడి టూర్‌లో ఈసారి హైదరాబాద్ భాగం కావడంతో భాగ్యనగరంలో ముందుగానే సందడి వాతావరణం నెలకొంది.

అర్జెంటీనా సాకర్ స్టార్ లియోనెల్ మెస్సీ భారత పర్యటనకు రానుండడంతో సాకర్ ఫ్యాన్స్ జోష్ పెరిగింది. ఎప్పుడెప్పుడు తమ ఆరాధ్య ఆటగాడిని చూస్తామా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. మూడు రోజుల టూర్‌లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి కోల్‌కతాకు చేరుకోనున్నాడు. శనివారం ఉదయం కోల్‌కతాలో జరిగే కార్యక్రమం తర్వాత.. సాయంత్రం ఉప్పల్‌లో జరిగే ఫ్రెండ్లీ మ్యాచ్‌కు లియోనెల్ హాజరుకానున్నాడు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా మెస్సీతో కలసి ఫుట్‌బాల్ ఆడనుండడంతో ఒక్కసారిగా హైప్ పెరిగింది. హైదరాబాద్ తర్వాత ముంబై, ఢిల్లీలకు మెస్సీ వెళ్లనున్నాడు.



2011లో..

అప్పుడలా..

మెస్సీ భారత్‌లో పర్యటించడం ఇది రెండో సారి. 2011లో కోల్‌కతాలో వెనిజులాతో జరిగిన అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లో మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా జట్టు పాల్గొంది. ఈ పోరులో అర్జెంటీనా 1-0తో వెనిజులాపై గెలిచింది. సాల్ట్‌లేక్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు 70వేల మంది తరలివచ్చారు.

షారుక్, గంగూలీలతో..

మెస్సీ పర్యటన కోల్‌కతా నుంచి ఆరంభం కానుంది. ఉదయం 10.30 నుంచి సుమారు మూడు గంటలు మెస్సీ ఇక్కడ ఉండనున్నాడు. మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ, బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్ సాల్ట్‌లేక్ స్టేడియంలో మెస్సీతో కలసి వేదికను పంచుకోనున్నారు. ఇక్కడ చిన్నారులతో మెస్సీ ఫుట్‌బాల్ ప్రాక్టీస్‌లోనూ పాల్గొననున్నాడు.

మెగా టోర్నీ ముంగిట..

రాత్రి 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



గిల్, అభిషేక్ శర్మ

నేటి నుంచి ఐదు టీ20ల సిరీస్ ● గిల్, హార్దిక్‌ల రాకతో బలంగా భారత్

- కెప్టెన్ సూర్య ఫామ్‌పై ఆందోళన
- ఒత్తిడిలో దక్షిణాఫ్రికా

కటక్: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో టీ20 వరల్డ్‌కప్‌నకు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. అంతకంటే ముందు మనోళ్లు ఆడే మ్యాచ్‌లు పది మాత్రమే. ఇందులో భాగంగా నేటి నుంచి దక్షిణాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనుండగా, మిగతా ఐదు మ్యాచ్‌లను న్యూజిలాండ్‌తో ఆడనుంది. దీంతో టీమిండియా తాజా సిరీస్‌ను మెగా టోర్నీకి సన్నాహకంగా ఉపయోగించుకోవాలనుకుంటోంది. అంతేకాకుండా విశ్వకప్ కోసం చక్కటి కోర్ గ్రూప్‌ను తయారు చేసుకునే ఆలోచనలో కోచ్ గంభీర్ ఉన్నాడు. ఏ స్థానంలో ఎవరు ఆడాలి? కాంబినేషన్ ఎలా ఉండాలనేది ఈ సిరీస్ ద్వారా తెలుసుకోవాలనుకుంటున్నాడు. పొట్టి ఫార్మాట్‌లో భారత ప్రదర్శన అద్భుతంగా ఉంది. గతేడాది టీ20 వరల్డ్‌కప్‌లో వరుసగా ఎనిమిది మ్యాచ్‌లను నెగ్గి విజేతగా నిలిచిన టీమిండియా.. ఆ తర్వాత కూడా 20 మ్యాచ్‌ల్లో గెలిచి కేవలం నాలుగింట్లోనే ఓడింది. ఈ మధ్యకాలంలో ఒక్క టీ20 సిరీస్‌ను కూడా కోల్పోలేదు. ఇప్పుడు ఆ మెగా టోర్నీ ఫైనల్ ప్రత్యర్థితోనే జరుగుతున్న తాజా పోరులో బలాబలాలను సరిచూసుకోవాలనుకుంటోంది. అటు సఫారీలు పొట్టి ఫార్మాట్‌లో తడబడుతున్నారు. విశ్వకప్‌లో రన్నరప్‌గా నిలిచాక ఆ జట్టు ఆడిన 25 మ్యాచ్‌ల్లో తొమ్మిదే గెలవడం గమనార్హం. ఆసీస్, పాక్‌లపై సిరీస్‌లు కోల్పోగా.. నమీబియా పైనా ఓడారు. దీంతో ఈ సిరీస్ సఫారీలకు సవాల్‌గా మారనుంది.

పటిష్టంగా భారత్: గాయాల నుంచి కోలుకున్న వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టులో చేరడంతో టీమిండియా అత్యంత పటిష్టంగా కనిపిస్తోంది. ఐపీఎల్ నుంచి నిరంతరాయంగా క్రికెట్ ఆడుతున్న గిల్‌కు దాదాపు నెల రోజుల విశ్రాంతి లభించినట్టయింది. అద్భుత ఫామ్‌లో ఉన్న అభిషేక్‌తో కలిసి అతను ఓపెనింగ్ చేయనున్నాడు. ఇక ఆసియాకప్‌లో గాయపడిన పాండ్యా రెండు నెలలకు పైగా జట్టుకు దూరమయ్యాడు. ఇటీవలే సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ఆడి ఫామ్ చాటుకున్నాడు. అతడి రాకతో బ్యాటింగ్ ఆర్డర్‌తో పాటు బౌలింగ్ విభాగం కూడా బలంగా కనిపిస్తోంది. అయితే ఆదివారం సాయంత్రం నెట్స్‌లో బౌలింగ్ చేసేటప్పుడు హార్దిక్ కాస్త అసౌకర్యానికి లోనైనట్టు సమాచారం. కెప్టెన్ సూర్యకుమార్ ఫామ్‌లేమి మాత్రం జట్టును తీవ్రంగా ఆందోళన పరుస్తోంది. ఐపీఎల్‌లో 717 పరుగులతో అదరగొట్టిన తను భారత్ తరఫున మాత్రం రాణించడం లేదు. గతేడాది జూలైలో కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి 15 ఇన్నింగ్స్‌లో 184 పరుగులే చేయగా, చివరి 20 మ్యాచ్‌ల్లో అర్ధసెంచరీ చేయలేకపోయాడు. ఈ సిరీస్‌లోనూ విఫలమైతే కెప్టెన్సీకే ఎసరు రావచ్చు. వికెట్ కీపర్ స్థానం కోసం శాంసన్, జితేశ్ మధ్య పోటీ నెలకొంది. ఆసీస్ టూర్‌లో వన్‌డౌన్‌లో శాంసన్‌ను ఒకే మ్యాచ్ ఆడించగా, చివరి మూడు మ్యాచ్‌ల్లో జితేశ్‌కు చోటు కల్పించారు. వాస్తవానికి గతేడాది ప్రపంచకప్ తర్వాత శాంసన్ ఓపెనర్‌గా మూడు శతకాలు బాదాడు. ఇందులో రెండు దక్షిణాఫ్రికాపైనే ఉన్నాయి. కానీ గిల్‌కు వైస్‌కెప్టెన్సీ అప్పగించి ఓపెనర్‌గా ఆడించడంతో సంజూ స్థానం మారింది. పేస్‌లో బుమ్రాకు హార్దిక్, దూబే తోడుగా ఉండనున్నారు. వరుణ్, అక్షర్, కుల్దీప్ స్పిన్ బాధ్యతలు తీసుకోనున్నారు.



ప్రాక్టీస్‌లో మిల్లర్, మార్‌క్రమ్

జట్టులోకి నోకియా: మార్‌క్రమ్ కెప్టెన్సీలో బరిలోకి దిగుతున్న సౌతాఫ్రికా జట్టు హిట్టర్ డి జోర్జి, పేసర్ మఫాక సేవలను కోల్పోయింది. గాయాలతో వీరు సిరీస్‌కు దూరమయ్యారు. అయితే స్టార్ పేసర్ నోకియా సుదీర్ఘ విరామం తర్వాత జట్టులోకి రావడం సానుకూలాంశం కానుంది. గిల్ ఎక్కువగా అతని బౌలింగ్‌లోనే దొరికిపోతుంటాడు. డికాక్‌తో కలిసి మార్‌క్రమ్ ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నాడు. మిడిలార్డర్‌లో స్టబ్స్, బ్రెవిస్, మిల్లర్ భారత బౌలర్లను ఇబ్బంది పెట్టగలరు. ముఖ్యంగా బ్రెవిస్ స్పిన్నర్లను ఓ ఆటాడుకుంటాడు. ఈ త్రయంలో ఒక్కరు కుదురుకున్నా భారీ స్కోరు ఖాయమే. పేసర్ యాన్సెన్ నిఖార్సయిన ఆల్‌రౌండర్‌గా అదరగొడుతున్నాడు.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్, జితేశ్/శాంసన్, హార్దిక్, శివమ్ దూబే, అక్షర్, బుమ్రా, వరుణ్, కుల్దీప్.

దక్షిణాఫ్రికా: డికాక్, మార్‌క్రమ్ (కెప్టెన్), హెన్‌డ్రిక్స్, బ్రెవిస్, మిల్లర్, స్టబ్స్, బాష్, యాన్సెన్, కేశవ్, ఎన్‌గిడి, నోకియా.

పిచ్

దక్షిణాఫ్రికాతో ఇక్కడ ఆడిన రెండు టీ20 మ్యాచ్‌ల్లోనూ భారత్‌కు ఓటములే ఎదురయ్యాయి. తొలిసారిగా ఈ వికెట్‌ను ఎర్రమట్టితో తయారు చేయడంతో ఆరంభంలో పేస్, బౌన్స్ ఎక్కువగా ఉంటుంది. దీంతో బంతి బ్యాట్‌పైకి వచ్చే అవకాశం ఉండడంతో స్ట్రోక్‌ప్లేకు అనువుగా ఉంటుంది. స్పిన్నర్లు కూడా ప్రభావం చూపగలరు. మంచు కారణంగా టాస్ గెలిచిన జట్టు చేజింగ్‌కు మొగ్గు చూపే అవకాశముంది.

విశ్వకప్‌నకు ముందు వైదొలగనున్న జియోస్టార్!

కొత్త స్పాన్సర్ వేటలో ఐసీసీ

దుబాయ్: మరో రెండు నెలల్లో ప్రతిష్ఠాత్మక పురుషుల టీ20 వరల్డ్ కప్ జరగనుండగా..ఐసీసీకి పెద్ద చిక్కొచ్చి పడింది. రిలయన్స్ నియంత్రణలోని జియో హాట్‌స్టార్ ఐసీసీ అధికారిక ప్రసార హక్కుల ఒప్పందం నుంచి వైదొలగాలని నిర్ణయించుకుందట! ఈ విషయాన్ని ఐసీసీకి జియో తెలిపినట్టు సమాచారం. నాలుగు సంవత్సరాల ఒప్పందంలో ఇంకా రెండేళ్లు మిగిలి ఉన్నా జియోస్టార్ తప్పుకోనుంది. భారీగా నష్టాలు వస్తుండడమే జియో నిర్ణయానికి కారణంగా తెలుస్తోంది. 2024-27 సంవత్సరాల ప్రసార హక్కుల కోసం 3 బిలియన్ డాలర్ల (నాటి ధర రూ. 23,987 వేల కోట్లు)తో ఐసీసీ.. జియో హాట్‌స్టార్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. జియోస్టార్ నోటీసు నేపథ్యంలో 2026-29 సంవత్సరాలకుగాను భారత ప్రసార హక్కుల తాజా అమ్మకానికి ఐసీసీ ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ ప్రసార హక్కుల విలువ రూ.21,611 కోట్లుగా పేర్కొంది. కొత్త హక్కులకు సంబంధించి సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ సంస్థలను ఐసీసీ సంప్రదించినట్టు సమాచారం. అయితే హక్కుల విలువ ఎక్కువగా ఉండడంతో ఆ సంస్థలేవీ ఆసక్తి చూపనట్టు తెలిసింది. భారత్-శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచ కప్ వచ్చే ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనుంది. మెగా టోర్నీ షెడ్యూల్‌ను ఐసీసీ ఇప్పటికే ప్రకటించింది.

దటీజ్ మంధాన!



స్టార్ బ్యాటర్ నెట్ ప్రాక్టీస్

శ్రీలంకతో సిరీస్‌కు సన్నాహకం



ముంబై: ప్రతి మనిషి జీవితంలో వివాహం ఓ అపురూప ఘట్టం. అలాంటి పెళ్లి వేడుక రద్దయితే తట్టుకోవడం ఎంతో కష్టం. కానీ టీమిండియా స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన..పలాష్ ముచ్చల్‌తో తన వివాహాన్ని రద్దు చేసుకున్నట్టు ప్రకటించిన 24 గంటల్లోపే క్రికెట్ మైదానంలో అడుగు పెట్టింది. ఈనెల 21నుంచి శ్రీలంకతో జరిగే ఐదు టీ20ల సిరీస్‌కు సన్నాహకాలు ఆరంభించింది. ఇందులో భాగంగా సోమవారం స్వస్థలంలో నెట్ ప్రాక్టీస్ చేసింది. ఈమేరకు ఆమె సాధన చేస్తున్న ఫొటోను స్మృతి సోదరుడు శ్రవణ్ మంధాన ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. దానికి హార్ట్ ఎమోజీని జత చేశాడు. పోస్ట్ చేసిన కొద్దిసేపటికే ఈ ఫొటోకు పెద్ద ఎత్తున ప్రతిస్పందనలు వచ్చాయి. స్మృతి గుండె నిబ్బరాన్ని కొనియాడడంతో పాటు ఆమె అంకితభావానికి సహచర క్రికెటర్లు, ఫ్యాన్స్ జేజేలు పలికారు.



'క్యాండిడేట్స్'కు ప్రజ్ఞానంద అర్హత

న్యూఢిల్లీ: భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద 2026 క్యాండిడేట్స్ చెస్ టోర్నీకి అర్హత సాధించాడు. 2025 ఫిడే సర్క్యూట్‌లో గెలుపొందిన నేపథ్యంలో క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌కు అతడి ఎంట్రీని సోమవారం అధికారికంగా ప్రకటించారు. చెన్నైకి చెందిన ప్రజ్ఞానంద ఈ సంవత్సరం జరిగిన పలు ఫిడే టోర్నీలలో అద్భుత ప్రదర్శన కనబరిచాడు. దరిమిలా అతడు సర్క్యూట్ విజేతగా నిలిచాడు.

ఆంధ్రకు నిరాశ

19 పరుగులతో విదర్భ చేతిలో పరాజయం

లఖ్‌నవూ: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ లీగ్ దశను ఆంధ్ర ఓటమితో ముగించింది. గ్రూప్-ఎలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 19 పరుగుల తేడాతో విదర్భ చేతిలో పరాజయం పాలైంది. తొలుత విదర్భ నిర్ణీత 20 ఓవర్లలో 154/8 స్కోరు చేసింది. అమన్ (50), అక్షయ్ (41) దూకుడుగా ఆడారు. సత్యనారాయణ రాజు నాలుగు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేదనలో ఆంధ్ర ఓవర్లన్నీ ఆడి 135/9 స్కోరు మాత్రమే చేసింది. అవినాష్ (44), కెప్టెన్ రికీ భుయ్ (26) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. యశ్ ఠాకూర్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. ఉమేష్ యాదవ్, హర్ష్ దూబే చెరో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. కాగా మరో మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు చండీగఢ్ చేతిలో ఓటమిపాలైనా సూపర్‌లీగ్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది.

వేల్స్‌పై భారత అమ్మాయిల గెలుపు

శాంటియాగో (చిలీ): జూనియర్ మహిళల హాకీ వరల్డ్‌కప్‌లో భారత్ 9వ స్థానం కోసం పోరాడనుంది. ఇప్పటికే క్వార్టర్స్ రేసు నుంచి అవుటైన భారత్.. సోమవారం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో 3-1తో వేల్స్‌పై గెలిచింది. హీనా (14వ), సునెలిటా (24వ), ఇషిక (31వ) తలో గోల్ సాధించారు. 9వ స్థానం కోసం మంగళవారం జరిగే పోరులో ఉరుగ్వేతో భారత్ తలపడనుంది.

టీమిండియాకు జరిమానా

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో భారత జట్టు స్లో ఓవర్ రేట్‌కు పాల్పడినందుకు ఐసీసీ జరిమానా విధించింది. నిర్ణీత సమయానికి రెండు ఓవర్లు ఆలస్యంగా వేయడంతో రెఫరీ రిచీ రిచర్డ్‌సన్ ఆటగాళ్ల మ్యాచ్ ఫీజుల్లో పది శాతం జరిమానా విధించారు. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమిపాలైన విషయం తెలిసిందే.

బిజినెస్

లాభాల స్వీకారంతో 'బేర్'

రూ.7.12 లక్షల కోట్లు హాంఫట్

ముంబై: లాభాల స్వీకారం, ఎఫ్‌పీఐల అమ్మకాలు సోమవారం స్టాక్ మార్కెట్‌ను కుంగదీశాయి. సెన్సెక్స్ 609.68 పాయింట్ల నష్టంతో 85,102.69 వద్ద ముగియగా నిఫ్టీ 225.90 పాయింట్ల నష్టంతో 25,960.55 వద్ద ముగిసింది. దీంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ రూ.7.12 లక్షల కోట్లు నష్టపోయి రూ.464.19 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 29 షేర్లు నష్టాలతో ముగిశాయి. ఈ పతనానికి కారణాలేమిటో పరిశీలిద్దాం.

వడ్డీరేట్లపై సందిగ్ధత: అమెరికన్ ఫెడరల్ రిజర్వ్, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, స్విట్జర్లాండ్ దేశాల కేంద్ర బ్యాంకుల ద్రవ్య, పరపతి విధానాలు ఈ వారం వెలువడనున్నాయి. అన్నిటికంటే బుధవారం వెలువడే 'ఫెడ్ రిజర్వ్' పరపతి విధానం కోసం భారత మార్కెట్ ఆసక్తితో ఎదురు చూస్తోంది. ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గి ఫెడ్ ఛైర్మన్ జెరోం పోవెల్ కీలక వడ్డీ రేట్లను పావు శాతమైనా తగ్గిస్తారా, లేదా అన్నదే ప్రధానాంశం. సోమవారం భారత మార్కెట్ నష్టాలకు ఇది కూడా ఒక కారణంగా కనిపిస్తోంది.

ఎఫ్‌పీఐల అమ్మకాలు: గత ఏడాది వరకు మన స్టాక్ మార్కెట్‌లో ఎగబడి కొన్న ఎఫ్‌పీఐలు, ఈ ఏడాది ప్రారంభం నుంచే చిన్న చూపు చూస్తున్నాయి. ఇక్కడ అమ్మి చైనా, దక్షిణ కొరియా, తైవాన్ దేశాల్లో పెట్టుబడిగా పెడుతున్నాయి. ఈ నెల ఇప్పటి వరకు ఈ సంస్థలు రూ.1.55 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. సోమవారంనాడు కూడా ఈ సంస్థలు పెద్ద ఎత్తున అమ్మకాలకు దిగడం సూచీలను దెబ్బతీసింది.


రూపాయి పతనం: డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం ఎఫ్‌పీఐలను మరింత బెంబేలెత్తిస్తోంది. ఈ సంవత్సరం ఇప్పటికే డాలర్‌తో ఐదు శాతం వరకు నష్టపోయిన రూపాయి, సోమవారం మరో 10 పైసలు నష్టపోయి రూ.90.05 వద్ద ముగిసింది. పెరుగుతున్న వాణిజ్య లోటు డాలర్‌తో రూపాయి మారకం రేటు త్వరలోనే రూ.92-93కు చేరే అవకాశం ఉందన్న అంచనాలు మార్కెట్‌ను మరింత భయపెడుతున్నాయి.

చమురు మంట: అంతర్జాయ ఉద్రిక్తతలతో చమురు ధర మళ్లీ మండుతోది. సోమవారం బ్రెంట్ రకం చమురు బ్యారెల్ ధర గత రెండు వారాల్లో ఎన్నడూ లేని విధంగా 63.83 డాలర్లకు చేరింది. దీంతో మన వాణిజ్య లోటు పెరిగి చెల్లింపులు సమతౌల్యం దెబ్బతినే ప్రమాదం ఉందని భయపడుతున్నారు.

ఔట్‌లుక్: నిఫ్టీ కీలక మద్దతు స్థాయి అయిన 26,000 పాయింట్ల దిగువన క్లోజైంది. తదుపరి మద్దతు 25,900-25,850 మధ్య ఉంటుందని టెక్నికల్ విశ్లేషకుల అంచనా. ఈ మద్దతు స్థాయిలు కూడా బ్రేకైతే నిఫ్టీ 50 సూచీ 25,500 స్థాయికి కూడా పతనమయ్యే ప్రమాదం ఉందనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

భారతీయుల వద్ద 35,000 టన్నుల పసిడి

ప్రస్తుత మార్కెట్ విలువ రూ.342 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: ధరలు చుక్కలంటుతున్నా సరే.. దేశ ప్రజలు బంగారాన్ని విపరీతంగా కొనేస్తున్నారు. దీంతో ఈ ఏడాది జూన్ నాటికి భారతీయ కుటుంబాల వద్ద నగలు, కడ్డీలు, బిస్కెట్లు, నాణేల రూపంలో ఉన్న పసిడి నిల్వలు 34,600 టన్నులకు చేరాయి. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఈ బంగారం విలువ 3.8 లక్షల కోట్ల డాలర్లని (సుమారు రూ.342 లక్షల కోట్లు) మోర్గాన్ స్టాన్లీ ఒక నివేదికలో తెలిపింది. ప్రస్తుత దేశ జీడీపీలో ఇది 88.8 శాతానికి సమానం.

మారుతున్న ట్రెండ్: గతంలో దేశీయ కుటుంబాలు నగ నట్రా రూపంలోనే బంగారం కొనేవారు. ఇప్పటికీ దేశంలో అమ్ముడయ్యే బంగారంలో నాలుగింట మూడు వంతులు నాణేలు, కడ్డీల రూపంలోనే అమ్ముడవుతోంది. మిగతా మూడో వంతు మాత్రమే పెట్టుబడి లాభాల కోసం కొనే వారు కొంటున్నారు. గత ఏడాది కాలంలో బులియన్ మార్కెట్ ముఖ్యంగా పసిడి గతంలో ఎన్నడూ లేని విధంగా అరవై శాతానికిపైగా లాభాలు పంచింది. దీంతో ఇటీవల ఈ తరహా అమ్మకాలు మరింత పెరిగాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని మ్యూచువల్ ఫండ్స్ గోల్డ్ ఈటీఎఫ్‌లు, మల్టీ అసెట్స్ ఫండ్స్ పేరుతో ప్రత్యేక పథకాల ప్రారంభించి పెద్ద ఎత్తున నిధులు సమీకరిస్తున్నాయి.

ఆభరణాలు వేస్ట్: పెట్టుబడి లాభాల కోసమైతే ఆభరణాల రూపంలో బంగారం కొనడం వృధా అని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ ఒక నివేదిలో తెలిపింది. ఈ నగల్లో 30 నుంచి 35 శాతం విలువకు రాళ్లు, రత్నాలే ఉంటాయి. తరుగు, తయారీ చార్జీలు అదనం. పసిడి ధర ఏటా కనీసం 30% చొప్పున పెరిగితేగానీ ఆభరణాల పెట్టుబడులపై లాభాలు రావు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పెట్టుబడి లాభాల కోసం చూసే వారు ఫిజికల్ గోల్డ్ లేదా గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో మదుపు చేయడం మంచిదని ఇన్వెస్ట్‌మెంట్ నిపుణులు సూచిస్తున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,30,420 ▲	1,19,550 ▲	1,98,000 ▲
విజయవాడ	1,32,000 ▲	1,23,000 ▲	1,83,000 ▼
విశాఖపట్నం	1,32,570 ▲	1,19,550 ▲	1,98,000 ▲
రాజమండ్రి	1,30,420 ▲	1,19,550 ▲	1,81,000 ▼
ప్రొద్దుటూరు	1,27,750 ▲	1,17,530 ▲	1,78,000 ▲
ముంబై	1,28,260 ▼	1,17,480 ▼	1,79,090 ▲

సైయెంట్ సెమీ కండక్టర్స్‌తో నవిటాస్ భాగస్వామ్యం

హైదరాబాద్: కొత్త తరం జీఏఎన్ టెక్నాలజీని భారత దేశంలో ప్రవేశపెట్టి సంపూర్ణ జీఏఎన్ వ్యవస్థను నెలకొల్పడం లక్ష్యంగా నవిటాస్ సెమీ కండక్టర్ కార్పొరేషన్‌తో సైయెంట్ సెమీకండక్టర్స్ దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం కింద రెండు కంపెనీలు డేటా సెంటర్లు, విద్యుత్ వాహనాలు, పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, ఎనర్జీ గ్రిడ్ మౌలిక వసతులు, పారిశ్రామిక విద్యుదీకరణ రంగాలకు అవసరం అయిన జీఏఎన్ ఉత్పత్తులను ఉమ్మడిగా అభివృద్ధి చేస్తాయి.

డాక్టర్ రెడ్డీస్ నుంచి కేన్సర్ ఔషధం

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే డాక్టర్ రెడ్డీస్ లాబ్స్ మరో సరికొత్త కేన్సర్ ఔషధాన్ని మార్కెట్‌లో విడుదల చేయనుంది. ఇందుకోసం ఇమ్యూటెప్ లిమిటెడ్ కంపెనీతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ లైసెన్సింగ్ ఒప్పందంపై డాక్టర్ రెడ్డీస్ అనుబంధ సంస్థ డాక్టర్ రెడ్డీస్ ఎస్‌ఏ, ఇమ్యూటెప్ లిమిటెడ్ అనుబంధ సంస్థ ఇమ్యూటెప్ ఎస్ఏఎస్ సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ద్వారా ఇమ్యూటెప్‌కు చెందిన ఎఫ్టిలాగిమోడ్ అల్ఫా అనే కేన్సర్ ఔషధాన్ని డాక్టర్ రెడ్డీస్ ఉత్తర అమెరికా, యూరప్, జపాన్, గ్రేటర్ చైనా దేశాల వెలుపల మార్కెట్ చేస్తుంది. ఈ ఔషధం కేన్సర్‌తో పాటు ఇతర ఆటో ఇమ్యూన్ వ్యాధుల పైనా పోరాడుతుందని రెండు కంపెనీలు ప్రకటించాయి.

తుప్పు నష్టం రూ.8.8 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: వాతావరణపరమైన కారణాలతో వాహనాలు, పరిశ్రమలు, మౌలిక వసతులకు తుప్పు పట్టడం ద్వారా ఏటా జీడీపీలో 5 శాతం లేదా 10 వేల కోట్ల డాలర్ల (రూ.8.8 లక్షల కోట్లు) నష్టం వాటిల్లుతోందని వివిధ అధ్యయనాల్లో తేలింది. వాహనాలు, మౌలిక వసతులు, పారిశ్రామిక వ్యవస్థలను తుప్పు తీవ్రంగా ప్రభావితం చేస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు. తుప్పు కారణంగా సాధారణ కార్ల యజమానులకు వాహనం కొన్న తర్వాత కొద్ది సంవత్సరాలకే మరమ్మత్తు బిల్లులు పెరిగిపోతున్నాయి. వాహనాల నాణ్యత వేగంగా దిగజారి రీసేల్ విలువ గణనీయంగా పడిపోతోంది. ఆ రకంగా వారిపై విపరీతమైన భారం పడుతోందని నిపుణులు తెలిపారు. వాహనాలకు గాల్వనైజ్డ్ స్టీల్ (తుప్పు నుంచి రక్షణ కల్పించే నాణ్యత గల ఉక్కు) ఉపయోగించే విషయంలో దేశీయ, ఎగుమతి మార్కెట్లకు ఒకే తరహా నిబంధనలుండాలని వారు సూచిస్తున్నారు. యూరప్, జపాన్, ఉత్తర అమెరికా, ఆఫ్రికా మార్కెట్లకు ఎగుమతి చేయడానికి ఉత్పత్తి చేసే వాహనాల్లో 70%, ఆపై బడిన స్థాయిలో గాల్వనైజ్డ్ స్టీల్ ఉపయోగిస్తున్నారని, దానికి అదనంగా ఆరున్నర సంవత్సరాల యాంటీ కరోజన్ వారెంటీలు ఇస్తున్నారని వారన్నారు. అదే భారత మార్కెట్ కోసం తయారుచేసే కార్లలో గాల్వనైజ్డ్ స్టీల్ వినియోగం చాలా తక్కువగా ఉంటోందని, ఇక వారెంటీ అయితే నామమాత్రంగా కూడా కల్పించడంలేదని వారు చెప్పారు. గాల్వనైజ్డ్ స్టీల్‌తో తయారుచేసే వాహనాలకు అదనంగా అయ్యే వ్యయం 0.1% కన్నా తక్కువేనని, కాని మరమ్మత్తుల కోసం చేసే వేలాది రూపాయల వ్యయాన్ని నివారించగలుగుతారని అంటున్నారు. వాహనాలకు తుప్పు పట్టడం వల్ల చాసిస్, సస్పెన్షన్ మౌంట్లు, జాయింట్లు బలహీనమై ప్రయాణికుల భద్రతకు కూడా ముప్పు ఏర్పడుతుందని వారు హెచ్చరించారు. అయితే సెంట్రల్ మోటార్ వాహనాల నిబంధనలు (సీఎంవీఆర్) గాని, భారత ప్రమాణాల సంస్థ నిబంధనలు గాని వాహనాలకు తుప్పు నిరోధక స్థాయిలు లేదా గాల్వనైజేషన్ ఉక్కు వినియోగ శాతాన్ని నిర్ధారించకపోవడం విచారకరమని వారంటున్నారు. జింక్ కోటింగ్ వేసిన ఉక్కు షీట్లు కార్ల బాడీని తుప్పు నుంచి రక్షిస్తాయని ఇండియా లెడ్ జింక్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.పుహళేంది అన్నారు.

ఐబీఎం గూటికి కాన్‌ఫ్లుయెంట్

ఒప్పందం విలువ రూ.1 లక్ష కోట్లు

న్యూయార్క్: అమెరికన్ టెక్నాలజీ కంపెనీ ఐబీఎం మరో భారీ కొనుగోలు జరిపింది. డేటా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ కాన్‌ఫ్లుయెంట్‌ను 1,100 కోట్ల డాలర్లకు (సుమారు రూ.లక్ష కోట్లు) దక్కించుకుంది. పూర్తిగా నగదు రూపంలో జరగనున్న ఈ డీల్‌లో భాగంగా కాన్‌ఫ్లుయెంట్‌కు చెందిన ఒక్కో షేరుకు ఐబీఎం 31 డాలర్లు చెల్లించనుంది. 2026 ప్రథమార్ధం చివరినాటికి ఈ కొనుగోలు ప్రక్రియ పూర్తి కావచ్చని అంచనా. కాన్‌ఫ్లుయెంట్ కొనుగోలు తమ కృత్రిమ మేధ (ఏఐ) సేవల సామర్థ్యాన్ని మరింత పెంచనుందని ఐబీఎం సీఈఓ అరవింద్ కృష్ణ అన్నారు. ఈ డీల్ నేపథ్యంలో అమెరికా స్టాక్ మార్కెట్లో కాన్‌ఫ్లుయెంట్ షేరు సోమవారం ఒకదశలో 26 శాతం ఎగబాకగా.. ఐబీఎం స్టాక్ 1 శాతం తగ్గింది. గడిచిన రెండేళ్లలో ఐబీఎం జరిపిన మూడో అతిపెద్ద కొనుగోలు లావాదేవీ ఇది.

లగ్జంబర్గ్ ఇండస్ట్రీస్‌తో ఏటీజీసీ బయోటెక్ జాయింట్ వెంచర్

హైదరాబాద్: జెనోమ్ వేలీలో కార్యకలాపాలు సాగిస్తున్న.. ఫెరోమోన్, సెమియో కెమికల్ ఆధారిత పంట రక్షణ ఉత్పత్తుల విభాగంలోని ఏటీజీసీ బయోటెక్ కంపెనీ ఇజ్రాయెల్‌కు చెందిన లగ్జంబర్గ్ ఇండస్ట్రీస్‌తో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసుకున్నట్టు ప్రకటించింది. న్యూఢిల్లీలో జరిగిన తొలి అంతర్జాతీయ సైన్స్ అండ్ టెక్నాలజీ క్లస్టర్ల సదస్సు ముగింపు కార్యక్రమంలో ఈ లైసెన్సింగ్ ఒప్పందాల మార్పిడి జరిగింది. ఈ సెమియోఫోర్ జేవీకి అవసరమయ్యే కోటి డాలర్ల (రూ.89 కోట్లు) పెట్టుబడిని సెమీయోఫోర్, లగ్జంబర్గ్ ఇండస్ట్రీస్, ఏటీజీసీ బయోటెక్ సమంగా సమకూరుస్తాయని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఒప్పందం కింద ఏటీజీసీ ఐపీ, టెక్నాలజీ, సాంకేతిక పరిజ్ఞానం, రెగ్యులేటరీ, ఆర్ అండ్ డీలపై దృష్టి పెడుతుంది. లగ్జంబర్గ్ ఇండస్ట్రీస్ రెగ్యులేటరీ, మార్కెటింగ్, తయారీ వ్యయాలను భరిస్తుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	651	విజయవాడ	670
వరంగల్	653	గోదావరి	650
చిత్తూరు	663	విశాఖపట్నం	640
		డజను గుడ్లు రూ.	90

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	129	విజయవాడ	130
వరంగల్	129	గుంటూరు	135
కరీంనగర్	129	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	129	చిత్తూరు	127
కర్నూలు	129	నెల్లూరు	132
విశాఖపట్నం	126	అనంతపురం	132
గోదావరి	130		

ఈ ఏడాది ఏపీకి 40 వేల కోట్లు ఇచ్చాం!

▸ పోలవరానికి ఇప్పటివరకు 20 వేల కోట్లు: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ నెల 2 నాటికి ఆంధ్రప్రదేశ్‌కు రూ.40,337 కోట్లు విడుదల చేశామని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. సోమవారం లోక్‌సభలో బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. కేంద్ర పన్నుల్లో వాటాగా రూ.37,903 కోట్లు, ఆర్థిక సంఘం గ్రాంట్లు రూ.2,434 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. అలాగే, రాష్ట్రాలకు మూలధన పెట్టుబడుల కోసం ప్రత్యేక సహాయం కింద రూ.3,492 కోట్లను ఏపీకి విడుదల చేశామని తెలిపారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు రూ.20,659 కోట్లు విడుదల చేశామని వెల్లడించారు. ఏపీకి చెల్లించాల్సిన బకాయిలు ఏమీ లేవన్నారు.

నేటి అర్ధరాత్రి నుంచి లారీల సమ్మె

విజయవాడ(ఆటోనగర్), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గూడ్స్ వాహనాలపై ఫిట్‌నెస్ చార్జీలను పాత విధానంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం(ఈనెల 9వ తేదీ) అర్ధరాత్రి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నట్లు న్యూ ఆంధ్ర మోటార్ ట్రక్కర్స్ అసోసియేషన్(నమ్‌తా) ప్రధాన కార్యదర్శి బొడ్డ శేషగిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఫిట్‌నెస్ చార్జీలు రూ. 900 నుంచి రూ. 1,400 వరకు మాత్రమే ఉండగా ప్రస్తుతం అవి రూ. 2,300 నుంచి రూ.33 వేల వరకు పెరగడంతో లారీ యజమానులపై తీవ్ర ఆర్థికభారం పడుతోందని పేర్కొన్నారు. గూడ్స్ వాహనాలపై ఫిట్‌నెస్ చార్జీల పెంపు ఉపసంహరించుకోవాలని శేషగిరి డిమాండ్ చేశారు.

డీసీసీబీ ఇన్‌చార్జుల పదవీ కాలం పెంపు

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)ల అనధికార పర్సన్ ఇన్‌చార్జుల పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ఈనెల 26 నుంచి ఆరు నెలలు, లేదా ఎన్నికలు నిర్వహించే వరకు, లేదా తదుపరి నిర్ణయం తీసుకునే వరకు ఈ పొడిగింపు వర్తిస్తుంది. కాగా, వ్యవసాయ, ఉద్యానశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా కొబ్బరి బోర్డు పథకాల అమలు కోసం రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కమిటీని ప్రభుత్వం నియమించింది. అలాగే రూ.30.40కోట్ల వ్యయంతో కొబ్బరి అభివృద్ధి బోర్డు పథకాల అమలుకు పరిపాలనా ఆమోదం తెలిపింది.

ఖాళీ ఓచర్లపై రైతుల సంతకాలు తీసుకోవద్దు

▸ పీఏసీఎస్ సీఈవోలకు సహకార కమిషనర్ ఆదేశాలు

అమరావతి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రైతులకు పంట రుణాలు, ఇతర రుణాలు ఇచ్చేటప్పుడు ఖాళీ ఓచర్లు, ఖాళీ పత్రాలపై సంతకాలు తీసుకోవద్దని సహకార శాఖ కమిషనర్ అహ్మద్ బాబు పీఏసీఎస్ సీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ-పీఏసీఎస్ సాఫ్ట్‌వేర్‌లో పూర్తిగా కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్ విధానాన్ని నిర్వహించాలని, రోజూ ఆర్థిక నివేదికలు పంపాలని సూచించారు. ఏదైనా తప్పు జరిగితే తీవ్రంగా పరిగణిస్తామన్నారు. పంట రుణాలు పే ఆర్డర్లు, ఎల్‌టీ రుణాలకు అకౌంట్ పే చెక్కులను మాత్రమే జారీ చేయాలని, నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించాలని స్పష్టం చేశారు.

లింక్ రోడ్లకు నిధులివ్వాలి: ఏఎంసీ చైర్మన్ల విజ్ఞప్తి

పంట పొలాల నుంచి గ్రామాలకు లింక్ రోడ్ల(పుంత రోడ్ల) నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని విజయవాడ జోనల్ మార్కెట్ యార్డు చైర్మన్లు కోరారు. సోమవారం గుంటూరులో మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ విజయసునీతకు ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు.

క్రిస్మస్ హైటీకి 1.25 కోట్లు విడుదల

క్రిస్మస్ హైటీ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.25 కోట్లు విడుదల చేస్తూ ఆదేశాలిచ్చింది. జిల్లా హెడ్‌క్వార్టర్‌లో క్రిస్మస్ హైటీ కార్యక్రమాలకు రూ.2 లక్షలు, రాష్ట్ర స్థాయి వేడుకలకు రూ.73 లక్షలు కేటాయించింది.

దైవాధీనం.. దేవదాయం!

ఆలయాల్లో సామాన్య భక్తులకు కష్టాలు

▸ సీఎం ఆశించిన స్థాయిలో లేని సౌకర్యాలు
▸ ముఖ్యమంత్రి ఆగ్రహం.. అధికారుల మౌనం
▸ పోస్టుల భర్తీకి గతేడాదే ముఖ్యమంత్రి ఓకే
▸ 300 పోస్టులకు అనుమతి కోరిన దేవదాయశాఖ
▸ 7 పోస్టులకే ఆర్థికశాఖ అధికారుల పచ్చజెండా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

"ఆలయాల్లో భక్తులకు సరైన సౌకర్యాలు, మెరుగైన సేవలు అందడం లేదు. దేవుడి దర్శనాల సమయానికి అనుగుణంగా భక్తులను అనుమతించడంలో అధికారులు విఫలమవుతున్నారు. చివరికి ఆలయాల్లో పారిశుధ్య పరిస్థితి ఆశించిన స్థాయిలో ఉండడం లేదు. భక్తుల పట్ల సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు కూడా సక్రమంగా లేదు." అని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. ఆలయాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించడంలో దేవదాయ శాఖ విఫలం చెందుతోందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్శనాల విషయంలో భక్తులు ఇస్తున్న ఫీడ్ బ్యాక్‌లోనూ ఇవే అంశాలను ప్రస్తావిస్తున్నారు. వీటన్నింటికీ ప్రధాన కారణం సిబ్బంది కొరతేనన్నది స్పష్టమవుతోంది. అయితే, ఈ సమస్యల పరిష్కారంలో దేవదాయ శాఖ విఫలమవుతోంది. గత పదేళ్ల నుంచి ఈ సమస్య మరింతగా ఎక్కువగా ఉందని శాఖ వర్గాలు చెబుతున్నాయి. శాఖ ప్రధాన కార్యాలయం నుంచి ప్రధాన ఆలయాలు, ముఖ్య దేవాలయాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉం టోంది. శాఖలో కీలకమైన జాయింట్ కమిషనర్లు ఇద్దరే మిగిలారు. డిప్యూటీ కమిషనర్ల పదోన్నతుల వ్యవహారం కూడా మూలకు చేరింది. అసిస్టెంట్ కమిషనర్లు, గ్రేడ్-1 ఈవోల కొరత మరింతగా శాఖను వేధిస్తోంది. గ్రేడ్-3 ఈవోల ఖాళీలు దాదాపు 150 వరకు పెండింగులో ఉన్నాయి. దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో ఒక్కరంటే ఒక్కరు కూడా జూనియర్ అసిస్టెంట్ లేరు. ప్రధాన కార్యాలయాలన్నీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో నడిపించాల్సిన దుస్థితి ఏర్పడింది.

భక్తులు-వీఐపీలు

ఆలయాలకు వచ్చే భక్తుల సంఖ్య దాదాపు పది రేట్లు పెరిగింది. వీఐపీ ప్రొటోకాల్ దర్శనాల తాకిడి కూడా సిబ్బందికి పనిభారం పెంచుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్య భక్తులను పట్టించుకునేందుకు సిబ్బందికి సమయం ఉండడం లేదు. ఇక, పండగల సమయంలో పరిస్థితి ఆలయ అధికారుల చేతులు దాటిపోతోంది. సామాన్య భక్తులు వ్యక్తిగత క్రమశిక్షణను పాటించడమే తప్ప.. వారి గురించి ఆలోచించే సమయం, వారికి సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించే పరిస్థితి లేదు. క్యూలైన్ల పర్యవేక్షణకు ఏఐను ఉపయోగిస్తున్నా, టెక్నాలజీ వాడుతున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు.

సిబ్బంది కొరతతో.. సౌకర్యాల లేమి

> దేవదాయ శాఖలో సిబ్బంది కొరత కారణంగా అనేక ఇబ్బందులు ఎదరవుతున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు గత ఏడాది ఆగస్టు 24న నిర్వహించిన తొలి సమీక్షలో సిబ్బంది నియామకంపై కీలక ఆదేశాలు ఇచ్చారు. అవసరమైన సిబ్బందిని నియమించాలని పేర్కొన్నారు. డిప్యూటీ, అసిస్టెంట్ కమిషనర్, గ్రేడ్-1, గ్రేడ్-3 ఈవోల పోస్టులు మొత్తం భర్తీ చేయాలని ఆదేశించారు. కేవలం 4 నెలల్లో పోస్టుల భర్తీ పూర్తి చేయాలని కూడా స్పష్టం చేశారు. అయితే, దేవదాయ, ఆర్థిక శాఖ నిర్లక్ష్యంతో పోస్టుల భర్తీ ఫైల్ అటకెక్కింది.

సీఎం మాట.. బేఖాతరు!

దేవదాయ పోస్టుల భర్తీకి సంబంధించి సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వచ్చిన ఫైల్‌పై కూడా ఆర్థిక శాఖ ఉదాసీనంగా వ్యవహరించడం పట్ల సిబ్బంది విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సీఎం ఆదేశాల మేరకు ఆర్థిక శాఖకు ఫైల్ పంపించేమనే నిర్లక్ష్య ధోరణిలో దేవదాయశాఖ అధికారులు ఉండడం గమనార్హం. ఇక, ఆర్థిక శాఖలోనూ అదే పరిస్థితి. దీంతో 2 శాఖల మధ్య సమన్వయం లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇదిలావుంటే, దేవదాయ శాఖలో ఖాళీలు భర్తీ చేయడం వల్ల, కొత్తగా ఉద్యోగాలు కల్పించడం వల్ల ఆర్థికశాఖపై ఎలాంటి భారం ఉండదు. ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర అలవెన్సులు మొత్తం ఆలయాల నుంచి వచ్చే నిధుల ద్వారానే అందిస్తారు. సీఎం చెప్పిన వెంటనే దేవదాయ శాఖ ఫైల్ సిద్ధం చేసి, ఆర్థిక శాఖ అనుమతిచ్చి ఉంటే ఇప్పటికే దాదాపు 300 మంది ఉద్యోగులు చేరేవారు. విద్య, ఆరోగ్యశాఖల మాదిరిగానే దేవదాయ శాఖకు కూడా ప్రత్యేక నియామకాల బోర్డును ఏర్పాటు చేస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

జేసీలు జీరో..

దేవదాయ శాఖలో జాయింట్ కమిషనర్(జేసీ) అనేది కీలక పోస్టు. ఆలయాల ఆస్తులు, లక్షల ఎకరాల భూములకు రక్షణ కల్పించాలంటే అదనపు కమిషనర్లు, జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్ల(డీసీ) పోస్టుల్లో రెగ్యులర్ అధికారులు ఉండాలి. ఇప్పుడు ప్రభుత్వం ఆఘమేఘాల మీద డీసీ పోస్టులు భర్తీ చేస్తేనే శాఖలో పరిపాలన మెరుగుపడుతుంది. ప్రస్తుతం శాఖలో పైనుంచి కింద వరకు ఇన్‌చార్జిలు, లేదంటే రెవెన్యూ అధికారులతో నింపేస్తున్నారు. డీసీ నియామకాలు, పదోన్నతులు లేకపోవడం వల్ల ఆర్జేసీల కొరత కూడా వేధిస్తోంది. శాఖలో 11 ఆర్జేసీ పోస్టులున్నాయి. డీసీ పోస్టులు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ చేయడం, ఏసీలకు డీసీ పదోన్నతులు కల్పిస్తే, ఆ తర్వాత రెండేళ్లకు వారికి ఆర్జేసీగా పదోన్నతులు లభిస్తాయి. ప్రస్తుతం దేవదాయ శాఖలో సత్యనారాయణమూర్తి, త్రినాథ్‌రావు, చంద్రశేఖర్ ఆజాద్‌లు మాత్రమే రెగ్యులర్ ఆర్జేసీలుగా ఉన్నారు. వీరిలో సత్యనారాయణ మూర్తి ఈ నెలలో రిటైర్ అవుతారు. త్రినాథ్‌రావు, ఏడీసీ చంద్రకుమార్ వచ్చే ఏడాది జనవరిలో రిటైర్ కాబోతున్నారు. ఇక మిగిలేది ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్. ఆయన కూడా ఏడీసీ చంద్రశేఖర్ రిటైర్ కాగానే ఏడీసీగా పదోన్నతి పొందుతారు. దీంతో శాఖలో జేసీ పోస్టులు జీరో అవుతాయి. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత వేగంగా ఏపీపీఎస్సీ ద్వారా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ చేస్తే కొంత వరకు సమస్య పరిష్కారమవుతుంది.

సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా..

దేవదాయ శాఖలో సిబ్బంది నియామకంపై సీఎం చంద్రబాబు ఆదేశించిన 6 నెలల తర్వాత ఖాళీల జాబితాను సిద్ధం చేసింది. ఈ ఏడాది మార్చి 8న ఫైల్ సిద్ధం చేసి పంపితే, అక్కడ కీలక అధికారి వద్ద 7 నెలలుగా ఈ ఫైల్ ఉండిపోయింది. మరోవైపు దాదాపు 300 పోస్టుల భర్తీకి అనుమతి కోరితే.. కేవలం 7 గ్రేడ్-3 ఈవోల భర్తీకి మాత్రమే ఆర్థిక శాఖ అనుమతిచ్చింది. వెంటనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది.

డీసీ నోటిఫికేషన్ ఏదీ?

దేవదాయ శాఖలో 29 డిప్యూటీ కమిషనర్(డీసీ) పోస్టులు ఉన్నాయి. వీటిలో 23 పోస్టులు పదోన్నతి ద్వారా 6 ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయాలి. 1996లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఏపీపీఎస్సీ ద్వారా 2 డీసీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నోటిఫికేషన్ విడుదల చేయలేదు. చాలా కాలం తర్వాత డీసీ పోస్టుల భర్తీకి సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా ఆర్థిక శాఖ అనుమతించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం డీసీ పోస్టుల భర్తీపై దృష్టి పెట్టకపోతే దేవదాయ శాఖలో అధికారుల కొరత మరింత తీవ్రం కానుందన్న వాదన వినిపిస్తోంది.

పారదర్శకంగా రెరా బాధ్యతలు

▸ స్థిరాస్తి వ్యాపారులకు రెరాలో నమోదు తప్పనిసరి
▸ రేపటి నుంచి అవగాహన సదస్సులు
▸ తొలుత తిరుపతి నుంచి : రెరా చైర్‌పర్సన్ శివారెడ్డి



అమరావతి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం, వినియోగదారుల రక్షణ కోసం.. ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీ రెరా) నిబద్ధతతో పనిచేస్తుందని ఆ సంస్థ చైర్‌పర్సన్ ఆరె శివారెడ్డి అన్నారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లో ఏదైనా స్థలాలు, అపార్ట్‌మెంట్లు, భవనాల అమ్మకాలు, కొనుగోలు, మార్కెటింగ్.. చేపట్టే ముందు రెరా అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. అవసరమైన పత్రాలు సమర్పించిన తర్వాతే అనుమతులు జారీ చేస్తామని, అలాగే మోసపూరితమైన వాగ్దానాలపైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గుంటూరు జిల్లా రాయపూడిలోని సీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ఏపీ రెరా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రియల్ ఎస్టేట్ చట్టంపై విస్తృత అవగాహన కల్పించేందుకు ఏపీ రెరా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ప్రతి నెలా ఒక జిల్లాలో సదస్సులు నిర్వహిస్తామన్నారు. తొలుత ఈ నెల 10న తిరుపతి జిల్లాలో ప్రారంభిస్తామని తెలిపారు.

1,011 దరఖాస్తుల్లో 731కి అనుమతులు..

ఏపీ రెరా డైరెక్టర్ నాగసుందరి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈ ఏడాది జనవరి నుంచి అందిన 1,011 దరఖాస్తుల్లో 731కి అనుమతులు మంజూరు చేశామని చెప్పారు. ఏపీ రెరా నూతన పాలకవర్గం ఏర్పడిన గత రెండు నెలల్లో 214 ప్రాజెక్టులు, 27 మార్కెటింగ్ ఏజెన్సీల ఏజెంట్లు రిజిస్టర్ అయ్యారన్నారు. 500 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో లేదా ఎనిమిది యూనిట్ల కంటే ఎక్కువ ఉన్న అన్ని భవన నిర్మాణాలకు రెరా నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరని స్పష్టం చేశారు. రెరాలో నమోదు కాని ప్రాజెక్టులకు, నిర్దేశిత గడువులోగా పూర్తిచేయని ప్రాజెక్టులకు నోటీసులు ఇస్తామని చెప్పారు. ప్రాజెక్టుల నమోదుకు, ఫిర్యాదులకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని చెప్పారు.

పంట వ్యర్థాలను తగలబెట్టొద్దు

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులు పంట వ్యర్థాలను తగలబెట్టకుండా, పొలాల్లో కలియదున్నాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సూచించారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల సూక్ష్మజీవులు నశించడం, నేల తేమను నిలుపుకొనే శక్తిని కోల్పోవడం, భూమిలోని సేంద్రీయ కర్బనం తగ్గడం, నేలలో ఆమ్ల గుణం పెరగడంతోపాటు పొగ వల్ల మనుషుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల వచ్చే పొగతో పర్యావరణానికి, పౌరసమాజానికి కలిగే హానిపై రైతులకు అవగాహన కల్పించాలని క్షేత్ర స్థాయి సిబ్బందిని ఆదేశించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

నటిపై లైంగిక దాడి కేసు.. నిర్దోషిగా దిలీప్



ప్రముఖ మలయాళ నటిపై లైంగిక దాడి కేసులో నిందితుల్లో ఒకరైన నటుడు దిలీప్‌ను కేరళలోని ఎర్నాకుళం కోర్టు సోమవారం నిర్దోషిగా తేల్చింది. దిలీప్‌పై ఉన్న అభియోగాన్ని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని ధర్మాసనం పేర్కొంది. దిలీప్‌తో పాటు మరో ముగ్గురిని నిర్దోషులుగా తీర్మానించింది. అత్యాచారం, కుట్ర వంటి తదితర నేరాల కింద మరో ఆరుగురిని న్యాయస్థానం దోషులుగా తేల్చింది. ఈనెల 12న జరిగే తదుపరి విచారణలో దోషులకు శిక్షను ఖరారు చేయనుంది. కాగా, 2017 ఫిబ్రవరి 17న తెలుగు, తమిళ, మలయాళ సినిమాల్లో నటించిన ఓ ప్రముఖ నటిని కొచ్చిలో దుండగులు కిడ్నాప్ చేశారు. దాదాపు రెండు గంటలపాటు ఆమెను కారులో వేధించారు. ఈ విషయంలో 10 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అందులో దిలీప్ కూడా ఒకరు. వారిపై కిడ్నాప్, లైంగిక వేధింపులు, గ్యాంగ్ రేప్, ఉద్దేశపూర్వకంగా ఆధారాలను చెరిపివేయడం వంటి అభియోగాల కింద కేసులు నమోదయ్యాయి. 2017 ఏప్రిల్‌లో తొలి ఛార్జిషీట్ నమోదు చేశారు. ఆ ఏడాది జూలైలో పోలీసులు దిలీప్‌ను అరెస్టు చేశారు. అదే ఏడాది అక్టోబరులో బెయిలుపై బయటికి వచ్చారు. ఈ కేసులో తనకెలాంటి ప్రమేయం లేదని చెప్తూ వచ్చిన దిలీప్.. తాజాగా కోర్టు తీర్పుపై స్పందించారు. 'ఇది నాపై జరిగిన కుట్ర. నాకు మద్దతుగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు. దాదాపు ఎనిమిదిన్నర ఏళ్ల పాటు సాగిన ఈ కేసు అనేక మలుపులు తిరిగింది.



విజయవంతం అవ్వాలి



రానా దగ్గుబాటి

'మన ప్రేక్షకులకు టీవీ తప్పితే ఓటీటీలు పరిచయం లేని కాలంలో నేను 'చాయ్ బిస్కట్' వ్యవస్థాపకులు శరత్, అనురాగ్‌ను కలిశాను. వీళ్లకున్న ప్రతిభ, తెలివితేటలు, దృక్పథం అపారమైనవి. వీరు ప్రారంభించిన ఈ ప్రయాణం అందరికీ ఎంతో మేలు చేస్తుంది. నేను ఈ కొత్త ప్రయత్నానికి ఎల్లప్పుడూ తోడ్పాటును అందిస్తాను' అని రానా దగ్గుబాటి అన్నారు. తెలుగు డిజిటల్ ఎంటర్టైన్‌మెంట్ సంస్థ చాయ్ బిస్కట్.. దేశంలోనే తొలి ప్రాంతీయ షార్ట్ సిరీస్ వేదిక 'చాయ్ షాట్స్'ను సోమవారం ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రానా మాట్లాడుతూ 'ఇందులో ఉన్న కంటెంట్ సినిమాల్లాగే విజయవంతం కావాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు. 'ఇది మా జీవితంలో కొత్త ఛాప్టర్. భావోద్వేగాలకి కనెక్ట్ కావడం మనం కథల నుంచే నేర్చుకున్నాం. కథలు మన జీవితంలో ముఖ్యభాగం' అని శరత్ తెలిపారు. 'మేము చేసిన ఈ ప్రయత్నం అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం' అని అనురాగ్ పేర్కొన్నారు. 'రెండు నిమిషాల లోపు కథలను కొత్తగా చెప్పేలా కంటెంట్ క్రియేటర్లను ప్రోత్సహించే ఈ యాప్ అందరికీ చేరువవుతుంది. భారత దేశంలో వినోదం విభాగంలో ప్రభంజనాన్ని సృష్టిస్తుంది' అని నిర్మాత వై.రవిశంకర్ అన్నారు.

కన్నీరు పెట్టుకున్న సల్మాన్ ఖాన్



'హిందీ బిగ్‌బాస్ 19' ఫైనల్ వేదికపై వ్యాఖ్యాత సల్మాన్ ఖాన్ కన్నీరుమున్నీరయ్యారు. బాలీవుడ్ సీనియర్ నటుడు ధర్మేంద్రను గుర్తు చేసుకొని వెక్కివెక్కి ఏడ్చారు. గతంలో బిగ్‌బాస్ షోలో ధర్మేంద్ర పాల్గొన్న వీడియోను ప్రదర్శించగా సల్మాన్ భావోద్వేగానికి గురయ్యారు. 'డిసెంబరు 8వ తేదీ ధర్మేంద్రజీ పుట్టిన రోజు. మా అమ్మ పుట్టిన రోజు కూడా ఈరోజే. నా తండ్రి పుట్టిన రోజున(నవంబరు 24) ధర్మేంద్రజీ మరణించారు. మనం హీ-మ్యాన్‌ను కోల్పోయాం ఆయనకంటే గొప్పవారు ఎవరూ లేరు' అంటూ ధర్మేంద్రతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీరు పెట్టుకున్నారు.

సినిమాలు చేయడం ఆపేద్దామనుకున్నా

కృతి శెట్టి

'ఉప్పెన' సినిమాలో బేబమ్మగా కుర్రకారు హృదయాలను కొల్లగొట్టిన కృతి శెట్టి నటించిన తాజా చిత్రం 'అన్నగారు వస్తారు'. ఈ నెల 12న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఆమె.. పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. కెరీర్ తొలినాళ్లను గుర్తుచేసుకున్నారు. సోషల్ మీడియాలో ట్రోలింగ్ వల్ల చాలా ఇబ్బందులకు గురైనట్లు తెలిపారు. 'నేను నటించిన తొలి సినిమా 'ఉప్పెన' నా జీవితాన్ని మార్చేసింది. ఆ సినిమా నుంచి చాలా నేర్చుకున్నాను. ఎప్పుడూ ఇది చేయడం కష్టం అని చెప్పలేదు. కానీ నటిగా సినిమాల విషయంలో నాకంటూ కొన్ని అంచనాలు ఉన్నాయి. దాంతో ఒత్తిడి ఉండేది. ఆ ఒత్తిడి వల్ల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నాను. దాంతో నా తల్లిదండ్రులు 'కష్టంగా ఉంటే సినిమాలు మానేయి' అని సలహా ఇచ్చారు. దీంతో సినిమాలు చేయడం మానేద్దాం అనుకున్నాను. కానీ 'ఉప్పెన' సినిమాతో వచ్చిన ప్రేక్షకాదరణతో ఇక వెనుదిరిగి చూసుకోలేదు' అని చెప్పారు. కార్తీ కథానాయకుడిగా నటించిన 'అన్నగారు వస్తారు' చిత్రాన్ని నలన్ కుమారస్వామి తెరకెక్కించారు.

ఎన్టీఆర్ వ్యక్తిగత హక్కులు కాపాడండి

● మూడు రోజుల్లో చర్యలు తీసుకోండి
● సోషల్ మీడియా, ఈ - కామర్స్ ప్లాట్‌ఫామ్‌లకు ఢిల్లీ హైకోర్టు ఆదేశం



జూనియర్ ఎన్టీఆర్ వ్యక్తిగత హక్కులు కాపాడాలని సోషల్ మీడియా, ఈ - కామర్స్ ప్లాట్‌ఫామ్‌లను ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. మూడురోజుల్లో చర్యలు తీసుకోవాలని తేల్చి చెప్పింది. తన వ్యక్తిగత హక్కుల ఉల్లంఘన, పరువునష్టం కలిగించే అంశాల నుంచి ఉపశమనం కల్పించాలని జూనియర్ ఎన్టీఆర్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన తరపున న్యాయవాది శివ్ వర్మ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరా నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం విచారించింది. జూనియర్ ఎన్టీఆర్ తరపున సీనియర్ న్యాయవాది జె సాయి దీపక్ వాదనలు వినిపించారు. ఈ -కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియా సంస్థల్లో అనేక విషయాలు జూనియర్ ఎన్టీఆర్ హక్కులను ఉల్లంఘించేలా ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పరువుకు భంగం కలిగించేలా జరుగుతున్న చర్యలను తీవ్రంగా పరిగణించాలని కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఇంటర్ మీడియేటర్ గైడ్‌లైన్స్, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) - 2021 నిబంధన ప్రకారం.. జూనియర్ ఎన్టీఆర్ దావాను ఫిర్యాదుగా పరిగణిస్తున్నట్టు తెలిపింది. ఫిర్యాదుపై మూడురోజుల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ ఈ - కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియా సంస్థలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ డిసెంబర్ 22కు వాయిదా వేసింది.

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి)

ఆకట్టుకునేలా...



కిరణ్, అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'ఆర్కే దీక్ష'. బీఎస్ రెడ్డి సమర్పణలో ఆర్కే ఫిల్మ్స్, సిగ్గ క్రియేషన్స్ బ్యానర్‌పై డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను హీరో సుమన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమాలో దేశ సైనికుల గురించి గొప్పదనాన్ని తెలిపేలా అద్భుతమైన పాట ఉంది. సినిమాలోని ప్రతీ సన్నివేశం ఆకట్టుకుంటుంది' అని అన్నారు. ఆర్ కే గౌడ్ మాట్లాడుతూ 'ఈ చిత్రం నాకెంతో ప్రత్యేకం. అందరి హృదయాలను బరువెక్కించే భావోద్వేగాలు ఈ సినిమాలో ఉన్నాయి. విజయంపై నమ్మకముంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్, నిర్మాతల మండలి కార్యదర్శి తుమ్మల ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆద్యంతం నవ్వించే కథ



తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బ ప్రధాన పాత్రధారులుగా నూతన దర్శకుడు ఏ.ఆర్.సజీవ్ తెరకెక్కిస్తోన్న విలేజ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఎస్.ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బేనర్లపై సృజన్ యరబోలు, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ శనివరపు, కిశోర్ జాలాది, బాల సౌమిత్రి నిర్మిస్తున్నారు. జనవరి 23న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. సోమవారం నిర్వహించిన వేడుకలో టీజర్‌ను మేకర్స్ ఆవిష్కరించారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ టీజర్‌లో..స్వార్థపూరిత స్వభావం గల ధనవంతుడైన చేపల వ్యాపారి అంబటి ఓంకార్ నాయుడి చుట్టూ కథ సాగుతుంది. కార్యక్రమంలో తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ 'ఈ సినిమాతో బ్రహ్మాజీకి మంచి పేరు వస్తుంది. ఈ సినిమా గోదావరి యాస, సాంస్కృతికి అద్దం పడుతూ గొప్ప అనుభూతిని ఇవ్వడంతో పాటు ఆద్యంతం నవ్వులు పంచుతుంది' అని అన్నారు.

రాజమండ్రి నాది.. వరంగల్ నాది

- తరుణ్ భాస్కర్

హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో అమర గాయకుడు ఎస్పీ బాల బాలసుబ్రహ్మణ్యం విగ్రహ ప్రతిష్ఠ వివాదంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు తరుణ్ భాస్కర్ స్పందించారు. 'ఈ విషయంలో నా అభిప్రాయాన్ని తెలియజేస్తా.. పాలన పరంగా మనం వేరుగా ఉండొచ్చు. సంస్కృతి, సంప్రదాయాల పరంగా మాత్రం మనమంతా ఒక్కటే. ఆంధ్రా, తెలంగాణ అని కాకుండా మనదేశంలో గొప్ప నటులు, టెక్నీషియన్లు ఉన్నారు. రెండు రాష్ట్రాల నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందాను. రాజమండ్రి నాది..వరంగల్ నాది... సినిమా ద్వారా అందరికీ ప్రేమను పంచుదాం' అని అన్నారు.

అద్భుతమైన సినిమా



క్రాంతి, అవితేజ్, ప్రదీప్, సుపర్ణ, పవని ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఫెయిల్యూర్ బాయ్స్'. వెంకటత్రినాథ్ రెడ్డి ఉసిరిక దర్శకత్వంలో వీఎస్ఎస్‌కుమార్, ధనశ్రీనివాస్ జామి, లక్ష్మీ వెంకట్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నటుడు బాబు మోహన్ మాట్లాడుతూ 'సినిమా అద్భుతంగా ఉండబోతోంది. సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'ప్రేక్షకులను ఆకట్టుకునే ఫీల్‌గుడ్ చిత్రమిది' అని వెంకటత్రినాథ్ రెడ్డి ఉసిరిక చెప్పారు.

ఊహించని చీకటి ప్రపంచం



త్రిగుణ్, 'రాజువెడ్స్ రాంబాయి' ఫేమ్ అఖిల్‌రాజ్, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన హారర్ థ్రిల్లర్ 'ఈశా'. నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమవేంకటేశ్వర రావు నిర్మించారు. బన్నీ వాస్ వర్క్స్, వంశీ నందిపాటి ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్స్‌పై బన్నీ వాసు, వంశీ నందిపాటి చిత్రాన్ని ఈ నెల 12న విడుదల చేస్తున్నారు. సోమవారం ఈ చిత్రం ట్రైలర్‌ను లాంచ్ చేశారు. 'మీరు ఊహించని చీకటి ప్రపంచం మరొకటి ఉంది' అనే సంభాషణతో మొదలైన ట్రైలర్ ఆకట్టుకుంది.

దూసుకొస్తున్న బుల్లెట్ ట్రైన్..!



భారీ స్థాయిలో నిర్మాణం పూర్తి చేసుకుంటున్న రైల్వే స్టేషన్

2026 నాటికి ట్రాక్ పనులు పూర్తి.. 2027లో ట్రయల్ రన్

- అహ్మదాబాద్-ముంబై వాణిజ్య కారిడార్‌లో చకచకా ఏర్పాట్లు
- 508 కిలోమీటర్ల దూర ప్రయాణం 2.07 గంటల్లోనే పూర్తి
- గంటకు 320 కి.మీ. వేగం.. దీని కోసం ప్రత్యేక స్టేషన్లు
- వివరాలు వెల్లడించిన ఎన్‌హెచ్ఆర్‌సీఎల్



సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్న రైల్వే స్టేషన్

(అహ్మదాబాద్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మెరుపు వేగంతో దూసుకెళ్లే బుల్లెట్ ట్రైన్లను చూస్తుంటే భలే క్రేజీగా ఉంటుంది.! జపాన్, చైనా.. ఎప్పుడో అందిపుచ్చుకున్న ఈ టెక్నాలజీ మన దేశానికి కూడా వస్తే బాగుండనిపిస్తుంది.! ఎన్నో ఏళ్లుగా భారతీయులను ఊరిస్తున్న ఈ బుల్లెట్ ట్రైన్ త్వరలోనే భారత్‌కు దూసుకురానుంది. అహ్మదాబాద్-ముంబై వాణిజ్య కారిడార్ మధ్య చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో భాగంగా 2027 ఆగస్టులో తొలిసారిగా ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. 2029 ఏడాది చివరినాటికి దీన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు. దీంతో దేశ ప్రజల చిరకాల వాంఛ నెరవేరనుంది.

2018లోనే శ్రీకారం..

ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టుకు 2018లోనే రూపకల్పన జరిగింది. దీనికోసం ఇప్పటికే 100 శాతం భూసేకరణ జరిగింది. రైల్వే స్టేషన్లు, ట్రాక్‌ల నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గంటలకు 320 కి.మీ. వేగంతో దూసుకెళ్లే బుల్లెట్ ట్రైన్ కోసం ప్రత్యేకంగా గుజరాత్‌లో 8 స్టేషన్లు, మహారాష్ట్రలో 4 స్టేషన్లు నిర్మిస్తున్నారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే సబర్మతి నుంచి ముంబైకి 2 గంటలా 7 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. ఈ రైలు సబర్మతిలో బయల్దేరి అహ్మదాబాద్, వడోదర, భరూచ్, సూరత్, బిల్‌మోర, వాపి, బొయిసార్, విరార్, థానే మీదుగా ముంబైకి చేరుకుంటుంది. భారత్‌లో బుల్లెట్ ట్రైన్ వేగాన్ని గంటకు 350 కి.మీ.కే పరిమితం చేస్తున్నప్పటికీ.. 500 కి.మీ. వేగంతో దూసుకెళ్లినా తట్టుకునేలా ట్రాక్‌ను సిద్ధం చేస్తున్నారు. 2026 మార్చి నాటికి ట్రాక్ పనులు పూర్తవుతాయి. 2027 ఆగస్టులో సబర్మతి నుంచి బిల్మోరా వరకు ట్రయల్ రన్ నిర్వహిస్తారు. ట్రయల్‌రన్ విజయవంతమైతే గంటకు 320 కి.మీ. వేగంతో బుల్లెట్ ట్రైన్‌ను సబర్మతి-ముంబై మధ్య నడుపుతారు.

జపాన్ సాంకేతికతతో ట్రాక్..

బుల్లెట్ ట్రైన్ కోసం జపాన్ సాంకేతికతతో వయాడక్ట్ ట్రాక్ వేస్తున్నారు. దీనికోసం నదులపై ప్రత్యేకంగా బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు. మొత్తం 508 కిలోమీటర్ల దూరానికి 8 కిలోమీటర్లు మాత్రమే నేలపై ట్రాక్ వేస్తున్నారు. కొండలను తవ్వి 8 టన్నెళ్లను ఏర్పాటు చేశారు. మిగిలిన దూరమంతా మెట్రో రైలు తరహాలో పిల్లర్లమీదే ట్రాక్ వేస్తారు. మెట్రో రైళ్ల కోసం యాజమాన్య నిర్వహణ సంస్థలు పత్యేకంగా ట్రాక్‌లు, స్టేషన్లను నిర్మిస్తున్నాయి. కానీ ఇవి ఇతర రైల్వే స్టేషన్లకు అనుసంధానంగా ఉండటం లేదు. కానీ, బుల్లెట్ ట్రైన్ కోసం మెట్రో, సాధారణ రైల్వే స్టేషన్లను కలిపేలా ప్రత్యేక స్టేషన్లను నిర్మిస్తున్నారు. అహ్మదాబాద్-ముంబై హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు కోసం జపాన్ సాంకేతిక సహకారం అందిస్తోంది. రూ.1,08,000 కోట్లలో 81 శాతం నిధులను జపాన్ ప్రభుత్వ బ్యాంకు జైకా అందిస్తోంది. ఆర్థిక సహకారం, సాంకేతిక నైపుణ్యం మినహా.. స్టేషన్లు, ట్రాక్‌ల నిర్మాణాలకు స్వదేశీ మానవ వనరులనే ఉపయోగిస్తున్నారు. ఎల్ అండ్ టీ దీనికి సహకారం అందిస్తోంది. ఈ ప్రాజెక్టులో 30,000 మంది పని చేస్తున్నారు.

బుల్లెట్ ట్రైన్ స్టేషన్ల ప్రత్యేకతలు...

బుల్లెట్ ట్రైన్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న స్టేషన్లను.. మెట్రో, రైల్వే స్టేషన్లను అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్నారు. మెట్రో, రైల్వే స్టేషన్ల నుంచి నేరుగా బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌కు వెళ్లేందుకు వీలుగా ర్యాంపులు, వంతెనలు, మూవింగ్ వాక్ ట్రాక్‌లూ, ఎస్కలేటర్లను నిర్మిస్తున్నారు. ప్రయాణికుల కోసం 700 సీట్లతో కూడిన వెయిటింగ్ హాల్‌తో పాటు బిజినెస్ మీటింగ్‌లు ఏర్పాటు చేసుకునే సదుపాయం కూడా కల్పిస్తున్నారు. ఎనిమిది అంతస్తుల్లో నిర్మించే ఈ స్టేషన్లలో మార్కెట్, సినిమా హాల్, కాన్ఫరెన్సు హాల్, 5స్టార్ హోటల్‌ను నిర్మిస్తున్నారు.

దేశ ఆర్థిక గమనాన్ని మార్చేస్తుంది



సబర్మతి-ముంబై బుల్లెట్ ట్రైన్ దేశ ఆర్థిక గమనాన్నే మార్చేస్తుందని అహ్మదాబాద్ నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఆర్‌సీఎల్) ప్రిన్సిపాల్ ప్రాజెక్టు మేనేజర్ రాజేశ్ అగర్వాల్ వెల్లడించారు. సోమవారం ఆయన అమరావతి నుంచి ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) తరఫున అహ్మదాబాద్ వచ్చిన మీడియా ప్రతినిధులకు వివరాలు వెల్లడించారు. 2027 ఆగస్టు నాటికి దేశంలోని మొట్టమొదటి బుల్లెట్ ట్రైన్ ట్రయల్ రన్ నిర్వహిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా తొలుత రెండు బుల్లెట్ ట్రైన్లను జపాన్ అందిస్తుందన్నారు. దేశంలో మొత్తంగా 26 బుల్లెట్ ట్రైన్లను నడపాలనే ప్రణాళిక ఉందని చెప్పారు.



కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావేశమైన మంత్రి నాదెండ్ల మనోహర్

వచ్చే నెల నుంచి రాష్ట్రానికి గోధుమలు, రాగులు

- క్యూఆర్ కోడ్ ఆధారిత బియ్యం సరఫరా: మంత్రి నాదెండ్ల

న్యూఢిల్లీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల నుంచి రాష్ట్రానికి గోధుమలు, అదనపు రాగులు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందని రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర ఆహార, పౌరసరఫరాలు, ప్రజాపంపిణీ శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషితో మనోహర్ భేటీ అయ్యారు. అనంతరం ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రేషన్ బియ్యం నిల్వ కోసం రాష్ట్రంలో ఎఫ్‌సీఐ నుంచి అదనపు గోదాంలు ఏర్పాటుకి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అంగీకరించారని తెలిపారు. గతేడాది రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి.. 41 వేల ప్రభుత్వ పాఠశాలలు, 4 వేల సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం బియ్యం సరఫరాను పర్యవేక్షించేందుకు క్యూఆర్ కోడ్ ఆధారిత ట్రాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. తాము విజయవంతంగా అమలు చేస్తున్న విధానం గురించి కేంద్రానికి నివేదించగా.. వచ్చే నెల నుంచి పీడీఎస్ బియ్యం సరఫరాకు క్యూఆర్ ట్యాగ్ వినియోగించేందుకు పైలట్ ప్రాజెక్టుగా ఏపీకి కేంద్రం అనుమతి ఇచ్చిందని వెల్లడించారు. దీని ద్వారా బియ్యం అక్రమ రవాణాను అరికట్టవచ్చని తెలిపారు.

విద్యుత్, సీడ్ బిల్లులు ఉపసంహరించాలి: సీపీఐ

విజయవాడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన విద్యుత్ బిల్లు, సీడ్ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలి. రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా చట్టాలు తీసుకురావాలి' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి ప్రసాద్ సోమవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. 'ప్రభుత్వాలు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయడంలో విఫలమయ్యాయి. రంగు మారిందని, తాలు, తప్పలు ఉన్నాయని ధాన్యం కొనుగోలు చేయకుండా కొర్రీలు పెడుతున్నారు. క్షేత్రస్థాయిలో వరి రైతులు ఇబ్బంది పడుతుంటే మంత్రి నాదెండ్ల పర్యటనలకే పరిమితమౌవుతున్నారు. పత్తి రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న అన్ని జిల్లా కేంద్రాలు, గుంటూరులోని సీసీఐ కార్యాలయం వద్ద ఆందోళనలు నిర్వహించాలి' అని ఈశ్వరయ్య, ప్రసాద్ పిలుపునిచ్చారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టాలి

శ్రీశైలం ప్రాజెక్టు ప్రమాదంలో ఉందని, దానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం సీఎం చంద్రబాబుకి లేఖ రాశారు. ప్లంజ్ పూల్ వద్ద ఏర్పడిన గొయ్యికి తక్షణ మరమ్మతులు చేపట్టాలని కోరారు. దెబ్బతిన్న 62 సిలిండర్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఐఏఎస్ ఆమ్రపాలికి హైకోర్టులో ఎదురుదెబ్బ

హైదరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): క్యాడర్ వివాదంలో ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలికి సోమవారం హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆమెను తెలంగాణకు కేటాయించాలంటూ ఈ ఏడాది జూన్‌లో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం (డీవోపీటీ) అఖిలభారత సర్వీసుల అధికారులను తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు కేటాయించింది. దీన్ని సవాలు చేస్తూ క్యాట్‌ను ఆశ్రయించిన పలువురు అధికారులు అనుకూలంగా ఉత్తర్వులు పొందారు. ఆమ్రపాలిని తెలంగాణకు కేటాయించాలని జూన్‌లో క్యాట్ ఆదేశాలిచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ డీవోపీటీ హైకోర్టులో చేసిన అప్పీలుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. క్యాట్ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. వివరణ ఇవ్వాలని ఆమ్రపాలికి నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.

ప్రోత్సాహకాలు చెల్లించాలి: దళిత పారిశ్రామికవేత్తలు

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దళిత పారిశ్రామికవేత్తలు సోమవారం ఏపీఐఐసీ భవన్ వద్ద ఆందోళనకు దిగారు. పరిశ్రమల శాఖ అధికారుల వివక్షను నిరసిస్తూ నినాదాలు చేశారు. ప్రభుత్వం విడుదల చేసినా... పారిశ్రామిక పోత్సాహకాల సొమ్మును తమకు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన గేటు, భవన ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించి ఆందోళనకు దిగారు. పోత్సాహకాలు చెల్లించేవరకూ కదిలేది లేదని హెచ్చరించారు. పరిశ్రమలశాఖ అడిషనల్ డైరెక్టరు రామలింగరాజుతో చర్చలు జరిపారు. ప్రోత్సాహకాలు చెల్లించేవరకూ ఏపీఐఐసీ వద్దే ఆందోళన కొనసాగిస్తామని తెగేసి చెప్పారు. కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల జేఏసీ నాయకులు నాయకత్వం వహించారు.



ఏపీఐఐసీ భవనం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత పారిశ్రామిక వేత్తలు

రెవెన్యూ రాంగ్ రూటు!

(మొదటిపేజీ తరువాయి)

టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు. ముఖ్యమంత్రి చంద్రబాబు గత ఏడాది జరిగిన తొలి కలెక్టర్ల సదస్సులో, మార్చిలో జరిగిన మరో కలెక్టర్ల సదస్సులో 'టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని రెవెన్యూ శాఖను ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు కబ్జాచేసిన వారు, అక్రమార్కులకు కొమ్ముకాసిన రెవెన్యూ అధికారులు, భూ దందాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఏడాదిన్నర అవుతున్నా ఆ శాఖ పట్టించుకోలేదు. టాస్క్ లేదు... ఫోర్స్ లేదు! దీంతో భూ అక్రమార్కులు, వారికి కొమ్ము కాసిన అధికారులు భద్రంగా ఉన్నారు. విచారణలు, చర్యల ఊసే లేదు.

కబ్జా నిరోధక చట్టం-2024 ఏమైంది?

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే గత ఏడాది నవంబరు 14న భూ కబ్జాలను నిరోధించేందుకు కొత్త చట్టం చేస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రం ఆమోదానికి పంపించింది. ఏడాది దాటినా ఆ బిల్లు పరిస్థితి ఎంతదాకా వచ్చిందో ఎవ్వరికీ తెలియదు. ఈ బిల్లు గురించి ముఖ్యమంత్రి ప్రతి సమావేశంలో ఆరాతీస్తున్నారు. అయినా ఫలితం లేదు. కబ్జాకోరులను కట్టడి చేసేందుకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెచ్చిన బిల్లుకు కేంద్రం నుంచి ఆమోదం పొందలేకపోయారు. ఇక భూముల కబ్జాపై వస్తున్న పిటిషన్‌లను రెవెన్యూ శాఖ ఏం పరిష్కరిస్తుంది?

తిరస్కారమే...పరిష్కారం

రైతులు, భూ యజమానుల పట్ల చేసిన దురాగతాలు, అన్యాయాలు, అక్రమాలే వైసీపీ ఓటమికి ప్రధాన కారణమయ్యాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొనే కూటమి సర్కారు వచ్చీ రాగానే గ్రామగ్రామానా రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. తమ సమస్యలు పరిష్కరించాలని రైతులు 2.83 లక్షల పిటిషన్లు సమర్పించారు. ఇవి కాకుండా ప్రతీ సోమవారం ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. అన్నీ కలిపితే... ఇప్పటికి భూ సమస్యలపైనే 4.82 లక్షలపైనే దరఖాస్తులు వచ్చాయి. మ్యుటేషన్‌లపై 98 వేలు, భూముల విస్తీర్ణంలో తేడాలపై 96 వేలు, రెవెన్యూ రికార్డుల్లో తప్పులు సరిదిద్దాలంటూ 78వేలు, ల్యాండ్ పార్సిల్‌ను విభజించాలని 56 వేలు, పాసుపుస్తకాలే ఇవ్వలేదంటూ 33 వేల దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిష్కరించామని రెవెన్యూశాఖ సర్కారుకు నివేదించింది. కానీ, అవే అంశాలపై మళ్లీ మళ్లీ ఫిర్యాదులు రాగా, కొన్ని కేసులను తిరిగి ఓపెన్ చేశారు. అందులో రెవెన్యూ రికార్డుల్లో తప్పులు ఉన్నాయని 12,800... విస్తీర్ణంలో తేడాలపై 32,806... మ్యుటేషన్లపై 11,408 ఫిర్యాదులు ఉన్నాయి. అవి అసలు పరిష్కారమే కాలేదని రైతులు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)కు ఇచ్చిన వివరాల ఆధారంగా బయటపడింది. భూములు కబ్జాచేశారన్న ఫిర్యాదులు కూడా పరిష్కరించామని రెవెన్యూశాఖ రెడీమేడ్ లెక్కలు చెప్పింది. కానీ, ఆ ఫిర్యాదులను తిరిగి ఓపెన్‌చేస్తే 760కిపైగా పరిష్కారమే కాలేదని తేలింది.

ఎందుకీ దుస్థితి?

ప్రజా ఫిర్యాదులు ఎన్ని ఉన్నాయి? అందులోని అంశాలు ఏమిటి? అనేది గతంలో ప్రభుత్వ పెద్దలు, అధికారులకు తప్ప బయటి ప్రపంచానికి తెలిసేది కాదు. ఇప్పుడు ప్రజా ఫిర్యాదులను ప్రభుత్వం ఆన్‌లైన్‌లోకి తీసుకొచ్చింది. వాటికోసం ప్రత్యేకంగా పీజీఆర్ఎస్ విధానం అమలు చేస్తోంది. దీంతో గ్రామం, మండలం, జిల్లా, శాఖల వారీగా ఎన్ని పిటిషన్లు వచ్చాయి? అందులో ఎన్ని పరిష్కరించారు? ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో అంతా ప్రజలకు తెలిసిపోతుంది. సహజంగానే పెండింగ్ పిటిషన్లు ఉన్న శాఖలు, జిల్లాల కలెక్టర్‌లు, అధికారులను ప్రభుత్వం ప్రశ్నిస్తోంది. దీంతో వారిపై పీజీఆర్ఎస్ ఒత్తిడి ఉంటోంది. కొందరు అధికారులు, విభాగాధిపతులు ఈ ఒత్తిడిని తట్టుకోలేక వేలాది పిటిషన్‌లను పరిష్కరించినట్లుగా చూపిస్తూ అడ్డగోలుగా మూసివేస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. మూసివేసిన ఫిర్యాదులను తిరిగి విచారణ కు ఓపెన్ చేసినపుడు అధికారులు, శాఖల నిర్వాకం బయటపడుతోంది. ప్రభుత్వం ప్రశ్నించకూడదన్న ఏకైక కారణంగా... తిరస్కారాన్నే పరిష్కారంగా చూపిస్తున్నారని స్పష్టమవుతోంది.

8.76 లక్షల పిటిషన్ల మాటేమిటి?

గ్రామ రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్, ఇంకా ప్రతి సోమవారం ప్రభుత్వానికి వచ్చే ఫిర్యాదులు ఒక ఎత్తు! జగన్ సర్కారు భూముల సర్వే చేసిన 6వేల గ్రామాల్లో ఉన్న సమస్యలు మరో ఎత్తు! ప్రజల విజ్ఞప్తి మేరకు కూటమి సర్కారు ఆ 6 వేల గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రైతుల నుంచి పిటిషన్లు తీసుకుంది. అప్పట్లో ఏకంగా 8.76 లక్షల పిటిషన్లు వచ్చాయి. వీటిని తీసుకొని దాదాపు 8 నెలల కావొస్తోంది. ఇప్పటి వరకు రెవెన్యూ శాఖ ఓ స్పష్టమైన కార్యాచరణ చేపట్టలేదు. ఒక్క పిటిషన్ కూడా పరిష్కారం కాలేదు. ఇక జాయింట్ ఎల్‌పీఎమ్‌ల విభజన సంగతి దేవుడికే తెలియాలి!

ఫ్రీహోల్డ్‌పై అదే అనిశ్చితి...

ఫ్రీ హోల్డ్ అసైన్డ్ భూములు, షరతుగల పట్టా భూములు, గ్రామకంఠం, ఇంకా చుక్కల భూముల రిజిస్ట్రేషన్‌లను నిలిపివేసి 16 నెలలవుతోంది. ఈ సమస్య పరిష్కారం కోసం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి 10 నెలలైంది. ఇప్పటిదాకా పరిష్కారంపై ఓ స్పష్టత లేదు. డిసెంబరు నాటికి పరిష్కారం అని కమిటీ చెప్పింది. ఆ పుణ్యకాలం కాస్తా ముగుస్తోంది. ఇంకెంతకాలం నాన్చుతారన్న ఆందోళన, అసంతృప్తి ప్రజల్లో రగులుతున్నాయి.

సకల సమస్యలు రెవెన్యూలోనే...

ఇటీవల ప్రభుత్వానికి అంశాల వారీగా అందుతున్న ఫిర్యాదులు, వాటి పరిష్కారంపై ఆర్టీజీఎస్ ఓ నివేదిక తయారు చేసింది. టాప్-10లో... నేరాలకు సంబంధించిన అంశాన్ని వదిలేస్తే... మిగిలిన తొమ్మిది రెవెన్యూ శాఖకు సంబంధించినవే. టాప్-1లో రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్) అంటే పాస్ పుస్తకాలు, భూముల చట్టం అమలుకు సంబంధించిన ఫిర్యాదులే ఉన్నాయి. వీటి సంఖ్య 2,13,703. మొత్తం ఫిర్యాదుల్లో ఇవి 36 శాతం. ఇక రీ సర్వేపై 1,87,348 ఫిర్యాదులు (31.5 శాతం) వచ్చాయి.

రాష్ట్రంలో 1,566 స్క్రబ్ టైఫస్ కేసులు

- ఆ లక్షణాలతో ఇప్పటివరకు తొమ్మిది మంది మృతి
- మరణాలకు కారణాలపై పరిశోధన చేయాలి
- ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడి

అమరావతి, సత్తెనపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రాష్ట్రంలో ఇప్పటివరకు 1,566 స్క్రబ్ టైఫస్ పాజటివ్ కేసులు నమోదైనట్టు ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడించారు. ఈ లక్షణాలతో తొమ్మిది మంది మృతిచెందారని చెప్పారు. అయితే స్క్రబ్ టైఫస్ వల్లే ఈ మరణాలు సంభవించినట్టు ఇప్పటివరకూ నిర్ధారణ కాలేదని స్పష్టం చేశారు. ఆ మరణాలకు సరైన కారణాలు తెలుసుకునేందుకు పరిశోధన చేయాల్సి ఉందన్నారు. దీనికి 2-3 నెలల సమయం పట్టొచ్చని తెలిపారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మిగిలిన రాష్ట్రాలతో పోల్చితే ఏపీలో తక్కువ కేసులే నమోదయ్యాయని తెలిపారు. 2025లో ఇప్పటివరకూ కర్ణాటకలో 1,870, తమిళనాడులో 7,308, తెలంగాణలో 309 కేసులు బయటపడగా.. ఏపీలో 1,566 పాజటివ్ కేసులు నమోదైనట్లు వివరించారు. రాష్ట్రంలోని బోధనాస్పత్రులు, పీహెచ్‌సీల్లోనూ స్క్రబ్ టైఫస్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామని చెప్పారు.

స్క్రబ్ టైఫస్‌తో మరొకరు మృతి!

పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలతో ఒకరు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పది రోజుల క్రితం కొమెరపూడి గ్రామానికి చెందిన బత్తుల లూర్దమ్మ (64) జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చేరింది. స్క్రబ్ టైఫస్ లక్షణాలు కనిపించడంతో ఇక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కాగా, గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలో ఒకరిలో స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలు బయటపడ్డాయి. కూలి పనులు చేసుకుని జీవనం సాగించే ఓ వ్యక్తి ఈనెల 3న తీవ్ర అస్వస్థతకు గురికాగా వెనిగండ్ల పీహెచ్‌సీ వైద్యులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. అక్కడ ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించగా.. స్క్రబ్ టైఫస్ సోకినట్టు వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం ఆయన జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. వెనిగండ్లలో ఆరోగ్యశాఖ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు.



ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతున్న లావు శ్రీకృష్ణదేవరాయలు, పక్కన టీడీపీ ఎంపీలు

'ఇండిగో'పై కేంద్రం పకడ్బందీ చర్యలు

మంత్రి రామ్మోహన్ పార్లమెంటుకు, ప్రధానికీ జవాబుదారీ : సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'ఇండిగో సంక్షోభంపై కేంద్రం చర్యలు తీసుకుంటోంది. పరిస్థితిని చక్కదిద్దుతోంది' అని సీఎం చంద్రబాబు అన్నారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో దీనిపై మాట్లాడారు. 'అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కేంద్రం ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ నిబంధనలు అమలు చేసింది. విమాన ప్రయాణికుల భద్రత పెంచటంలో భాగంగా పైలెట్లకు, క్రూ సభ్యులకు విశ్రాంతి సమయం ఇచ్చేలా కేంద్రం వాటిని ప్రవేశపెట్టింది. వాటిని అర్థం చేసుకొని అమలు చేయడంలో ఇండిగో సంస్థ సరిగా వ్యవహరించలేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ ఘటనలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పార్లమెంటుకు, ప్రధానికి సమాధానం చెబుతారు. దీనిలో రాష్ట్ర సీఎంగా కానీ, టీడీపీ అధినేతగా కానీ నా పాత్రేమీ ఉండదు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

రామ్మోహన్‌పై బురదచల్లడం మానాలి: టీడీపీ ఎంపీలు

న్యూఢిల్లీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇండిగో సంక్షోభాన్ని పరిష్కరించేందుకు పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు సమర్థవంతంగా పనిచేస్తున్నారని టీడీపీ ఎంపీలు పేర్కొన్నారు. ఏపీభవన్‌లో సోమవారం టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు సహా ఆ పార్టీ ఎంపీలు మీడియాతో మాట్లాడారు. యువకుడు అయినప్పటికీ సుదీర్ఘ అనుభవమున్న మంత్రిలా రామ్మోహన్‌నాయుడు బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అయినా ఏపీలోని ప్రతిపక్షాలు, ఇతర పార్టీలు అదేపనిగా బురదజల్లుతున్నాయని విమర్శించారు. సంక్షోభానికి కారణమైన ఇండిగోపై చర్యలు తీసుకునేందుకు రామ్మోహన్ ఉపక్రమించారని తెలిపారు. సమావేశంలో దగ్గుమళ్ల ప్రసాదరావు, బీద మస్తాన్‌రావు, సానా సతీశ్, బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, మాగుంట శ్రీనివాసులురెడ్డి, బస్తిపాటి నాగరాజు, శ్రీభరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లుండి వరకు ఇండిగో ఢిల్లీ సర్వీసులు రద్దు

గన్నవరం/రాజమహేంద్రవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీ నుంచి రాజమహేంద్రవరం, విజయవాడలకు వేర్వేరుగా నడిచే ఇండిగో విమాన సేవలను ఈ నెల 11 వరకు రద్దు చేస్తున్నట్టు విజయవాడ, రాజమహేంద్రవరం విమానాశ్రయాల డైరెక్టర్లు తెలిపారు. ప్రతి రోజు ఢిల్లీ నుంచి విజయవాడకు మధ్యాహ్నం 2.20 గంటలకు వచ్చి తిరిగి 2.50కి తిరిగి వెళుతుంది. రాజమహేంద్రవరం-న్యూఢిల్లీ మధ్య నడిచే విమాన సర్వీసును కూడా ఈ నెల 11 వరకు రద్దు చేసినట్టు డైరెక్టర్ తెలిపారు. 12వ తేదీ నుంచి తిరిగి రాకపోకలు కొనసాగనున్నాయని చెప్పారు. ఈ ఎయిర్‌పోర్టు నుంచి రోజూ 850మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా.. ప్రస్తుతం ఇండిగో సంక్షోభం వల్ల ప్రయాణికుల సంఖ్య తగ్గిపోయింది. ఈ విమానాశ్రయం నుంచి మొత్తం 11 విమాన సర్వీసుల్లో ప్రయాణికులు ముంబయి, న్యూఢిల్లీ, హైదరాబాద్, తిరుపతి, బెంగళూరు, చెన్నైకు రాకపోకలు సాగిస్తుంటారు.

హవాలా 'దోపిడీ'!

సత్యసాయి జిల్లాలో సినీఫక్కీలో ఘటన

పుట్టపర్తి, పెనుకొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎక్కడో గుజరాత్‌లోని సూరత్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు! దానిని వెంటాడుతూ ఐదు వాహనాల్లో ఒక ముఠా! హైవేపే కారును అడ్డగించి... డ్రైవర్లను అదుపులోకి తీసుకుని, కారుతో సహా పరార్! ఇది పోలీసుల దృష్టికి రాగానే... 'చేజ్' మొదలైంది. రెండు కార్లను వదిలేసి ముఠా పారిపోయింది. తీరా చూస్తే.. సూరత్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారులో రూ.4.30 కోట్ల హవాలా సొమ్ము! ఇది సినిమా కథ కాదు! సత్యసాయి జిల్లాలో నిజంగానే జరిగింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... సూరత్ నుంచి ఎంహెచ్ 01 ఈవీ 4927 ఇన్నోవా వాహనంలో బెంగళూరుకు హవాలా సొమ్ము తరలిస్తున్నారు. సుదీర్ఘ ప్రయాణం... పైగా కారులో రూ.4 కోట్ల సొమ్ము. అందులో ఇద్దరు డ్రైవర్లున్నారు. కారు...ఈనెల 3వ తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయంలో సత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియా కార్ల ఫ్యాక్టరీ దాటి.. హరిపురం వై-జంక్షన్ దగ్గరకు చేరుకుంది. గట్టిగా రెండుగంటలు ప్రయాణిస్తే... బెంగళూరులోని గమ్యస్థానానికి హవాలా సొమ్ము చేరేది. అంతలోనే... ఐదు కార్లలో వచ్చిన దోపిడీ దొంగలు 'హవాలా' కారును అడ్డుకున్నారు. అందులో ఉన్న ఇద్దరు డ్రైవర్లను కిడ్నాప్ చేశారు. హవాలా కారుతోసహా అక్కడి నుంచి ఉడాయించారు. అదే సమయంలో బెంగుళూరు వైపు కారులో వెళుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఈ తతంగాన్ని గమనించారు. తన కారు డ్యాష్ కెమెరాలో రికార్డు అయిన కిడ్నాప్ దృశ్యాలను పోలీసులకు పంపారు. వెంటనే అప్రమత్తమైన గోరంట్ల సీఐ శేఖర్ తమ సిబ్బందితో జాతీయ రహదారిపై తనిఖీలు చేపట్టారు. పెనుకొండ ఆర్టీఓ కార్యాలయం వద్ద రెండు కార్లు ఆగి ఉండటాన్ని గుర్తించి అటుగా వెళ్లారు. పోలీసులను చూడగానే ఆ దుండగులు 'హవాలా' కారును అక్కడే వదిలి మరో కారులో బెంగుళూరు వైపు ఉడాయించారు. దొంగలు వదిలేసిన కారును పోలీసులు స్వాధీనం చేసుకుని పెనుకొండ స్టేషన్‌కు తరలించారు. ఆ కారు ఎవరిదో... అందులో ఏముందో అప్పటికి పోలీసులకు తెలియదు.




పోలీసులు స్వాధీనం చేసుకున్న కారును చూపుతున్న శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ సీఐ రాఘవన్

కారును వెతుక్కుంటూ వచ్చి..

దుండగులు తాము కిడ్నాప్ చేసిన ఇద్దరు డ్రైవర్లను గోరంట్ల-పుట్టపర్తి రహదారి పక్కన అటవీ ప్రాంతంలో వదిలేశారు. హవాలా సొమ్ము ఉన్న కారు ఎక్కడుందో తెలుసుకోవడం వాళ్ల ఫస్ట్ టాస్క్! దీనికోసం పెద్దగా కష్టపడాల్సిన అవసరంలేదు. ఆ కారుకు జీపీఎస్ ట్రాకింగ్ ఉంది. అది 'పెనుకొండ పోలీస్‌స్టేషన్'కు దారి చూపింది. 'కారు మాదే సార్' అని వాళ్లు రాగానే.. 'అసలు ఎవరు మీరు? ఎక్కడి నుంచి... ఎక్కడికి వెళ్తున్నారు? మిమ్మల్ని ఎందుకు కిడ్నాప్ చేశారు?" అంటూ పోలీసులు ఆరా తీశారు. దీంతో... వాళ్లకు అసలు విషయం చెప్పక తప్పలేదు. సూరత్ నుంచి బెంగళూరుకు రూ.4.30 కోట్ల హవాలా సొమ్మును తరలిస్తున్నామని... కారు సీట్లు కింద, డిక్కీలో ఏర్పాటు చేసిన అరల్లో వాటిని దాచామని చెప్పారు. పోలీసులు కారును పరిశీలించగా డిక్కీలోని ఓ అరలో రూ. 1.20 కోట్ల నగదు లభించింది. మరో రూ.3.10 కోట్లను దొంగల ముఠా ఎత్తుకెళ్లినట్లు భావిస్తున్నారు. దీనిపై 4 ప్రత్యేక బృందాలతో... అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పెనుకొండ సీఐ రాఘవన్ సోమవారం మీడియాకు తెలిపారు. నగదు తరలిస్తున్న వాహనం సూరత్‌కు చెందిన పులకేస్, అనిరుధ్‌కు చెందినదని తెలిపారు. వీరు సూరత్, బెంగళూరు ప్రాంతాలలో జీరో వ్యాపారం చేస్తుంటారని చెప్పారు. 2022లో జాతీయ రహదారిపై ఇదే తరహాలో హవాలా డబ్బును కేరళకు చెందిన దొంగల ముఠా దోచుకుంది. తాజా సంఘటన వెనుకా అలాంటి ముఠా ఉండేమోనని అనుమానిస్తున్నారు.

జనవరిలో దావోస్‌కు చంద్రబాబు



- 19 నుంచి ప్రపంచ పెట్టుబడుల సదస్సులో పాల్గొననున్న సీఎం
- మంత్రులు లోకేశ్, టీజీ భరత్, అధికారుల బృందంతో హాజరు

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెలలో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరగనున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరుకానున్నారు. మంత్రులు లోకేశ్, టీజీ భరత్, సీఎం ముఖ్య కార్యదర్శి కార్తికేయ మిశ్రా, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ శుభం బన్సాల్, సీఎం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ తంగిరాల దత్తయశ్వంత్‌తో కూడిన బృందం చంద్రబాబుతోపాటే దావోస్‌కు వెళ్లనుంది. జనవరి 19 నుంచి 23 వరకు చంద్రబాబు దావోస్‌లో జరిగే ప్రపంచ పెట్టుబడుల సదస్సులో పాల్గొంటారు. రాష్ట్రానికి పెట్టుబడులను రాబట్టేందుకు ప్రపంచంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలతో ఆయన చర్చలు జరుపుతారు. చంద్రబాబు బృందం దావోస్ పర్యటనకు అనుమతి మంజూరుచేస్తూ రాష్ట్రప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది. 'తెలంగాణ రైజింగ్ గ్లోబ్ సమ్మిట్-2025'కు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సదస్సు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, పురోగతికి, ఆవిష్కరణలకు వేదిక కావాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సోమవారం ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు.

అవినీతి రహిత పాలనకు కృషి



- రేపు పీఆర్, ఆర్డీ ఉద్యోగులతో పవన్ కల్యాణ్ మాటామంతీ

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాటామంతి కార్యక్రమం నిర్వహించనున్నారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో పంచాయతీరాజ్ (పీఆర్) ఉద్యోగులతో బుధవారం ఆయన ముచ్చటించనున్నారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో అవినీతి రహిత పాలన అందించేందుకు సహకరించాలని ఆయన కోరనున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా పంచాయతీరాజ్‌లో దాదాపు 10 వేల మంది ఉద్యోగులకు కూటమి సర్కారు పదోన్నతులు కల్పించింది. అలాగే గ్రామీణాభివృద్ధి (ఆర్డీ) శాఖలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పదోన్నతులు, వేతనాల పెంపుతో పాటు పలు సంక్షేమ కార్యక్రమాల అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. కొత్త సంవత్సరంలో వారికి తీపి కబురు అందించి సంక్రాంతి కల్లా ఈ ప్రయోజనాలు దక్కేలా చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో పీఆర్, ఆర్డీ ఉద్యోగులు, అధికారులతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాటామంతి నిర్వహించడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ భేటీలో ఉద్యోగులతో పవన్ కల్యాణ్ స్వయంగా మాట్లాడి.. ఎలాంటి విధానాలు అవలంబిస్తే గ్రామీణులకు విస్తృత సేవలు అందించగలమో తెలుసుకోనున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలోని అన్ని కేడర్ల ఉద్యోగులు పాల్గొననున్నారు.

'ఖాకీ' కొడుకే కారకుడు!

- కారు ప్రమాదానికి కారణం ఇతడి ముఠాయే
- రవాణా అధికారుల వేషంలో హైవేపై దందాలు
- 'పేట' బైపాస్‌లో లారీని ఆపిన గ్యాంగ్
- లారీ హఠాత్తుగా ఆగడంతో వెనుక నుంచి ఢీకొన్న కారు
- ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల దుర్మరణం
- విచారణలో దిగ్భ్రాంతికర విషయాలు

చిలకలూరిపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థులను బలితీసుకున్న 'చిలకలూరిపేట బైపాస్' ప్రమాదంపై సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. రవాణా శాఖ అధికారుల ముసుగులో హైవేపై వాహనాలను ఆపి... దందా సాగిస్తున్న ముఠా కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని తేలింది. ఈ 'చోర్ ముఠా' నాయకుడు ఒక ఏఎస్ఐ కుమారుడు కావడం గమనార్హం. గురువారం రాత్రి చిలకలూరిపేట బైపాస్‌లో ముందు వెళ్తున్న లారీని కారు ఢీకొనడంతో... అందులో ఉన్న ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు మరణించారు. వీరిలో నలుగురు అయ్యప్ప దీక్షలో ఉన్నారు. రవాణా శాఖ అధికారులు... ట్రాక్టర్లలోడ్‌తో వెళ్తున్న లారీని ఆకస్మికంగా ఆపడమే ప్రమాదానికి కారణమని తొలుత వార్తలు వచ్చాయి. దీంతో... రవాణా అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించారు. హైవేలో ఉన్న అన్ని సీసీ కెమెరాల్లోని ఫుటేజీని పరిశీలిస్తే సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఒక కారులో ఉన్న వారు... రవాణా శాఖ అధికారుల తరహాలో, లారీని ఆపాలంటూ సైగ చేస్తూ దానిని ఓవర్‌టేక్ చేసి, హఠాత్తుగా రోడ్డుపక్కన ఆగారు. దీంతో.. లారీ నడుపుతున్న డ్రైవర్ ఒక్కసారిగా వాహన వేగాన్ని తగ్గించారు. ఈ లారీ వెనుకే ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రయాణిస్తున్న కారు వేగంగా వస్తోంది. లారీ సడన్‌గా ఆగడంతో వీరి కారు దానిని వెనుక నుంచి బలంగా ఢీకొంది. క్షణాల్లో ఘోరం జరిగిపోయింది. ఈ దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డు అయ్యాయి. రవాణా శాఖ అధికారులు రంగంలోకి దిగి... ఆ రోజు, ఆ 'స్పాట్'లో తమ సిబ్బంది తనిఖీలు జరిపారా అనే కోణంలో ఆరా తీశారు. సీసీ టీవీ ఫుటేజ్ పరిశీలించి... ప్రమాదానికి కారణమైన కారు నంబరును గుర్తించి.. అది తమ శాఖది కాదని నిర్ధారణకు వచ్చారు. మరోవైపు పోలీసులు తీగ లాగితే.. డొంక కదలినట్లు.. ముఠా అక్రమాల గుట్టు వెలుగు చూసింది. దొంగ నంబరు ప్లేటుతో రవాణా శాఖ అధికారుల వేషంలో హైవేలో వాహనాలను ఆపి, దందా చేస్తున్న 'చోర్ ముఠా' వల్లే ఈ ఘోరం జరిగినట్లు తేలింది.



రవాణా అధికారుల ముసుగులో కారులో (వృత్తంలో) వచ్చిన ముఠా ఆపడంతో హఠాత్తుగా ఆగిన లారీ. వెనుక నుంచి ఢీకొట్టిన విద్యార్థుల కారు

తండ్రి అండతో నేరాలు

'చోర్ ముఠా' నాయకుడు నర్సరావుపేటకు చెందిన ఒక ఏఎస్ఐ కొడుకు అని నిర్ధారణ అయినట్లు సమాచారం. ఈ ముఠా కార్లు కూడా దొంగలించి విక్రయించినట్లు పోలీసు దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిసింది. గతంలో బంగారం విక్రయిస్తామని కొందరి వద్ద రూ.40 లక్షలు కాజేశారు. ఈ ఘటనపై బాధితులు ఫిర్యాదు చేసినా విచారణ జరపకుండా అప్పటి పోలీసు అధికారులు నేరస్థులకు సహకరించినట్లు తెలిసింది. తండ్రి పోలీస్ అధికారి కావడంతో బంగారం కేసు నుంచి తప్పించినట్లు ప్రచారం. అలాగే కార్లు కాజేసిన కేసుల్లో కూడా సదరు గ్యాంగ్ లీడర్.. తన తండ్రిని అడ్డుపెట్టుకొని సులువుగా తప్పించుకున్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం. నకరికల్లు మండలం నరశింగపాడుకు చెందిన ఓ యువకుడు కూడా ఈ నేరాల్లో భాగస్వామిగా ఉన్నట్లు చెబుతున్నారు. ఈ ఇద్దరితో పాటు మొత్తం ఐదుగురు పోలీసుల అదుపులో ఉన్నారు. ఈ ముఠా గురించి పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌కు సోమవారం గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీ కృష్ణారావు వచ్చి కేసు వివరాలను ఆరా తీశారు.



హత్య కేసు నిందితులను నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్‌లో రోడ్డుపై నడిపించి తీసుకొని వెళ్తున్న పోలీసులు

హత్యాయత్నం నిందితుల అరెస్టు

- నెల్లూరు రోడ్లపై నడిపించిన పోలీసులు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):హత్యాయత్నం నిందితులను పోలీసులు రోడ్లపై నడిపిస్తూ తీసుకొని వెళ్లారు. నెల్లూరు బోసుబొమ్మ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం కొందరు యువకులు బైకులతో రోడ్డుకు అడ్డంగా ఉన్నారు. ఎస్ఏఎస్ ప్రైవేటు సిటీ బస్సు హారన్ కొట్టారని అడ్డగించారు. దీంతో సిటీ బస్సు డ్రైవర్ మన్సూర్ కండక్టర్ సలామ్‌లపై వారు బ్లేడ్లతో దాడి చేసి పరారయ్యారు. నిందితుల్లో సంతపేటకు చెందిన ఉప్పు మదన్ అలియాస్ బాబి, ఉప్పు శ్రీకాంత్, నక్క తేజ, గుండవరపు అజయ్ తేజ, యాకసిరి నితిన్ ఉన్నారు. వీరిని అరెస్టు చేసిన సంతపేట ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య, సిబ్బంది సోమవారం జనమంతా చూస్తుండగా రోడ్లపై నడిపించి స్టేషన్‌కు తీసుకెళ్లారు.

ఐదేళ్లలో 7 లక్షల కోట్ల జీఎస్డీపీ నష్టం

(మొదటి పేజీ తరువాయి)

ఎప్పటికప్పుడు ఆ వివరాలను తెలుపుతున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం సచివాలయంలో 2025-26 తొలి అర్థ సంవత్సరం (ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు), అలాగే రెండో త్రైమాసికం (జూలై నుంచి సెప్టెంబరు వరకు) జీఎస్డీపీ ఫలితాలను సీఎం విడుదల చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. "2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధి రేటు 11.28 శాతంగా నమోదు కాగా, గత ఏడాది ఇదే సమయంలో అది 10.17 శాతంగా నమోదైంది. 18 నెలలుగా కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగానే 1.11 శాతం వృద్ధి పెరిగింది. ఇదే సమయానికి జాతీయస్థాయిలో జీడీపీ వృద్ధిరేటు 8.7 శాతంగా నమోదైంది. మొత్తం మీద ఈ ఆర్థిక సంవత్సరంలో 17.11 శాతం జీఎస్డీపీ వృద్ధి రేటు నమోదు చేయడమే లక్ష్యం" అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. రెండో త్రైమాసికంలో రూ.4,00,377 కోట్ల విలువైన జీఎస్డీపీ నమోదైందని, ఇందులో వరి 3.64 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా, గతంతో పోలిస్తే 23.95 శాతం మేర వృద్ధి నమోదైందని తెలిపారు. అరటిలో అనూహ్యంగా 37.31 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని, గతంతో పోలిస్తే ఇది 151.2 శాతం అధికమని వివరించారు. వాణిజ్య వాహనాల రిజిస్ట్రేషన్లు 21.55 లక్షలు జరిగాయని, జలరవాణా ద్వారా 52.50 మిలియన్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ జరిగిందని, విమానాల్లో ప్రయాణించిన వారి సంఖ్య 14.98 లక్షలకు చేరుకున్నదని తెలిపారు. ఇంకా ఏమన్నారంటే..

బ్రాండ్ పోవడంతో చాలా నష్టపోయాం..

"విభజన కారణంగా వ్యవస్థీకృతంగా ఏపీకి ఇబ్బందులు వచ్చాయి. ఆ ఇబ్బందులను సరిచేసే సమయంలో వైసీపీ వచ్చి రాష్ట్రాన్ని ధ్వంసం చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఎక్కువ వడ్డీలకు అప్పులు తేవడం వల్ల ప్రజాధనానికి నష్టం కలిగింది. ఇప్పుడిప్పుడే వ్యవస్థలను గాడిలో పెట్టి ఎక్కువ వడ్డీకి తెచ్చిన రుణాలు రీషెడ్యూలింగ్ చేసుకోవాలని చూస్తున్నాం. బ్రాండ్ ఇమేజ్ తగ్గినప్పుడు వడ్డీ రేటు పెరిగిపోతుంది. దాని ఫలితంగా రాష్ట్రం చాలా నష్టపోయింది."

హామీలన్నీ అమలు చేస్తున్నాం

"ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. చేయలేమని మేం పారిపోవడం లేదు. అదేసమయంలో అభివృద్ధిలో రాష్ట్రం పరుగులు పెట్టేలా చేస్తున్నాం. ప్రజల కోసం ఎంత కష్టమైనా సరే బాధ్యత తీసుకుని చేస్తాం. కూటమిపై ఉన్న నమ్మకం, విశ్వాసంతోనే భారీ స్థాయిలో ప్రజలు మద్దతు పలికారు. గత పాలకులు ఆస్తులను, భవిష్యత్తు ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారు. మూలధన వ్యయం చేయకపోవటంతో గతంలో ఎక్కడా ప్రాజెక్టులు ముందుకు వెళ్లలేదు. కూటమి అధికారంలోకి వచ్చాకే వాటిని ముందుకు తీసుకెళ్లగలిగాం. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రాజెక్టులపై మూల ధన వ్యయాన్ని గణనీయంగా పెంచాం. సుపరిపాలన ద్వారా ప్రజల వద్దకు వెళ్లాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజల చేతుల్లోకి పాలనను తీసుకెళ్లాం. డీఫంక్ట్ (పనికిరాని స్థితిలోని) అయిన వివిధ కేంద్ర పథకాలను పునరుద్ధరించాం. 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను మళ్లీ పునరుద్ధరించగలిగాం. వైసీపీ హయాంలో పీక్ లోడ్ సమయంలో బహిరంగ మార్కెట్‌లో విద్యుత్తును యూనిట్‌కు రూ.15 చొప్పున కొనుగోలు చేసిన పరిస్థితి. మేం ఆ పరిస్థితిని మార్చాం. గత ప్రభుత్వం పీపీఏలను రద్దు చేయడం వల్ల విద్యుత్ వాడుకోకుండానే రూ.9వేల కోట్లు చెల్లించింది. అన్నింటినీ గాడిలో పెట్టుకుంటూ ముందుకు వెళుతున్నాం. ప్రజలపై భారం వేయకూడదన్న లక్ష్యంతో విద్యుత్ చార్జీలను పెంచలేదు. ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించాం. రూ.13 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులకు భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు చేసుకున్నాం. 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వారసత్వంగా ఇచ్చి వెళ్లిన ఘనత గత పాలకులది. దాన్ని తొలగించేందుకు జనవరి1 గడువుగా విధించాం. డిమాండ్ ఉన్న పంటలతో పాటు పంటల నాణ్యతపైనా రైతులు దృష్టి పెట్టాలి. రైతు సేవా కేంద్రాల వారీగా వ్యవసాయ యాక్షన్ ప్లాన్లు తయారు చేస్తున్నాం. ప్రకాశం, ఎనిమిది రాయలసీమ జిల్లాలను ఉద్యానవన క్లస్టర్‌గా తయారు చేస్తున్నాం." అని చంద్రబాబు తెలిపారు.

రెండో త్రైమాసికంలో వృద్ధి (శాతాల్లో)	
రాష్ట్ర జీవీఏ (గ్రాస్ వాల్యూ ఎడిషన్)	11.30
వ్యవసాయ రంగం	11.43
హార్టీకల్చర్	4.35
ఫిషింగ్, ఆక్వాకల్చర్	26.27
లైవ్‌స్టాక్	4.18
మత్స్య దిగుబడి	17.30
రొయ్యలు	7.09
గుడ్లు	6.68
మీట్	7.95
పాల దిగుబడి	3.62
పరిశ్రమలు (జాతీయ సగటును దాటింది ఇందులో మైనింగ్- క్వారీయింగ్‌లో 18.43 శాతం వృద్ధి)	12.20
తయారీ రంగం	11.66
నిర్మాణ రంగం	11.81
విద్యుత్తు ఉత్పత్తి	19.12
విద్యుత్తు వినియోగం	4.17
ఆతిథ్య రంగం	8.50
రవాణా, గిడ్డంగులు	5.99
రియల్ ఎస్టేట్	14.31

వృద్ధిలో వ్యత్యాసం.. (శాతాల్లో)

	2014-19	2019-24	2024 (తొలి ఏడాది)
జీఎస్డీపీ వృద్ధి	13.49	10.32	12.02
తలసరి ఆదాయం	13.21	9.8	11.89

తొలి అర్థ సంవత్సరం ఫలితాలు...

ప్రస్తుత ధరల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం తొలి అర్థ సంవత్సరం జీఎస్డీపీ రూ.7,58,270 కోట్లు. వ్యవసాయరంగంలో 10.26 శాతం వృద్ధి నమోదైంది. పరిశ్రమల రంగంలో 12.05 శాతం, సేవల రంగంలో 11 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం లక్ష్యంలో తొలి రెండు త్రైమాసికాలు కలిపి 41 శాతం జీఎస్డీపీ లక్ష్యాన్ని చేరుకున్నాం. రానున్న రెండు త్రైమాసికాలు కలిపి జీఎస్డీపీ రూ.11,07,434 కోట్ల సాధనే లక్ష్యం.

సంక్రాంతి నుంచి సేవలన్నీ ఆన్‌లైన్

వచ్చే సంక్రాంతి నుంచి రాష్ట్ర పౌరులకు అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోనే అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఆర్టీజీఎస్‌పై సోమవారం సమీక్ష సందర్భంగా మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా ప్రజలకు సేవలు అందడంతో పాటు వారిలో ప్రభుత్వ పనితీరు పట్ల సంతృప్తస్థాయి పెరుగుతుందన్నారు. ఇప్పటికీ కొన్ని శాఖలు భౌతికంగానే సేవలందిస్తున్నాయన్నారు. అలాంటి శాఖలు వెంటనే తమ పంథా మార్చుకొని, ప్రజలకు ఆన్‌లైన్‌లో సేవలందించేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలన్నింటినీ.. కార్యాలయాల చుట్టూ తిరగనవసరం లేకుండా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందజేస్తున్నామని పేర్కొన్నారు.

తప్పులు చేస్తారు.. తప్పులు చేసిన వారిని సమర్థిస్తారు

- ఇదే వైసీపీ నాయకుల నైజం: సీఎం

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): "తప్పులు చేస్తారు.. తప్పులు చేసిన వారిని సమర్థిస్తారు. ఇలాంటి వారు ప్రతిపక్షంలో ఉన్నారు. ఆ పార్టీకి తలాతోక లేదు. ప్రతీ అంశంలో ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేయడమే వారి పని. పరకామణిలో డబ్బులు కొట్టేసిన వ్యవహారాన్ని చిన్న నేరంగా పేర్కొనేవారిని ఏమనాలి?" అంటూ సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఓ దేవాలయంలో దేవుడి సొమ్ము చోరీ చేస్తే తక్షణం అతన్ని సస్పెండ్ చేసి, అరెస్టు చేయించామన్నారు. కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి ఆలయంలో దేవుడి సొమ్ము చోరీ చేస్తే దాన్ని సమర్థిస్తారా అంటూ వైసీపీ అధినేత జగన్‌ను నిలదీశారు. రోజుకు లక్ష మంది భక్తులు వచ్చే దేవుడితో ఆటలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో నాసిరకం అన్న ప్రసాదాలను భక్తులకు ఇస్తే దాన్ని సమర్థించారని, కల్తీ నెయ్యి స్వామివారి ప్రసాదం తయారీకి సరఫరా చేస్తే, ఆ ఘటనను కూడా వెనకేసుకొస్తున్నారని, ఇలాంటి వారితో రాజకీయం చేయడానికి సిగ్గుగా ఉందని వ్యాఖ్యానించారు. 'రూ.70వేలు చోరీ చేశాను.. రూ.14 కోట్లు రాసిచ్చాను' అని అంటే తప్పు ఒప్పు అవుతుందా? సింగయ్య అనే వ్యక్తిని కారు కింద తొక్కించేసి, ఆయన భార్యతో మాపై ఆరోపణలు చేయించారు. హైదరాబాద్ నుంచి మద్యం సేవిస్తూ వచ్చి ప్రమాదంలో ఓ పాస్టర్ మరణిస్తే, ఆ ఘటనను కూడా హత్య కింద చిత్రీకరించే ప్రయత్నం చేశారు. వైసీపీ నేతలు ప్రతి అంశంలోనూ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయ ముసుగులో నేరాలు చేసే ఇలాంటి వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. ఈ క్రిమినల్స్ మమ్మల్ని గోబెల్స్ అంటూ వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉంది. కరెంటు చార్జీలు పెంచబోమన్న మాటకు కట్టుబడటం గోబెల్స్ ప్రచారం చేయడమా? అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో పీపీఏల రద్దు చేసిన కారణంగా ఉత్త పుణ్యానికి ప్రజాధనం రూ.9వేల కోట్లు దుర్వినియోగం చేశారని చెప్పడం గోబెల్స్ ప్రచారమా అని సీఎం నిలదీశారు.

లాఠీతో కాదు.. డేటాతో..!

- ఆధునిక నేరాల కట్టడికి అధునాతన పోలీసింగ్
- సైబర్, ఆర్థిక మోసాలపై నిపుణులతో ఆన్‌లైన్ క్లాసులు
- 16న దేశంలోనే నంబర్ వన్ శిక్షణకు సీఎం శ్రీకారం

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): లాఠీ పట్టుకో.. దొంగల్ని వెంబడించు అనేది పాత ధోరణి!.. డేటా సేకరించు.. నేరస్థుల ఆట కట్టించు.. ఇదీ ఏపీలో వైవిధ్యమైన నూతన పోలీసింగ్ విధానం! మహిళల మెడలో బంగారు చైన్లు లాక్కెళ్లే స్నాచర్స్‌నే కాదు.. అమాయకుల అకౌంట్లో లక్షలు దోచేసే ముసుగు దొంగల్ని కూడా పట్టుకునేందుకు రాష్ట్ర పోలీసుల శాఖ నడుం బిగిస్తోంది. ఫ్యూడల్ పోలీసింగ్‌కు టాటా చెప్పి హ్యూమన్ టచ్ తీసుకొస్తామంటున్న పోలీసు ఉన్నతాధికారులు ట్రైనీ కానిస్టేబుళ్లను సైబర్ కమెండోలుగా తీర్చి దిద్దబోతున్నారు. శారీరక దృఢత్వంతో పాటు సాంకేతిక నైపుణ్యాన్ని పెంచేందుకు ఈ నెల 16న శ్రీకారం చుడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా మంగళగిరిలోని ఏపీ పోలీస్ బెటాలియన్స్‌లో 5,551మంది యువత తొమ్మిది నెలల కఠోర, నైపుణ్య శిక్షణకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలోని డీటీసీలు, పీటీలు, ఏపీఎస్పీ బెటాలియన్లు మొత్తం 20 కేంద్రాల్లో ఈ నెల 22 నుంచి పూర్తి స్థాయిలో శిక్షణకు పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లూ చేసింది. కూటమి ప్రభుత్వం 6,024 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసింది. ఇప్పుడు అన్ని జిల్లాల్లోనూ అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి పీటీసీలతో పాటు డీటీసీల్లో మూడు వేల మందికి పైగా సివిల్ కానిస్టేబుళ్లుగా ఇప్పుడు శిక్షణ ఇవ్వనున్నారు. మరోవైపు 2,500మందికి ఏపీఎస్పీ కానిస్టేబుళ్లుగా బెటాలియన్లలో శిక్షణకు ఏర్పాట్లు చేశారు. వీరిలో 810మంది బీటెక్, ఎంటెక్, బీసీఏ లాంటి టెక్నికల్ కోర్సులు చేసిన విద్యావంతులు ఉండగా, డిగ్రీ పట్టభద్రులు 4,051మంది. ఎంబీఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎల్ఎల్‌బీ, ఎంఏ లాంటి ఉన్నత విద్య చదివిన వాళ్లు కూడా ఉన్నారు. ఇలాంటి మానవ వనరుల్ని సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలను ఎదుర్కొనే సుశిక్షిత పోలీసులుగా తీర్చిదిద్దబోతున్నారు. మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ ప్రాంగణంలోని టెక్ టవర్‌లో ఒక ప్రత్యేక స్టుడియో ఏర్పాటు చేశారు. అక్కడికి సైబర్ నిపుణులతో పాటు ఫోరెన్సిక్, ఇన్వెస్టిగేషన్, ఆర్థిక మోసాలు, మహిళలపై అఘాయిత్యాలు.. తదితర నేరాలపై అవగాహన ఉన్న నిపుణులతో ఆన్‌లైన్‌లో క్లాసులు చెప్పిస్తారు. కేంద్ర హోంశాఖ తీసుకొచ్చిన 'ఐ గాట్ కర్మయోగి' యాప్‌ను ఏపీలోని ప్రతి పోలీసు ఆండ్రాయిడ్ మొబైల్స్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాల్సి ఉంటుంది. డిజిటల్ ఫోరెన్సిక్, క్రిమినాలజీ, సైబర్ నేరాలు తదితర సవాళ్లను అధిగమించేందుకు కర్మయోగి యాప్ ఉపయోగపడుతుందని పోలీసు శిక్షణ విభాగం డీఐజీ సత్య యేసుబాబు తెలిపారు.

పునరావృతమైతే కఠిన చర్యలు!

- రిమ్స్‌లో ప్రోటోకాల్ ఉల్లంఘనపై అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ హెచ్చరిక
- నోటీసు ఇచ్చినా గత విచారణకు గైర్హాజరవడంపై ఆగ్రహం

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్‌లో క్యాథ్‌ల్యాబ్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడిన అప్పటి మెడికల్ సూపరింటెండెంట్, డీఆర్‌వోలపై అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ.. చైర్మన్ పితాని సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో సమావేశమైంది. కమిటీ ముందు హాజరుకావాలని నోటీసు ఇచ్చినా పట్టించుకోకుండా గత విచారణకు ఇద్దరూ గైర్హాజరవడంపై మండిపడింది. ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని ఇద్దరినీ హెచ్చరించింది. పూర్తి వివరాలతో తదుపరి విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. రిమ్స్‌లో క్యాథల్యాబ్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రోటోకాల్ పాటించలేదని కడప ఎమ్మెల్యే, విప్ రెడ్డప్ప గారి మాధవీరెడ్డి ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేశారు. దీంతోపాటు గత ప్రభుత్వంలో తాను అనేక ఫిర్యాదులు చేసినా ఎటువంటి స్పందనా లేదని ఎమ్మెల్యే జోగేశ్వరరావు చేసిన ఫిర్యాదులపైనా ప్రివిలేజ్ కమిటీ విచారణ చేపట్టింది. సోమవారం మరోసారి సమావేశమైన కమిటీ.. శిలాఫలకంపై ఎమ్మెల్యే పేరు ఎందుకు వేయలేదని అప్పటి రిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్‌ను ప్రశ్నించింది. తనకు ప్రోటోకాల్ తెలియదని, అప్పటి డీఆర్‌వోను అడిగిన తర్వాత ఎమ్మెల్యే పేరు చేర్చి కొత్త శిలాఫలకం ఆవిష్కరించామని సూపరింటెండెంట్ సమాధానం ఇచ్చారు. జరిగిన పొరపాటుకు కమిటీ ముందు క్షమాపణ చెప్పారు. పునరావృతం కాకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. అయితే, గత వాయిదాకు ఎందుకు రాలేదని డీఆర్‌వో, మెడికల్ సూపరింటెండెంట్‌లను కమిటీ ప్రశ్నించింది. ఇది తీవ్ర నిర్లక్ష్యమని, ప్రివిలేజ్ కమిటీ నిబంధనలను ఉల్లంఘించినట్లైందని, దీనిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని ప్రశ్నించింది. డీఆర్‌వో పేపర్లు చూస్తూ సమాధానం ఇవ్వడంపైనా కమిటీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కాగా, ఎమ్మెల్యేల పట్ల అగౌరంగా ఉంటున్నారని, తీరు మారడం లేదని ఎమ్మెల్యే మాధవీ రెడ్డి కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, తాను వైద్యులతో సమావేశాలు ఏర్పాటు చేస్తే.. ఆ సమావేశాలకు వెళ్లవద్దని అప్పటి మెడికల్ సూపరింటెండెంట్ మెసేజ్‌లు పంపారని తెలిపారు.

గూగుల్ డేటా సెంటర్ పనులకు శ్రీకారం

- తర్లువాడ భూముల్లో మట్టి నమూనాలు సేకరణ
- హైవే నుంచి డేటా సెంటర్‌కు నేరుగా వెళ్లేలా రోడ్డు విస్తరణ!

విశాఖపట్నం/ఆనందపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం తర్లువాడలో అంతర్జాతీయ ఐటీ దిగ్గజం గూగుల్ డేటా సెంటర్ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా నిర్మాణ బాధ్యతలు చేపట్టిన అదానీ కంపెనీ ప్రతినిధులు భూముల మట్టి నమూనాలు సేకరించి పరీక్షకు పంపుతున్నారు. తద్వారా నేల స్వభావానికి అనువుగా నిర్మాణాలు చేపట్టనున్నారు. మరోవైపు భూగర్భ జలాల కోసం కూడా సర్వే చేస్తున్నారు. తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 200 ఎకరాలు కేటాయించింది. ఇందులో ప్రభుత్వ భూమి సుమారు 100 ఎకరాలు ఉంది. డీపట్టా భూములకు సంబంధించి 51 మంది రైతుల్లో సగానికి పైగా రైతులు ముందుకురాగా, వారిలో 18 మందికి ఈనెల 6న పరిహారం సొమ్ము జమ చేశారు. మిగిలిన రైతుల నుంచి సమ్మతి పత్రాలు తీసుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. భూములు గుర్తించిన ప్రాంతాల్లో రెండు చోట్ల పోలీస్ అవుట్‌పోస్టులు ఏర్పాటు చేశారు. కాగా, అదానీ కంపెనీకి చెందిన పనుల పర్యవేక్షణకు ఇబ్బంది లేకుండా రిటైర్డు పోలీస్ అధికారి నేతృత్వంలో బృందం పనిచేస్తోంది. దశల వారీగా రైతుల నుంచి భూములు సేకరించి ఏపీఐఐసీకి అప్పగించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. మొత్తం భూములు తీసుకున్న తర్వాత ఏపీఐఐసీ అధికారుల పర్యవేక్షణలో డేటా సెంటర్ పనులు కొనసాగుతాయని అధికారులు చెబుతున్నారు. కొద్దిరోజుల్లో పనులు వేగం పుంజుకుంటాయని అంటున్నారు.



గూగుల్ డేటా సెంటర్‌కు కేటాయించిన భూముల్లో మట్టి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

హైవే నుంచి రహదారి నిర్మాణం

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ప్రకటన వచ్చిన తర్వాత హైవే నుంచి గ్రామం మీదుగా వెళ్లే రహదారికి మరమ్మతులు చేశారు. అయితే డేటా సెంటర్‌కు జాతీయ రహదారి నుంచి నేరుగా వెళ్లేందుకు గుడిలోవ పాఠశాల ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న రహదారిని 100 అడుగులకు విస్తరించనున్నారు. ఈ మార్గం గ్రామంతో సంబంధం లేకుండా నేరుగా డేటా సెంటర్‌కు వెళుతుంది. ఇదిలా ఉండగా గూగుల్ డేటా సెంటర్‌కు భూములు కేటాయించిన కొండ 1,000 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. పైకి వెళ్లేందుకు కచ్చా మార్గం ఉంది. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా మొత్తం విస్తీర్ణంపై సర్వే చేశారు.

రైతులకు పరిహారం జమ

ఆనందపురం మండలం తర్లువాడలో డేటా సెంటర్‌కు భూములు ఇచ్చిన రైతులకు పరిహారం అందజేత ప్రారంభమైంది. డీపట్టా భూములు ఇచ్చిన రైతుల్లో 18 మంది ఖాతాలకు ఈ నెల 6న డబ్బులు జమ చేశారు. ఎకరాకు సంబంధించి 80 సెంట్లకుగానూ రూ.40 లక్షల వంతున జమ చేశామని, 20 సెంట్ల భూమి మరో చోట కేటాయిస్తామని భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్ తెలిపారు.



టీడీపీ కేంద్ర కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

పరకామణి దొంగ పశ్చాత్తాప పడుతుంటే... వెనకేసుకొస్తున్న జగన్: మంత్రి మండిపల్లి

- గజదొంగ, మరో దొంగను సపోర్టు చేస్తున్నాడు: మంత్రి నిమ్మల

అమరావతి, పాలకొల్లు అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'తిరుమల శ్రీవారి ఆలయ పరకామణిలో దొంగతనం చేసిన వ్యక్తి పశ్చాత్తాప పడుతున్నాడు. కాని మాజీ సీఎం జగన్ మాత్రం సదరు దొంగను వెనకేసుకొస్తున్నాడు. అది చిన్న దొంగతనమేనంటూ వాదిస్తున్నాడు' అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'గంజాయి సరఫరాదారుడైన కొండారెడ్డినీ జగన్ వెనుకేసుకురావడం బాధాకరం. పరకామణి కేసులో ఎవర్ని రక్షించడానికి జగన్ ప్రయత్నిస్తున్నాడు? జగన్ గతంలో చేసిన పాపాలు ఆయన్ని, ఆయన పార్టీని ఇప్పటికీ వెంటాడుతున్నాయి. ఆ పాపాల నుంచి బయట పడటానికి జగన్ ఆపసోపాలు పడుతున్నాడు. సీఐ సతీశ్‌కుమార్ ఎలా చనిపోయాడనే దానిపై విచారణ సాగుతోంది. త్వరలో అన్ని విషయాలు బయటకు వస్తాయి' అని తెలిపారు.

రాజకీయాల్లోనే ఉండ తగని వ్యక్తి జగన్

పరకామణి చోరీని చిన్న దొంగతనం అని జగన్ అనడం సిగ్గు చేటని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. 'గజదొంగ, ఇంకో దొంగను సపోర్టు చేసినట్టుగా ఉంది. జగన్ రాజకీయాల్లో ఉండతగని వ్యక్తి. దొంగకు అధికారం ఇస్తే ఏమౌతుందంతే జగన్ పాలనే నిదర్శనం. జగన్‌కు ప్రజలకన్నా నేరగాళ్లు, బెట్టింగ్ దోపిడిదారులు, లిక్కర్ మాఫియాలపైనే ప్రేమ ఎక్కువ' అని దుయ్యబట్టారు.



తూర్పుగోదావరి జిల్లాలో ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వెంకయ్యనాయుడు

నేను జైలుకు వెళ్లకపోతే.. ఉపరాష్ట్రపతి అయ్యేవాడిని కాదు

- ఎమర్జెన్సీలో జైలుకు పంపిన ఇందిరకు ధన్యవాదాలు
- నేను, మోదీ, కోవింద్, జస్టిస్ రమణ మాతృభాషలో చదువుకున్నవాళ్లమే
- ఆదికవి నన్నయ్య వర్సిటీ జాతీయ వర్క్‌షాపులో వెంకయ్య

రాజమహేంద్రవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'ఎమర్జెన్సీ సమయంలో నాటి ప్రధాని ఇందిరాగాంధీ నన్ను జైలుకు పంపకపోతే నేను ఉపరాష్ట్రపతిని అయ్యేవాడిని కాదు. ఆ సమయంలో నేను వకీలును మాత్రమే. 17 నెలల పాటు జైలుశిక్ష అనుభవించా. అప్పుడే పొలిటీషియన్ అవ్వాలనుకున్నాను. జాతీయ స్థాయిలో ఎదిగాను. దేశంలో రెండో అత్యున్నత పదవి ఉపరాష్ట్రపతి అయ్యాను. ఇందిరాగాంధీకి ధన్యవాదాలు' అని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా, ఆదికవి నన్నయ్య వర్సిటీలో సోమవారం 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం' అనే అంశంపై జరిగిన జాతీయ వర్క్‌షాపులో ఆయన పాల్గొన్నారు. ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. వెంకయ్య మాట్లాడుతూ.. "అమ్మ నా 13వ నెలలోనే చనిపోయింది. నేను అమ్మను చూడలేదు. అమ్మభాషలోనే ఆమెను చూసుకున్నాను. మాతృభాషలో, ప్రభుత్వ బడుల్లో చదువుకుంటే ఉన్నత స్థాయికి ఎదగలేమనే అభిప్రాయం సరికాదు. ప్రధాని మోదీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ మాతృభాషలో చదువుకున్నవారే. నేనూ తెలుగుభాషలో వీధి బడిలోనే చదువుకున్నాను. బ్రిటీష్‌వాళ్లు ఇంగ్లిషు వస్తేనే ఉద్యోగం ఇస్తామని చెప్పడంతో అందరూ ఆంగ్లం చదువుకున్నారు. నైజాం నవాబు ఉర్దూ చదువుకుంటే ఉద్యోగం ఇస్తాననడంతో ఉర్దూ చదువుకున్నారు. ఇవాళ తెలుగు రాష్ట్రాల్లో తెలుగు చదువుకుంటేనే ఉద్యోగం అంటేనే తెలుగు నేర్చుకుంటారు. ఎవరైనా సరే మొదట మాతృభాష, తర్వాత సోదర భాష, తర్వాతే అన్యభాషలు నేర్చుకోవాలి." అని వెంకయ్యనాయుడు అన్నారు. "తమిళనాడులో పిల్లలు హిందీ చదువుకుంటారు. పెద్దలు హిందీ సినిమాలు చూస్తారు. కానీ రాజకీయ నేతలు మాత్రం హిందీని వ్యతిరేకిస్తారు. నేనూ హిందీని వ్యతిరేకించాను. నెల్లూరులో డాక్ ఘర్(పోస్టాఫీసు)కు తారు రాశాను. కానీ ఢిల్లీ వెళ్లాక నేను తారు డాక్ ఘర్‌కు కాదు.. నా ముఖానికి రాసుకున్నానని తెలుసుకున్నాను." అని వెంకయ్య అన్నారు. ఏపీ తెలుగు-సంస్కృత అకాడమీ అధ్యక్షుడు ఆర్డీ విల్సన్(శరత్ చంద్ర), తానా సాహితీ వేదిక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్ పాల్గొన్నారు.

తిరుమల తరహాలో 5,000 ఆలయాలు

సీఎం సూచనలతో నమూనాల్లో మార్పులు

- 1,250 కోట్లకు పెరగనున్న నిర్మాణ వ్యయం!
- ధ్వజస్తంభాల కోసం సొంతగా చెట్ల పెంపకం
- అన్ని శ్రీవారి ఆలయాల్లోనూ అన్న ప్రసాదం
- 'ఆంధ్రజ్యోతి'తో టీటీడీ ఈవో సింఘాల్





తిరుపతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీటీడీ నిర్మించ తలపెట్టి 5 వేల ఆలయాల బడ్జెట్ భారీగా పెరిగింది. ఈ ఆలయాల నిర్మాణానికి రూ.750 కోట్లు ఖర్చు అవుతుందని ముందుగా అంచనా వేశారు. అయితే ఈ ఆలయాల నిర్మాణంపై సీఎం చంద్రబాబుతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన కొన్ని సూచనలు చేశారు. ప్రతి ఆలయానికీ సంప్రదాయ పద్ధతిలో మండపం, గర్భగుడి, గోపురం, ప్రాకారం ఉండేలా నమూనాలు తయారు చేయాలని ఆదేశించారు. టీటీడీ చీఫ్ ఇంజనీర్, దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ సంయుక్తంగా కసరత్తు చేస్తున్నారు. ఈ మార్పుల వల్ల నిర్మాణ వ్యయం రూ.750 కోట్ల నుంచి రూ.1250 కోట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. తొలుత నిర్ణయించిన మేరకు రూ.10 లక్షలు, రూ.15 లక్షలు, రూ.20 లక్షల చొప్పున మూడు కేటగిరీలలో ఆలయాలను నిర్మించాలనుకున్నారు. నమూనాల మార్పుతో ఒక్కో ఆలయం నిర్మాణ వ్యయం అదనంగా రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల దాకా పెరిగే అవకాశం ఉందని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) కార్యనిర్వహణాధికారి(ఈవో) అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడుతూ.. టీటీడీలో జరుగుతున్న అనేక మార్పుల గురించి వివరించారు.

మార్చినాటికి అనుమతులు

వచ్చే మార్చి నెలాఖరులోగా 5 వేల ఆలయాల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు ఇవ్వాలనే లక్ష్యంగా ఉన్నామని ఈవో సింఘాల్ చెప్పారు. ఈ ఆలయాల నిర్మాణాల కోసం దేవదాయ శాఖకు టీటీడీ రూ.100 కోట్లు విడుదల చేసిందన్నారు. తమ ప్రాంతంలో ఆలయాలు నిర్మించాలంటూ ఇప్పటిదాకా 700 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి సోమవారం నాటికి 206 దరఖాస్తులను ఆమోదించినట్లు తెలిపారు. వీటిపై ప్రతి సోమవారం దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్‌ల స్థాయిలో సమావేశాలు జరుగుతున్నాయన్నారు. ఆలయాల నిర్మాణానికి ఆయాచోట్ల లభ్యమయ్యే స్థలాన్ని బట్టి నమూనాలను నిర్ణయిస్తామని ఈవో చెప్పారు. నిధుల విషయంలో దాతలు, ప్రజల భాగస్వామ్యాన్ని బట్టి మిగిలిన మొత్తాన్ని టీటీడీ వెచ్చిస్తుందని తెలిపారు.

రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు

దేశంలోని ఇతర రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి కూడా చర్యలు మొదలయ్యాయని ఈవో సింఘాల్ తెలిపారు. అసోం రాజధాని దిస్‌పూర్‌లో ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అక్కడి ప్రభుత్వం ఈ నెలలో కేటాయించనుందన్నారు. బిహార్ రాజధాని పట్నాలో 10 ఎకరాల భూమిని గుర్తించినట్టు అక్కడి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేఖ రాశారని తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూరులో 19.50 ఎకరాల భూమిని గుర్తించారని, చెన్నై, ముంబైలలో ఇప్పటికే స్థలాలను టీటీడీ తీసుకుందన్నారు. తిరుమలపై ఒత్తిడి తగ్గించేందుకు తిరుపతిలోని అలిపిరిలో భక్తుల కోసం బేస్‌క్యాంప్ నిర్మించనున్నట్టు ఈవో తెలిపారు. సీఎం ఆదేశాలతో పర్యాటక ప్రాజెక్టుల నుంచి టీటీడీ ఆధీనంలోకి వచ్చిన 25 ఎకరాల స్థలంలో బేస్‌క్యాంప్ ఏర్పాటు చేస్తామన్నారు.

100 ఎకరాల్లో చెట్ల పెంపకం

టీటీడీ నిర్మించనున్న ఆలయాల్లో ధ్వజస్తంభాల ఏర్పాటుకు అవసరమైన చెట్లను పెంచాలని ఆలోచిస్తున్నట్టు ఈవో చెప్పారు. దీనికిగాను తిరుపతిలో 100 ఎకరాలు కేటాయిస్తున్నామన్నారు. ధ్వజస్తంభాలకు అవసరమైన పరిమాణంలోని పెద్ద వృక్షాలు దేశంలోని అడవుల్లో లభ్యం కావడంలేదని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు.

అమరావతిలో రోజూ పవిత్ర హారతి

రాజధాని అమరావతిలోని శ్రీవారి ఆలయంలో ఇకపై ప్రతి రోజూ పవిత్ర హారతి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ ఈవో సింఘాల్ తెలిపారు. వారాణసిలో గంగా హారతి తరహాలో ఇక్కడ కూడా హారతి ఇచ్చేలా చూడాలని సీఎం సూచించారని చెప్పారు. అమరావతిలో శ్రీవారి ఆలయం 5 ఎకరాల విస్తీర్ణంలోనే నిర్మితమైందని, మిగిలిన 20 ఎకరాల ప్రాంగణాన్ని అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని తెలిపారు.

టీటీడీ ఆలయాల్లో అన్న ప్రసాదం

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని 60 టీటీడీ ఆలయాల్లో మార్చి నెలాఖరులోపు భక్తులకు అన్న ప్రసాద వితరణ ప్రారంభిస్తామని ఈవో సింఘాల్ చెప్పారు. ఇప్పటికే కొన్ని చోట్ల అన్న ప్రసాద వితరణ జరుగుతోందన్నారు. అన్న ప్రసాదాల తయారీ, పంపిణీకి ధార్మిక సంస్థలు, మఠాలు వంటివి ముందుకు వస్తే వారితో అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవడానికి టీటీడీ సిద్ధంగా ఉందన్నారు. టీటీడీ ఆలయాలన్నింటిలోనూ తిరుమల తరహాలోనే కైంకర్యాలను నిర్వహిస్తామన్నారు. అవసరమైన అర్చకులు, పోటు కార్మికులు, వేద పారాయణ చేసేవారిని నియమించనున్నట్టు తెలిపారు.

ప్రవేశ పరీక్షలకు రాత విధానమే మేలు

- పార్లమెంటరీ కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ, డిసెంబరు 8: ప్రవేశ పరీక్షలను రాతపూర్వక విధానంలో నిర్వహిస్తే మంచిదని పార్లమెంటరీ కమిటీ అభిప్రాయపడింది. యూపీఎస్సీ, సీబీఎస్సీ బోర్డులు ఎలాంటి పేపరు లీకుల బెడద లేకుండానే సమర్థంగా రాత పూర్వక పరీక్షలు జరుపుతున్నందున అలాంటి విధానాన్ని పాటించడం మేలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)కు సూచించింది. పెన్-పేపరు విధానంలో పరీక్ష పేపర్ల లీకుకు అవకాశం ఉందని, అదే కంప్యూటర్ ఆధారిత పరీక్షలు (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్-సీబీటీ) జరపాలనుకుంటే ఎవరూ కనిపెట్టలేని రీతిలో హ్యాకింగ్ చేసే ప్రమాదం ఉందని పేర్కొంది. అందువల్ల తగిన జాగ్రత్తలు తీసుకొని లిఖితపూర్వక విధానాన్నే అమలు చే యడమే మంచిదని అభిప్రాయపడింది. కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్ ఆధ్వర్యంలో విద్య, మహిళా-శిశు సంక్షేమం, యువజన వ్యవహారాలు, క్రీడలపై ఏర్పాటయిన పార్లమెంటరీ స్థాయీ సంఘం తాజాగా సమర్పించిన నివేదికలో ఈ విషయాలను ప్రస్తావించింది. ఒకవేళ కంప్యూటర్ ద్వారా నిర్వహించాల్సి వస్తే ప్రయివేటు సంస్థల సెంటర్లకు అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేసింది. కేవలం ప్రభుత్వ సంస్థల సెంటర్లలోనే నిర్వహించాలని తెలిపింది. గత ఆరేళ్లలో ఎన్‌టీఏ ఫీజుల రూపంలో రూ.3,512.88 కోట్లను వసూలు చేసిందని, అందులో రూ.3,064.77 కోట్లను ఖర్చు చేసిందని తెలిపింది.

స్టార్‌లింక్ ఇంటర్‌నెట్.. నెలకు 8,600

న్యూఢిల్లీ, డిసెంబరు 8: అపర కుబేరుడు ఈలన్ మస్క్‌కు చెందిన ఉపగ్రహ ఇంటర్‌నెట్ సేవల సంస్థ 'స్టార్‌లింక్' సంస్థ భారత్‌లో అందించే సేవల ధరలను వెల్లడించింది. ఎలాంటి బ్రాడ్‌బ్యాండ్, మొబైల్ డేటా సేవలూ అందని ప్రదేశాల్లో ఉపయోగపడే ఈ శాటిలైట్ ఇంటర్‌నెట్ సేవలకు.. గృహవినియోగదారులు నెలకు రూ.8,600 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. అలాగే.. దీనికి సంబంధించిన హార్డ్‌వేర్ కిట్‌ను రూ.34 వేలు చెల్లించి కొనుగోలు చేయాలి. ఈ ప్లాన్ కింద వినియోగదారులు అపరిమిత డేటాను అందుకుంటారు. 30రోజుల ఉచిత ట్రయల్ పీరియడ్ ఉంటుంది. గృహ వినియోగదారులకు సంబంధించి నెలవారీ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను వెల్లడించిన స్టార్‌లింక్.. వాణిజ్య వినియోగానికి సంబంధించిన ప్లాన్లను విడుదల చేయలేదు. అయితే.. మనదేశంలో అదే రూ.8600తో ఏడాది మొత్తం బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుకోవచ్చని.. ఆ ప్యాకేజీలోనే కొన్ని ఓటీటీలను కూడా ఉచితంగా చూడొచ్చని నెటిజన్లు గుర్తుచేస్తున్నారు. రూ.500కే అపరిమిత ఇంటర్‌నెట్ సేవలు లభించే ఇండియాలో.. స్టార్‌లింక్ ఈ స్థాయి ధరలతో మనుగడ సాగించడం కష్టమేనంటున్నారు.



6 క్వారీలకే జరిమానా కడతాం!

- మిగతా 12 ఇసుక క్వారీలకు ఏపీనే చెల్లించాలి: సుప్రీంకోర్టులో జేపీ వెంచర్స్

న్యూఢిల్లీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జరిగిన ఇసుక అక్రమాలపై జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్‌జీటీ) విధించిన జరిమానాను ఏపీ ప్రభుత్వమే చెల్లించాలని జయప్రకాశ్ వెంచర్స్ పవర్ లిమిటెడ్(జేపీ వెంచర్స్) సుప్రీంకోర్టుకు తెలిపింది. ఎన్‌జీటీ ఆదేశించిన విధంగా రూ.18 కోట్ల జరిమానాను రెండు వారాల్లోపు రిజిస్ట్రీలో డిపాజిట్ చేయాలని జేపీ వెంచర్స్‌ను కోర్టు గతంలో ఆదేశించింది. దీనిపై ఆ సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. దానిపై సోమవారం జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. జేపీ వెంచర్స్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 18 ఇసుక క్వారీల్లో ఆరింటికి మాత్రమే తాము పర్యావరణ అనుమతులు(ఈసీ) తీసుకున్నామని, మిగిలిన 12 క్వారీలకు అప్పటి ప్రభుత్వమే అనుమతులు తీసుకుందన్నారు. అందుచేత తాము అనుమతి తీసుకున్న ఆరింటికి మాత్రమే జరిమానా కడతామని, మిగిలిన 12 క్వారీలకు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని, ఈ మేరకు ఆదేశాలివ్వాలని కోర్టును కోరారు. రాష్ట్రప్రభుత్వం తరఫున వాదనలు వినిపించేందుకు సమయం కావాలని న్యాయవాది కోరడంతో.. ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 15కి వాయిదా వేసింది. ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి జేపీ వెంచర్స్‌కు ఎన్‌జీటీ దాదాపు రూ.18 కోట్ల జరిమానా విధించింది. ఈ తీర్పును ఆ సంస్థ 2023 మే 15న సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. జరిమానా చెల్లింపుపై కోర్టు ఆ ఏడాది జూలై 14న స్టే విధించింది. ఆ తర్వాత జరిగిన విచారణ సందర్భంగా స్టే ఉత్తర్వులను రద్దుచేసింది. 2 వారాల్లోపు రిజిస్ట్రీలో డిపాజిట్ చేయాలని ఆదేశించింది.

పల్లె రోడ్లకు మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)



శ్రీకారం చుట్టారు. కేంద్ర ప్రభుత్వ పథకం స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్(సాస్కి) నిధులతో రాష్ట్రవ్యాప్తంగా 12,999 రోడ్లను నిర్మించేందుకు రంగం సిద్ధం చేశారు. రూ.2,123 కోట్లతో 4,007 కి.మీ. మేర పల్లె రోడ్లను నిర్మించనున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఒకట్రెండు రోజుల్లో ఈ పనులకు పరిపాలన మంజూరు ఉత్తర్వులు జారీ చేయనుంది. 157 నియోజకవర్గాల్లోని 484 మండలాల్లో పనులు చేపట్టనున్నారు. జియో రూరల్ రోడ్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా దెబ్బతిన్న రోడ్ల సమాచారాన్ని క్రోడీకరించి పనులు మంజూరు చేస్తున్నారు. గతంలో ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల పరిధిలో దెబ్బతిన్న రోడ్లకు నిధులు కావాలని ప్రతిపాదనలిస్తే ఆ మేరకు పనులు మంజూరు చేసేవారు. అయితే కొన్ని చోట్ల రోడ్లు అధ్వానంగా ఉన్నప్పటికీ అక్కడ పనులు జరిగేవి కావు. పెద్దగా జనాలు ప్రయాణం చేయని రోడ్లను బాగు చేసే పరిస్థితి కొన్ని చోట్ల ఉండేది. దీంతో రియల్ టైమ్ వాస్తవిక పరిస్థితిని తెలుసుకుని రోడ్లను నిర్మించాలని పవన్ కల్యాణ్ ఆదేశించడంతో ఆ మేరకు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. పల్లె రోడ్ల సమాచారం ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చారు.

పవన్ ఆదేశాలతో..

రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని రోడ్లున్నాయి? అవి ఏ స్థితిలో ఉన్నాయి? బాగా దెబ్బతిన్నవి ఎన్ని? బాగా ఉన్నవి ఎన్ని? ఒక మోస్తరుగా ఉన్న రోడ్లెన్ని?.. తదితర సమాచారం ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం రికార్డుల్లోనే ఉంది. ఎప్పుడైనా వాటి స్థితిగతుల తాజా సమాచారం తెలుసుకోవాలంటే క్షేత్ర స్థాయిలో ఉన్న ఏఈ దాకా ఫైల్ నడపాలి. అయితే రోడ్ల అభివృద్ధికి మనకున్న పరిమితమైన వనరులను సద్వినియోగం చేసుకోవాలంటే రోడ్ల సమాచారం రియల్‌టైమ్‌లో అవసరమవుతుంది. ప్రజాప్రతినిధులు అడిగిన రోడ్లను మంజూరు చేయడం ఇప్పటి వరకూ ఆనవాయితీగా ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లి రోడ్ల పనులు మంజూరు చేసుకుంటేనే ఆయా రోడ్లు బాగుపడుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ రోడ్ల వాస్తవిక పరిస్థితి గురించి పూర్తి సమాచారం ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఈఎన్‌సీ, ఇంజనీరింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించి పంచాయతీరాజ్ రోడ్ల పూర్తి డేటాను జియో రూరల్ రోడ్స్ యాప్ ద్వారా సేకరించారు. దానిని జియో రూరల్ రోడ్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(జీఆర్ఆర్ఎంఎస్) పోర్టల్‌కు అనుసంధానించారు. ఆయా రోడ్లకు డిస్ట్రిక్ట్ రూరల్ రోడ్స్ పంచాయతీరాజ్(డీఆర్ఆర్‌పీ) కోడ్ నంబర్లు కూడా కేటాయించారు.

వెబ్‌సైట్‌లో రోడ్ల వివరాలన్నీ..

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో గ్రామానికి, మరో గ్రామానికి కనెక్టివిటీ ఉన్న రోడ్లు రాష్ట్రంలో సుమారు 31,332 ఉన్నాయని గుర్తించారు. 67 వేల కి.మీ. మేర ఉన్న ఈ రోడ్ల వివరాలన్నీ ఇక వెబ్‌సైట్‌లో అందుబాటులోకి రానున్నాయి. గతంలో కొన్ని రోడ్లను ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై) ద్వారా చేపట్టారు. పీఎంజీఎస్‌వై రోడ్లన్నింటికీ డీఆర్ఆర్‌పీ కోడ్‌లు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయా రోడ్లకు అవే కోడ్‌లను కొనసాగించి, మిగిలిన రోడ్లకు కొత్త కోడ్ నంబర్లు కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా 47,267 నివాసిత ప్రాంతాల్లో ఈ కనెక్టివిటీ రోడ్లు ఉన్నాయి. ప్రతి మూడు నెలలకో సారి ఆయా రోడ్ల స్థితిని స్థానిక ఇంజనీర్లు అప్‌డేట్ చేస్తారు. రోడ్ల ఫొటోలను కూడా వెబ్‌లో ఉంచుతారు. గ్రామాల్లో ఏయే రోడ్లు ఎలా ఉన్నాయి? ఆయా రోడ్లు నిర్మించిన ప్రాంతంలో నేల స్వభావం ఏంటి? తారు, సిమెంట్, గ్రావెల్, ఎర్త్ రోడ్లలో ఏ తరహా రోడ్లు? అన్న సమాచారం కూడా అందుబాటులో ఉంచుతున్నారు. రోడ్లను బ్యాడ్, ఫెయిర్, వెరీ ఫెయిర్, గుడ్, ఎక్సలెంట్ అనే కేటగిరీలుగా విభజిస్తున్నారు.

పోర్టల్ ఆధారంగా మంజూరు

కేంద్ర ప్రభుత్వం సాస్కి పేరుతో రాష్ట్రాలకు 50 ఏళ్ల పాటు తిరిగి చెల్లించే విధానంలో వడ్డీరహిత రుణాలను అందిస్తోంది. ఆర్అండ్‌బీ, టూరిజం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో మౌలిక వసతుల కల్పనకు ఈ నిధులను వినియోగించుకోవచ్చు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రోడ్ల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2,123 కోట్లను సమీకరించుకోనున్నారు. ఈ నిధులను గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు వినియోగిస్తారు. 67 వేల కి.మీ. మేర రోడ్లలో.. పోర్టల్ ఆధారంగా బాగా దెబ్బతిన్న రోడ్లకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి రోడ్ల పనులను మంజూరు చేయాలని నిర్ణయించారు. ఈ పోర్టల్‌ను త్వరలో ప్రారంభించనున్నారు.

లొంగిపోయిన వంశీ అనుచరుడు 'కోట్లు'

- కోర్టులో హాజరుపరిచిన పోలీసులు
- సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో 15 వరకు రిమాండ్



విజయవాడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ప్రధాన అనుచరుడు కొమ్మా కోటేశ్వరరావు అలియాస్ కోట్లు పోలీసులకు సోమవారం లొంగిపోయాడు. పోలీసులు అతడిని ఏసీబీ కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి పి.భాస్కరరావు ఈనెల 15 వరకు రిమాండ్ విధించారు. సత్యవర్ధన్ కిడ్నాప్‌లో వంశీ ప్రణాళికను అమలు చేసిన కోట్లును కేసులో ఏ2గా చేర్చారు. ఈకేసులో ఇటీవలే ఇద్దరు నిందితులు ఏ6 వజ్రకుమార్, ఏ3 తేలప్రోలు రాము కోర్టులో లొంగిపోయారు. అలాగే ఏ9 ఎర్రంశెట్టి రామాంజనేయులును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. హైదరాబాద్‌లో ఉంటున్న కోట్లు ఇటీవల విజయవాడకు వచ్చి పటమట పోలీసులకు లొంగిపోయాడు. అతడిని నెల్లూరు జైలుకు తరలించాలని కోర్టు ఆదేశాలిచ్చింది.

రోణక్ భోజన పిటిషన్‌పై మెమో

విజయవాడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడు జెస్సీ ఫాల్గట్ కుమార్ అలియాస్ రోణక్ కుమార్ తనకు జైన మత సంప్రదాయం ప్రకారం ఇంటి భోజనాన్ని అనుమతించాలని దాఖలు చేసిన పిటిషన్‌పై ఏసీబీ కోర్టులో సోమవారం జైలు అధికారులు నిబంధనలను మెమో రూపంలో దాఖలు చేశారు. గుంటూరు జిల్లా జైలు సూపరింటెండెంట్ కాంతరాజు కోర్టుకు హాజరై ఆ మెమో దాఖలు చేశారు.

మాజీ ఎమ్మెల్యే 'ఆళ్ల'కు చుక్కెదురు

- సీఎంపై ఐఆర్ఆర్ కేసులో పిటిషన్ స్వీకరణకు కోర్టు నిరాకరణ

విజయవాడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంతంలో నిర్మించబోయే ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) అలైన్‌మెంట్ మార్పులో అవకతవకలు జరిగాయని సీఎం చంద్రబాబు, మంత్రి పి.నారాయణపై నమోదైన కేసులో మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి కోర్టులో చుక్కెదురైంది. కేసులో తీర్పు ఇచ్చేముందు తన వాదనలను వినాలని ఆళ్ల ఏసీబీ కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. దీనిని స్వీకరించడానికి న్యాయస్థానం నిరాకరించింది. ఐఆర్ఆర్‌కు సంబంధించి వైసీపీ హయాంలో ఆళ్ల ఫిర్యాదుపై సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు.

కల్తీ నెయ్యి కేసులో సిట్ కస్టడీకి టీటీడీ మాజీ జీఎం సుబ్రహ్మణ్యం, సుగంధి

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): టీటీడీ కల్తీ నెయ్యి కేసు విచారణలో మరింత కీలక సమాచారం రాబట్టేందుకు సీబీఐ సిట్‌కు అవకాశం దక్కింది. వైసీపీ హయాంలో టీటీడీ ప్రొక్యూర్‌మెంటు జీఎంగా పనిచేసిన సుబ్రహ్మణ్యం, భోలేబాబా డెయిరీ అధికారిక ప్రతినిధి అజయ్ సుగంధిని నాలుగు రోజుల పాటు సీబీఐ సిట్ కస్టడీకి ఇవ్వడానికి సోమవారం నెల్లూరు ఏసీబీ కోర్టు అనుమతినిచ్చింది. దీంతో మంగళవారం నిందితులిద్దరినీ నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి తిరుపతికి తీసుకురానున్నారు. వీరి కస్టడీ పిటిషన్లను ఈ నెల 3న విచారించిన ఏసీబీ కోర్టు.. తీర్పును పెండింగ్‌లో పెట్టిన విషయం తెలిసిందే.

నకిలీ మద్యం కేసులో నలుగురికి కస్టడీ

విజయవాడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో నలుగురు నిందితులు ఏ5 సయ్యద్ హాజి, ఏ6 కట్టా రాజు, ఏ9 మిథున్ దాస్, ఏ10 అంతా దాస్‌లను ఐదు రోజులపాటు సిట్ కస్టడీకి ఇస్తూ న్యాయస్థానం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది.

కసిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై 11న తీర్పు

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):మద్యం కుంభకోణం కేసులో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై ఈనెల 11న నిర్ణయం వెల్లడిస్తామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రకటించారు. బెయిల్ పిటిషన్ సోమవారం విచారణకు రాగా.. సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది లూథ్రా, పిటిషనర్ తరఫున న్యాయవాది యుగంధర్ రెడ్డి వాదనలు వినిపించారు.



అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో సోమవారం ఉదయం కమ్మేసిన పొగమంచు

అరకులోయలో 3.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

విశాఖపట్నం, పాడేరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉత్తరాది పొడిగాలుల ప్రభావంతో ఉత్తరకోస్తాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. నాలుగు రోజుల క్రితం వరకూ రెండంకెల సంఖ్యలో ఉన్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఆదివారం నుంచి సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా దళపతిగూడ (అరకులోయ)లో 3.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో అత్యల్ప ఉష్ణోగ్రత ఇదే కావడం విశేషం. ఇక, జి.మాడుగుల, డుంబ్రిగుడలలో 3.9, కిలగాడలో 4.6, పాడేరులో 4.8, పెదబయలులో 6.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని మైదాన ప్రాంతంలో కూడా చలి పెరిగింది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. వాయవ్య భారతం నుంచి మధ్యభారతం వరకు అధికపీడనం కొనసాగుతున్నందున ఉత్తరాది నుంచి కోస్తా, రాయలసీమ వరకూ గాలులు వీస్తున్నాయని, దాంతో చలితీవ్రత పెరిగిందని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు. ఇంకా రాష్ట్రంలో వర్షాలు లేకపోవడం కూడా చలి పెరగడానికి ఒక కారణమన్నారు. ఈనెల 13వ తేదీ తరువాత బంగాళాఖాతం నుంచి తూర్పుగాలులు వీచే అవకాశం ఉందని, అప్పటివరకూ రాష్ట్రంలో చలి కొనసాగుతుందని పేర్కొన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.